ప్రతిభని గౌరవిస్తేనే సమాజం సుసంపన్నం అవుతుంది!

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

ఒక దేశంగా అమెరికా వయసు 200 ఏళ్ళు మాత్రమే. యూరోప్‌లో ఉన్న చాలా దేశాలతో పోలిస్తే అది 5వది, మన హిందూ దేశం వయసుతో పోల్చినప్పుడు 10వది. బ్రిటిష్ వారు భారత దేశం దయచేయక ముందు అసలు ఇండియా అన్నదే లేదని ఎవరైనా అంటే ఆ వ్యక్తికి అసలు తన చరిత్రే తనకి తెలియదని లేదా భారత దేశం అంటే ఏమిటో తెలియదని అనుకోవాలి. అమెరికావారు ఎంత సుదీర్ఘ కాలం స్వేచ్ఛగా ఉన్నారో దాదాపు అన్నేళ్ళు బ్రిటిష్ వారు మన దేశాన్ని పాలించారు. అయితే అది పూర్తిగా వేరే విషయం. బ్రిటిష్ వారి వలసగా ఒకప్పుడు నిద్రాణమైన స్థితిలో ఉన్న అమెరికా అత్యంత శక్తివంతమైన దేశంగా రూపొందటం అన్నది ఆధునిక ప్రపంచపు అద్భుతాలలో ఒకటి. అంతే కాక మనం, అంటే పునర్జన్మ ఎత్తిన భారతీయులం, శక్తి వంచన లేకుండా నేర్చుకోవటానికి కృషి చెయ్యాల్సి ఉన్న వాటిలో అది ఒకటి.

మనం దానిని బ్రిటిష్ వారి నుంచి నేర్చుకోలేము, రష్యన్‌లనుంచి అసలే కాదు. ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన లిబర్టీ విగ్రహం శత వార్షికోత్సవాలని గురించి బ్రిటిష్ వారు పంపిన సమాచారాన్ని పట్టి చూస్తుంటే అసలు ఆ దేశాన్నే ప్రపంచ పటం నించి తుడిచి వేయాలన్న ఆవేశం మీకు కలుగుతుంది. బ్రిటిష్ వారి సమాచారాన్ని బట్టి అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ప్రతిదీ తప్పే. వాళ్ళు చాలా సంపన్నులు, ధనవంతులు కానప్పుడు వారు చాలా పేదవారు వాళ్ళు చాలా శక్తివంతులు, ఎంత శక్తి కలవారంటే ప్రపంచానికి ప్రమాదకరమైనటువంటి శక్తి సంపన్నులు. ఇటువంటివే ఇంకా ఎన్నో బ్రిటిష్ వారు అమెరికా వారిని గురించి చెబుతారు. అమెరికా వారు ఆర్థికంగా, తదితరంగా విజయాన్ని సాధించటం అన్నదే బ్రిటిష్ వారి, తదితరుల ఆగ్రహానికి కారణం.


త్వరితగతిని అభివృద్ధిని సాధించటం అన్న దానిని అమెరికన్‌లు తెలుసుకున్నారు. దానితో బ్రిటిష్ వారు కానీ మనం గానీ పోటీ పడలేము. భారత దేశంలో విజయం సాధించిన వ్యక్తి ఎవరైనా ఉంటే అతనికి ఏదో ఒక కళంకం అంటగడతారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో విజయాన్ని సాధించిన వ్యక్తిని దాదాపు ఒక పవిత్రుడైన వ్యక్తిగా భావిస్తారు. అతను తప్పు చెయ్యడని వారి నమ్మకం. భారత దేశంలో విజయవంతమైన రాజకీయ వాదికి గతం అనేక అక్రమాలతో నిండి ఉంటుంది. రాష్ట్రాలలో కూడా అలాగే ఉంటాయి. కానీ అతను విజయాన్ని సాధించి సమాజానికి ఉపయోగపడితే అతను కొంత వరకూ క్షమార్హుడవుతాడు.

సాపేక్ష సిద్ధాంతానికి మూల పురుషుడైన ఐన్‌స్టీన్ స్విట్జర్లాండ్‌లో చదువుకున్నా జర్మనీలోనే పుట్టాడు. కానీ ఆయన తన మాతృ దేశంలో గుర్తింపబడలేదు. అక్కడ ఆయనకి ఉద్యోగం దొరకటం కూడా కష్టమైంది. హిట్లర్ అధికారంలోకి రాక ముందు చాలా కాలం కిందటే ఆయన యూదు జాతీయత ఆయనకి ఒక అడ్డుగోడగా నిలిచింది కానీ అమెరికా వారు ఆయనని తమతో కలుపుకోటానికి సంసిద్ధతని వ్యక్తం చేసారు. ఎన్నో ఏళ్ళపాటు ఆయనకి అనేక ఉద్యోగాలని, డబ్బుని ఇస్తామని అన్నా కూడా హిట్లర్ మనుషుల చేత దాదాపు జర్మనీ నుంచి వెళ్ళగొట్టబడేంత వరకూ ఆయన వాటిని స్వీకరించలేదు. బ్రిటిష్ వారు ఆయనని ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జిలలో ఉపన్యాసాలు ఇవ్వటానికి మాత్రమే ఆహ్వానించారు కానీ తమ దేశంలో స్థిరంగా ఉండటానికి ఇష్టపడలేదు. అమెరికన్‌లు మాత్రమే ఆయనను ఎటువంటి ప్రశ్నలు అడగకుండా పూర్తి స్వేచ్ఛని ఆయనకి ఇస్తూ తమ దేశంలోకి ఆహ్వానించారు. అక్కడి విజ్ఞాన శాస్త్ర వ్యవస్థ కూడా ఆయన పనిని గురించి ఎలాంటి ఇబ్బందినీ వ్యక్తం చెయ్యలేదు.

జర్మనీ, ఇంగ్లాండ్, కొంత వరకూ భారత దేశంలాంటి స్థిరమైన సమాజాలు విజయాన్ని సాధించటానికి అవలంబిస్తున్న ఒకరకమైన దృక్పథానికి కారణాలు అనేకం ఉన్నాయి. స్థిరమైనటువంటి పాత సమాజాలు వాటి వాటి స్వప్రయోజనాలని రూపొందించుకుంటాయి. అందువల్ల బయటి వారు వీటిలో ప్రవేశించటానికి వీలులేనంత కఠినంగా ఉంటాయవి. ఇంగ్లాండ్‌లో రూథర్ ఫోర్డ్‌లు, జె. జె. థాంసన్‌ల వంటి నోబెల్ బహుమతి గ్రహీతలు ఆ దేశంలోని వైజ్ఞానిక వ్యవస్థపై పూర్తి ఆధిపత్యం కలిగి ఉండేవారు. ఐన్‌స్టీన్ వంటి వ్యక్తి ప్రవేశం వైజ్ఞానికంగా, ఇతరంగా కూడా వారికి సంకటంగా ఉండేది. అమెరికా సంయుక్త రాష్ట్రాల విషయం వేరు. అక్కడ అందరూ బయటివారే. ఆ దేశంలోని సామాజిక వ్యవస్థ కూడా అందరికీ అనుకూలంగా, ఎవరికైనా ఎప్పుడైనా ప్రవేశానికి అనువుగా ఉంటోంది. అందువల్లనే ఐన్‌స్టీన్, ఫెర్మి, మిల్లికాన్ వంటి వారి ప్రవేశం ఎవరినీ భయభ్రాంతులని చెయ్యలేదు. ఐన్‌స్టీన్ కోసం అమెరికా వారు ఒక కొత్త సంస్థని సృష్టించి అంది పుచ్చుకున్న రీతిలో ఆయనకి దాన్ని అప్పచెప్పారు. ఆయనకి కావలసింది లెక్కలు వేసుకోడానికి కావలసినటువంటి కొన్ని కాగితాలు, పెన్సిళ్ళు మాత్రమే అయినా ఆయనకి ఒక సంస్థనే అప్పగించారు.


భారత దేశంలో వివిధ అంచెలతో కూడిన అధికార వ్యవస్థ చాలా బలమైనది, కఠినమైనది. జూనియర్‌లకి దానిలోకి ప్రవేశం కష్టం. జూనియర్ సైంటిస్టులు ఆత్మహత్యలకి పాల్పడే దేశం బహుశ ఒక్క భారత దేశమేనేమో! ఒకళ్ళిద్దరు కాదు, వాళ్ళ

(13 వ పేజి చూడండి)





సమృద్ధ పరిమళము
సరియైన ధరతో



ప్రేమ్ - తాజాతనము నందించు సబ్బు

గులాబి మరియు ఆకుపచ్చ రంగులలో లభించును'

జయలక్ష్మి
గుంటూరు వారి
తయారీ

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు : (1938-1972)

8-14 ఆగస్టు 1986
శ్రీ అక్షయ నామ సం. శ్రావణ శు. తదియ
సంపుటము 78 : సంచిక 48

సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు. 2-50
పోస్ట్‌లో 6నెలల చందా	రు. 71.50
పోస్ట్‌లో 12నెలల చందా	రు. 143.00

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
నటి సుహాసిని
(ఫోటో : కె. ఆర్. వి భక్తా)

కథలు :

సీరియల్ నవలలు:

వ్యాసాలు, శీర్షికలు :

ఉత్తరాలు

సీరియల్స్

"చిరంజీవి" ముఖచిత్రంతో వెలువడిన "ఆంధ్ర సచిత్ర వారపత్రిక" చాలా బావుంది. "కరిగిన శిల" సిరియల్ చదివినకొద్దీ సంతోషం ఆపుకోలేకపోతున్నాము.

ఆర్. మధుసూదన్, అంబుసోలి

★ ★ ★

చిరంజీవి ముఖచిత్రంతో వెలువడిన పత్రిక ఆకర్షణీయంగా వున్నది. "కాల్‌గర్ల్" సిరియల్ అత్యంత ఆసక్తికరంగా వున్నది.

శ్రీవాణి, అపిలేపల్లి

★ ★ ★

ఇప్పటివరకు ఏ తెలుగు నవలకూ యానాదుల జీవితాన్ని తాకే ధైర్యం లేకపోయింది. 'సర్పయాగం' ఆ సాహసం చేసింది. తెలుగు రచయితల దృష్టిలో అశ్పృస్యంగా పడివున్న యానాదుల జీవిత కథా వస్తువుకు గౌరవాన్ని యిచ్చి అక్షరాల్లో ఆవిష్కరిస్తున్న వీరపల్లి వీణావాణిగారికి, ప్రచురిస్తున్న ఆంధ్ర సచిత్ర వారపత్రికకూ శతకోటి అభివందనాలు.

ద్వివేదుల రాంప్రసాద్, మదరాసు

పెద్ద కథ

4-10 జూలై '86 హిరో చిరంజీవి ముఖచిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వారపత్రిక చాలా ఆకర్షణీయంగా ఉంది. పెద్ద కథ "మిత్ర చతుష్టయం" చాలా బాగున్నది.

గంధం సుబ్బారావు, మంగతాయారు,
ఉప్పులూరు

4-10, జూలై '86న సుప్రీం స్టార్ చిరంజీవి ముఖచిత్రంతో అత్యంత ఆకర్షణీయంగా విడుదలైన ఆంధ్ర సచిత్ర వారపత్రిక కనులపండుగగా, వేయి వెలుగులు కాంతి కిరణంలా ఉందని చెప్పటానికి సంతోషిస్తున్నాం! "మిత్ర చతుష్టయం" పెద్ద కథ మమ్మల నాకట్టుకుంది.

బి. కేశవ్, కె. భాస్కర్,
తాడేపల్లిగూడెం

వ్యాసాలు

27 జూన్-3 జులై పత్రిక ముఖచిత్రం చాల బాగుంది. భక్తుల పాలిటి కల్పతరువు, శ్రీ షిర్డి సాయి బాబా, టి. ఎస్. హిమబాల గారి వ్యాసం.... అందుకు తగినట్లు, కళ్ళకు కట్టినట్లుగా రంగు రంగుల ఫోటోలుతో మా యింటిల్లి పాదిని సంతోష పరచాయి. మేము స్వయంగా శ్రీ సాయి బాబా క్షేత్రంలో ఉన్నంతగా ఫీలయ్యాం. వారి గురించి చాలా విషయాలు తెల్సుకున్నాము.

కిర్తి కష్టయ్య, లక్ష్మి దేవి పల్లి

డాషింగ్, డేరింగ్, డైనమిక్ హిరో, సుప్రీం స్టార్ చిరంజీవి ముఖచిత్రంతో వెలువడిన 4-10 జూలై '86 ఆంధ్ర సచిత్ర వారపత్రిక మా ఇంటిల్లిపాదిని ఆకర్షించింది.

ఒక దోషికి శిక్షపడకపోయినా ఫరవాలేదు. కాని ఒక నిర్దోషిని అనాలోచితంగా శిక్షించటం ఎంత దారుణ పరిస్థితులకు దారితీస్తుందో - వాసు ఆత్మహత్య నిరూపిస్తుంది అని "మ్రొక్కిన వరమిని వేల్పు" కథ ద్వారా నిరూపించారు రచయిత్రి ఆదూరి సావిత్రిగారు.

జి. రమణిమోహన్, మణిమాల, కడప

★ ★ ★

4-10 జూలై '86 చిరంజీవి ముఖచిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వారపత్రికలోని "పితృదేవో భవ" గోవిందరాజు రామకృష్ణారావు గారికథ హృదయాన్ని కదిలించింది కొడుకులు కావాలని కోరికతో కని పెంచితే ప్రతిఫలము చివరి దశలో కొడుకు కోడలితో చివాట్లు తినడం నిజంగా విచారించదగిన విషయము.

డి. నర్సింగరావు, డి. విజయలక్ష్మి,
పటానుచెరువు □

సీరియల్

సంకెళ్ళెవరికి?

డాక్టర్ కొత్త రవీంద్రబాబు



(గత సంచిక తరువాయి)

నాగయ్య వెళ్ళగానే తోట కాపలా అతన్ని పిలిచి జాగ్రత్తగా చూస్తుండమని హుసేన్ దగ్గరకు వెళ్లాడు రాఘవరావు.

జరిగిన విషయం చెప్పి "మీ ఎరికలో ఎవరైనా తోట అజమాయిషి చూసేవారుంటే చెప్పండి" అని అడిగాడు.

"లేదు సాబ్ అంతా అలాటి వాళ్ళే! ముందు లేకపోయినా నాలుగు రోజులు గడువగానే దుర్బుద్ధి పుడుతున్నదెవరికైనా! అంతకంటే మరో మార్గమున్నది. తరుణంలో మీరు వచ్చి ఎరువులు వేసి మందు కొట్టించి వెళుతుండండి కాపు మేము కొనుక్కుని తోట కాపలా చూస్తూ పై అజమాయిషీ చూస్తాం" అన్నాడు.

అతను చెప్పింది బాగానే వుందనిపించింది రాఘవరావుకు.

హుసేన్ సాలుకు తోట ఫలసాయం నలభైవేల రూపాయలు ఇచ్చేట్టు రాఘవరావు దాదాపు పదివేల రూపాయల ఎరువులు, పురుగుమందు కింద ఖర్చు చేసేట్లు ఖరారు చేసుకుని హుసేన్ దగ్గర పదివేలు ఎడ్వాన్సు తీసుకున్నాడు.

ధిల్‌పసంద్‌కు తిరిగి వచ్చి నాలుగు రోజులు అక్కడే వుండి తోటకు వేయించవలసిన ఎరువు, చీడ మందూ దగ్గరుండి వేయించాడు.

తోట కాపలా అతనితో నాగయ్యను గాని ఛమేలిని గాని లోపలకు అడుగు పెట్టనివ్వవద్దని చెప్పి ఇంటికి బయల్దేరాడు - కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో.

"అంకుల్!" అంటూ గేటు వాకిలి వద్దకు పరిగెత్తుకు వచ్చింది రూప.

"డాలీ! చిట్టి తల్లీ" అంటూ ఎత్తుకుని లోపలకు వచ్చాడు రాఘవరావు.

"ఏమిటి? ఇన్నాళ్ళున్నారక్కడ?" అంటూ వచ్చింది వనజ.

"తోటకు పట్టిన చీడ వదిలించేసరికి ఇంతకాలం పట్టింది! బాబాయి బాబాయి అనుకుంటే ఎంత పని చేసాడో చూశావా? తోటలో వచ్చిన డబ్బు వచ్చింది వచ్చినట్లు నగలు చేయించి వుంచుకున్నదాని మెడలో దిగేశాడు." అంటూ ఛమేలీ నగలన్నీ గుట్టగా వనజ ముందు పోసాడు.

"ఆ మామయ్య ఇంత పని చేసాడా?" అంటూ వనజ ఒకో నగా తీసి పరీక్ష చేస్తుంటే

"మామ అంటే అంకుల్ గదా!" అంటూ రూప కూడా వచ్చి వనజ వళ్లో కూర్చుని నగలు తీరికగా పరీక్ష చేయసాగింది.

సూట్‌కేస్ నుండి కారు బొమ్మ తీసి డాలీకిచ్చి లోపలకు వెళ్లాడు రాఘవరావు.

బొమ్మ తీసుకుని లోపలకు పరుగెత్తింది డాలీ! గదులన్నీ తిరిగివచ్చి "ఆంటీ! స్వరూప్ ఏడీ?" అంటూ వచ్చింది.

"బాత్‌రూమ్ దగ్గర నీళ్లతో ఆడుకుంటున్నాడేమో?" అంటూ వెళ్ళింది వనజ.

స్వరూప్‌కు ఇంకా మాటలు రావడంలేదు. ఇప్పుడిప్పుడే నడుస్తున్నాడు. బాత్ రూమ్ తలుపు తెరచివుంటే వెళ్లి నీళ్లతో ఆడుతుంటాడు. అందుకని బాత్‌రూమ్ తలుపు మూసి వుంచుతున్నారెప్పుడూ. వీడికసలు మాటలు వస్తాయో? రావో? డాలీ అలా వుషారుగా ఇల్లంతా తిరుగుతుంటే వీడు మాటా పలుకూ లేకుండా వుంటున్నాడు. ఎలాగో? అనుకుంటూ వనజ బాత్‌రూమ్ దగ్గరకు వెళ్ళింది. లోపల స్వరూప్ లేడు! ఎక్కడికి వెళ్లాడబ్బా? అనుకుంటూ ఇల్లంతా వెతికింది. ఎక్కడా కనపడలేదు. సాధారణంగా అతడు ఇల్లు దాటి వెళ్ళడు. అయినా కాంపౌండు అంతా గాలించినా కనపడకపోయే సరికి వీధిలోకి వెళ్లి ఇరుగు పొరుగువారితో "మా స్వరూప్‌నుగాని చూసారా?" అని అడిగింది.

"లేదమ్మా! చూడలేదు" అన్నారు వాళ్ళు. ఎవరింట్లోకయినా వెళ్ళాడేమోనని చుట్టుప్రక్కల అన్ని యిళ్ళలోనూ వెతికారు. ఎక్కడా కనపడలేదు.

వీధి చివర వాళ్ళ యింటి అబ్బాయి ఏడేండ్లవాడు "మరేం, ఇందాకే ఎవరో స్వరూప్‌ను ఎత్తుకుని యిటు వెళ్లారు" అని చెప్పాడు.

అతను చూపిన దారిన వెళితే బస్టాండు వస్తుంది.

"పిల్లల్నెత్తుకెళ్ళే దొంగలొస్తున్నారు"

"కాదు! బాబా ఎవరో పిల్లల్ని తెప్పించి తన ఆశ్రమంలో పెంచుతాడట"

"తీసుకుపోయి అమ్ముకుంటారు"

"ఆ! కాలో చేయో విరిచేసి బిచ్చమెత్తుకోవటానికి పంపుతారు!"

"దేవికి పిల్లల్ని బలి యిస్తే స్వర్ణయోగం అబ్బుతుందిట!" చుట్టూ జేరిన వాళ్ళు తలో మాటా అంటూంటే

ఇక వినలేక యింటికి పరిగెత్తి మంచంమీద పడి ఏడవసాగింది వనజ.

రిక్షాలో బస్టాండుకు బయల్దేరాడు రాఘవరావు. ఈ మూడేళ్ళుగా స్వరూప్ వునికి పెద్దగా పట్టించుకోలేదతడు. ఎవరి విలువయినా ఎదురుగా వున్నప్పుడు కంటే లేనప్పుడు ఎక్కువ తెలుస్తుంది. స్వరూప్‌ను ఎవరో ఎత్తుకు పోయారని వినగానే రాఘవరావుకండ్ల ముందు అతని రూపమే మెదలాడసాగింది.

జరిగిన కథ - 2: రాఘవరావు, శివానంద మంచి స్నేహితులే కాక బిజినెస్ పార్ట్‌నర్స్ కూడా. శివానంద భార్య గిరిజ ఆడపిల్లను ప్రసవించిన రోజే రాఘవరావు భార్య వనజ మగపిల్లవాడిని ప్రసవించింది. ఆరోజే శివానంద ఏక్సిడెంట్‌లో మరణించగా ఆ వార్త విన్న గిరిజ గుండె ఆగి చనిపోయింది. అనాథ అయిన వారి కుమార్తెకు రూప అని పేరు పెట్టి తమ కుమారుడైన స్వరూప్‌తో సమానంగా ఆ పాపను పెంచసాగారు రాఘవరావు దంపతులు. రాఘురావుకి రూప అంటే అమిత ముద్దు. ఆ పాపను డాలీ అని ముద్దుగా పిలవసాగాడు. డాలీ పేరుతో ద్రాక్షతోట కొన్నాడు. ఆ తోట అజామాయిషీ వనజకు వేలు విడిచిన మేనమామ నాగయ్యకు అప్ప చెప్పాడు. తన మోసం బయట పడగానే రాఘవరావుమీద కోపంతో వెళ్లిపొయ్యాడు నాగయ్య.

బస్టాండులోంచి ఒక బస్ వెళుతుంటే రిక్షాలో నుల్చొని లోపలంతా చూశాడు. స్వరూప్ ఆచూకి కనపడలా!

రిక్షా దిగి హడావిడిగా నిలబడివున్న బస్సులన్నీ వెతికాడు. ఎందులోనూ స్వరూప్ ఆచూకి లేదు. ఎన్క్వయిరి ఆఫీసు దగ్గరకు వెళ్లాడు.

బస్టాండు నుండి గడచిన అరగంటలో అన్నివైపులకూ కలిసి పదిహేను బస్సులు వెళ్లాయి. ఎటు వైపని వెళతాడు? ఒకవేళ బస్టాండులో ఆగకుండా వాడు రైలుస్టేషన్‌కు వెళ్లాడేమో? లేదా యింత పెద్ద పట్టణంలో ఏ మూలనైనా దాక్కొని వుంటే ఎలా కనుక్కోగలడు.

ఉసూరుమంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. సర్కిల్ ఇన్స్పెక్టర్‌గారికి జరిగిన విషయం చెప్పి కంప్లెయింట్ వ్రాసి యిచ్చాడు. గుర్తులు చెప్పమంటే ఎడమ బొటన వేలి గోరు పై భాగంలో పెద్ద పుట్టు మచ్చ వుందని చెప్పాడు. ఇంటికి వెళ్లి స్వరూప్ ఫోటో తెచ్చి ఇన్స్పెక్టర్ గారికి యిచ్చాడు.

పోలీస్ స్టేషన్ నుండి తిరిగి వస్తుంటే రాఘవరావు మనసులో ఏదో వెలితి, నిర్లిప్తత, నిస్తబ్దత. మూడు సంవత్సరాలుగా స్వరూప్ వునికి మర్చిపోయి పాపం చేశాడు. కన్న బిడ్డ ముద్దూ ముచ్చటా చూచుకోకుండా అర్థంలేని ఆలోచనలతో దూరం చేసుకున్నాడు! తగిన శ్రద్ధ తీసుకుని పెంచి వుంటే స్వరూప్ డాలీలాగే యిప్పటికి మాటలు నేర్చుకొని ఇల్లంతా తెరుగుతుండే వాడేమో? శివ, గిరిజ పోయారని డాలీకి అన్యాయం జరగకుండా వుండాలని అనుకుంటూ కన్నబిడ్డకే తీరని అన్యాయం చేసాడు తను! ఇప్పుడు ఏ ముఖం పెట్టుకు వనజను చూడగలడు? నలుగురిలో ఎలా తల ఎత్తుకు తిరగగలడు?

ఇంటికి వెళ్లాలనిపించలేదు రాఘవరావుకు. కాని వొంటరిగా వనజ ఎంతగా కుమిలిపోతున్నదో! డాలీ బిక్కు బిక్కుమంటూ ఇంట్లో తిరుగుతూ వుంటుంది! మనసు రాయి చేసుకుని యింట్లో అడుగు పెట్టాడు.

ఆశగా తన వైపు చూస్తున్న వనజ ముఖంలోకి సూటిగా చూడలేక తల పక్కకు తిప్పుకున్నాడు. ఎప్పుడు అరుస్తూ వుషారుగా తిరుగుతూ వుండే డాలీ ఒక మూల కూర్చుని భయం భయంగా రాఘవరావు వంక చూడసాగింది. పెద్దవాళ్ల మనసుల్లోని భయం తాలుకు చిహ్నాలు చిన్నపిల్లలను కూడా బాధిస్తాయి కాబోలు!

* * * * *

స్వరూప్ ఫోటోతో సహా పత్రికలన్నిటిలోనూ ప్రకటనలు వేయించాడు; ఆచూకి తెలిపిన వారికి పదివేల రూపాయలు బహుమానం ఇస్తానంటూ రేడియో ఎనౌన్సుమెంటు చేయించాడు. ఆచూకి చెబితే గుడ్‌విల్ ఫండ్‌కు పెద్ద మొత్తం విరాళంగా యిస్తానని డి. యస్. పి. గారికి చెప్పి వచ్చాడు.



సంకెళ్లు వరికి?

స్వరూప్‌ను ఇంట్లోంచి ఎత్తుకు వెళ్లిన సమయానికి గంట తర్వాత విజయవాడ నుండి బయల్దేరిన బస్సులన్నింటి కండక్టర్లను విచారించారు సి. ఐ. డి. డిపార్టుమెంటువారు. మూడు సంవత్సరాల కుర్రవాడు - స్వరూప్ ఫోటో చూపుతూ ఎక్కడా అని ప్రశ్నిస్తే గుంటూరు బస్సు కండక్టరు మాత్రం అవునని సమాధానం చెప్పాడు.

"ఎక్కడ దిగాడు?"

"ఎక్కడ దిగాడో గుర్తుకు రావడంలేదు"

"మంగళగిరిలో దిగాడా?"

'లేదు!"

తర్వాత ఒకో స్టేషన్ పేరు చెప్పి అడిగాడు సి ఐ డి ఇన్స్పెక్టరు.

"లేదు" అనే వచ్చింది సమాధానం.

"మంగళగిరి ఇవతల ఏమయినా దిగాడా?"

"ఏమో సార్! ఉండవల్లి క్రాస్ రోడ్ దగ్గర బస్ ఆగింది, ఏదో ట్రాఫిక్ జామ్‌లో! అప్పుడు పాసింజర్లు కొంతమంది కిందకు దిగారు. వాళ్లలో అతనేమైనా వున్నాడేమో? తర్వాత అంతా ఎక్కారనుకుని బస్సుకు రైట్ చెప్పాను. అతడేమైనా దిగబడి పోయాడేమో తెలియదు."

సి. ఐ. డి. ఇన్స్పెక్టరు వుండవల్లి, తాడేపల్లి చుట్టుప్రక్కల వున్న వూర్లన్నీ తిరిగి గాలించాడు. ఎక్కడా స్వరూప్ ఆచూకీ దొరకలేదు.

అదే రాఘవరావుకు తెలియజేసారు.

రాఘవరావు స్వయంగా వచ్చి గుంటూరు బస్ కండక్టర్‌ను కలుసుకున్నాడు.

సి. ఐ. డి ఇన్స్పెక్టర్‌కు చెప్పిన విషయాలే మళ్లీ రాఘవరావుకూ చెప్పాడతను.

స్వరూప్ ఫోటో చూపిస్తే అతనేనని గుర్తుపట్టాడు. అంతకు మించి ప్రయోజనం లేకపోయింది. రాఘవరావుకు ఎందుకనో ఇది నాగయ్య పని అయివుంటుందని అనిపించింది.

నాగయ్య వాళ్ల వూరు బయల్దేరి వెళ్లాడు. ఇంటికి తాళం వేసివుంది. విచారిస్తే పది రోజులనాడే నాగయ్య వచ్చి అర్ధాంతరంగా ఇల్లూ పొలమూ బేరం పెట్టి అయిన ధరకు అమ్మి వెళ్లిపోయాడని చెప్పారు. వెళ్లేటప్పుడు హైద్రాబాద్ వెళ్లిపోతున్నానని చెప్పాడట!

నాగయ్య వంటరిగా వచ్చి వంటరిగా వెళ్లాడని చెప్పారు.

రాఘవరావుకు అంతవరకూ వున్న ఆశకూడా సన్నగిల్లింది. ఈ విశాల ప్రపంచంలో నాగయ్య ఎక్కడ వున్నాడని వెతుకుతాడు? స్వరూప్‌ను అతను ప్రాణాలతో వదలిపెట్టాడో లేదో?

నాగయ్య కోసం వెతికించటం కూడాసులభసాధ్యం కాదనిపించింది. అతని ఫోటో లేదు. యాభై సంవత్సరాలు దగ్గర పడుతున్న అతన్ని గుర్తులు చెప్పి మనుషులను పంపి వెతికించటం అసాధ్యం!

నాగయ్య ఆచూకీ దొరికితేనే కాని స్వరూప్ ఏమయ్యాడో తెలియదు అని నిర్ణయించుకొని ఇక తాను చేయగలిగిందేమి లేదని నిర్ధారించుకున్నాక మనసు రాయిచేసుకుని వ్యాపార విషయాలు చూడసాగాడు.

వనజ అంత త్వరగా స్వరూప్‌ను మర్చిపోలేక పోయింది.ఎంతయినా కన్నబిడ్డ, రక్తపాశం గుండెల్ని పిండుతుంటే కన్నీరు కారుస్తూ నిద్రాహారాలు మాని ఇంట్లో ఓ మూల పడివుండేది.

రూప దగ్గరకు వచ్చి"అత్తా ఆకలిగా వుంది. అన్నం తిందాం" అంటే వెళ్లి అన్న వడ్డించేది. అన్నం తినకుండా అలానే కూర్చున్న డాలీని-

"ఏమ్మా అలానే కూర్చున్నావు?" అని అడిగితే "నువ్వు కూడా అన్నం తిను" అనేది.

"నాకాకలిగా లేదు" అంటె

"నువ్వు తినకపోతే నేనూ తినను! స్వరూప్ కనపడటంలేదని నువ్వు అన్నం తినటంలేదని పక్కింటి ఆంటీ చెప్పింది!"

ఇంక డాలీ చేత చెప్పించుకోదం ఇష్టంలేక కళ్లనీళ్లను తుడుచుకుంటూ అన్నంపళ్లెం ముందు కూర్చునేది.

అత్త అన్నం తింటుందో లేదో అని మాటి మాటికి చెక్ చేస్తూ భోం చేస్తున్న డాలీని చూస్తే వనజ మనసులో ఆపేక్ష పొంగి పొరలేది.

"ఎవరకు ఎంతవరకు ప్రాప్తమో అంతవరకు దక్కుతుంది" అనుకుంటూ కన్నబిడ్డ లేకపోయినా తనకు డాలీ అయినా వున్నదనుకొని మనసును సంతృప్తిపరచుకోజూచేది.

కొడుకైనా, కూతురైనా, కోడలైనా డాలీనే! స్వరూప్, రూప పెరిగి పెద్దవారైతే వివాహం చేసి వేడుక చూద్దామని మూడేళ్ల నుండి అనుకుంటూ వచ్చింది. ఇప్పుడు స్వరూప్ దూరమయ్యాడు! రూప మాత్రం వున్నది.

మనసులో దుఃఖాన్ని దిగమ్రింగుకుని డాలీ పెంపకంలో స్వరూప్ దగ్గర లేడన్న దిగులును మరిచిపోయి కాలం గడపాలని నిశ్చయించుకుందామె.

నాగయ్య యింత పని చేసాడంటే నమ్మలేకుండా వున్నదామె! తల్లీ బిడ్డను విడదీసి పాపం వొడిగట్టుకొనేటంత కిరాకతం చేయటానికి తాను ఆయనకు చేసిన అపకారం ఏమిటి?

తాను యీ జన్మలో తెలిసి ఎవరికి అన్యాయం చేయలేదు! అపకారం తలపెట్టలేదు. ఎప్పటికయినా స్వరూప్ మరలా తన దగ్గరకు వచ్చి తీరుతాడు అన్న మొండి నమ్మకం ఆమెకు కొంత మనోస్థైర్యాన్ని కలుగజేయసాగింది.

* * * * * * *

'అంకుల్! నేను యన్. సి. సి. లో జేరతాను"

"ఎందుకమ్మా! ఆడపిల్లలు కాకీ పాంట్లు, షర్టులు తొడుక్కుని నడి వీధుల్లో కవాతు చేయటం బాగుంటుందా? చూచిన వాళ్లేమనుకుంటారు?"

"పో ఆంటీ! నీదంతా చాదస్తం! అందరూ జేరుతున్నారు. నేనూ జేరతా!"

"వద్దమ్మా! ఎవరయినా 'అదుగో రూప యన్. సి. సి. డ్రెస్‌లో కవాతు చేస్తుంది'అని వచ్చి చెప్తే బాగుండదు."

"ఎందుకు బాగుండదు? ఈ రోజుల్లో ఆర్మీలోనూ, పోలీసు ఫోర్సులోనూ ఆడవాళ్లు జేరటం లేదా?"

"ఎవరో జేరారని యీడొచ్చిన ఆడపిల్లవి నువ్వు జేరతావా? అదృష్టం కొద్దీ వ్యాపారంలో కలసి వచ్చింది. బి. యే. అవగానే సరయిన సంబంధం చూచి నిన్నొక అయ్య చేతిలో పెడితే మా బాధ్యత తీరిపోతుంది. వ్యాపారమూ ఆస్తులూ నీకప్పగించి విశ్రాంతి తీసికొనే సమయం వస్తున్నది. బాధ్యతలు తీసికోవలసిన వయసులో నువ్వు యింకా యిలా కాకీ బట్టలు వేసుకు తిరుగుతానంటావే?"

"చూడు అంకుల్! ఆంటీ ఏమంటుందో" వనజ మీద రాఘవరావుకు ఫిర్యాదు చేసింది రూప.

"ఏమిటి వనజా? ఇందాకట్నుంచి చూస్తున్నాను. డాలీకి అదే పనిగా సూక్తి ముక్తావళి' వల్లిస్తున్నావు: ఈ కాలం ఆడపిల్లలు అన్నింటిలోనూ ముందుకు వస్తున్నారు. వెనకటిలా అంట్లకుండలు తోముతూ కూర్చోవడంలేదు.

నీకెందుకు డాలీ! ఆంటీ మాటలు లెక్క చేయకు! యన్. సి. సి.లో జేరు!"

"అంకుల్ మంచివాడు" అంటూ గంతులేస్తూ వెళ్లిపోయింది రూప.


"ఇంకేం! మామ, కోడలు ఒకటయ్యారు! ఇలా అతి గారాబంగా పెంచితే రేపు ఏ అయ్య చేసుకుంటాడు. తల్లీ తండ్రీ వుంటే ఇలా పెంచేవారేనా? పెళ్లయ్యాక ఏమిటి ఈ పద్ధతులు? అని నన్నడుగుతారు గాని మిమ్మల్నడుగుతారా?"

"వనజా! డాలీకి మహారాజాలాంటి సంబంధం వస్తుంది! నువ్వేం దిగులుపడకు.

ఏ వయసు సరదాలా వయసులో తీరాలంటారు!

అమ్మాయి చదువులోనూ ఆటల్లోనూ ఫస్టున వస్తున్నది. మొన్న వాళ్ల ప్రిన్సిపాల్ గారేమన్నారో తెలుసా?

"రాఘవరావుగారూ! రూపను ఐ. ఏ. యస్.కు పంపండి. మంచి రాంకులో సెలక్టవుతుంది. ఆంధ్ర నుంచి ఐ. ఏ. యస్. కు సెలక్టవుతున్న వాళ్లెక్కువమంది వుండడంలేదు. రూప జనరల్ నాలెడ్జిలోనూ, పర్సనాలిటీ టెస్టులోనూ, సబ్జెక్టుల్లోనూ, ఇన్‌ట్యూషన్‌లోనూ తప్పకుండా నెగ్గుకు వస్తుంది.



నిత్యజీవితంలో ఒక భాగం

సూర్యోదయంతో ప్రారంభం అవుతుంది మన
నిత్య జీవితం. అక్కణ్ణుంచి ఎన్నో
సదుపాయాలకోసం—అవసరాల కోసం హడావుడి
హైరానా
ఏది మరచిపోయినా—ఏది దొరక్కపోయినా
క్షణం గడవదుమరి.
అందుకే ఓ జాబితా తయారు చేసుకుంటాం.
ఆ జాబితాలో చేర్చుకో తగ్గది మరొకటి వస్తోంది
ఇకముందు అది కూడా మీ నిత్యావసర వస్తువుల్లో
ఒకటవుతుంది—

వినాయక చవితి సంచికతో ప్రారంభం

ఉదయం వీక్లీ

సంపూర్ణ వారపత్రిక

gdc/PAP/0486

త్వరలో ప్రారంభం!

ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులకు

ప్రముఖ ఆయుర్వేద ఔషధాల తయారీ సంస్థ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ వైద్య ప్రముఖుని సమాధానాలు!

పాఠకులు తమ ఆరోగ్య సమస్యలకి **"బైద్యనాథ్ ఆరోగ్య దీపిక"** శీర్షిక కింద ఆయుర్వేద వైద్య చికిత్సా విధానంలో సమాధానాలని ఉచితంగా పొందవచ్చు.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరుతున్నాము.

"బైద్యనాథ్ ఆరోగ్య దీపిక" శీర్షికకి ప్రశ్నలని పంపేవారు తమ ఆరోగ్య సమస్యలని ఈ కింద ఇచ్చిన కూపన్‌లో రాసి దానిని సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వార పత్రిక, గాంధీనగరం, విజయవాడ–520003 అనే చిరునామాకి పంపాలి. ఒక్కొక్క కూపన్‌లో ఒక్కొక్క ప్రశ్నని మాత్రమే పంపాలి. కూపన్ లేకుండా పంపిన ప్రశ్నలని పరిశీలించటం జరగదు.

------------ కూపన్ ------------

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
బైద్యనాథ్ ఆరోగ్య దీపిక

ప్రశ్న :..

....

....

పంపినవారి పేరు :______________________

పూర్తి చిరునామా :______________________

____

సంకెళ్ళెవరికి?

మా కాలేజీకే కాకుండా మన రాష్ట్రానికే పేరు తెస్తుంది" అన్నారు ఆయన అన్నట్లు రూప ఐ. ఏ. యస్. పాసయితే ఎంత క్రెడిట్!"

"అయ్యో! బాగానే వుందండోయ్! అమ్మాయిని కలెక్టరు చేస్తారా? రాత్రింబవళ్ళూ డ్యూటీ అని తిరుగుతుండాలి! వేళాపాళా లేకుండా ఎక్కడకు పడితే అక్కడకు వెళ్ళాలి!

ఎందుకండీ యీ విపరీతపు ఆలోచనలు? లక్షణంగా మంచి సంబంధం చూచి పెండ్లి చేసే దానికి? అయినా మీరు నా మాటెందుకు వింటారు" అంటూ వంట యింట్లోకి వెళ్ళిపోయింది వనజ.

"ఊ! ఎన్నాళ్ళున్నా వనజ వంట యింటి కుందేలులానే వుంటుంది! రూపనుకూడా అలా తయారు చెయ్యాలంటుంది" అనుకుంటూ వెళ్ళాడు రాఘవరావు.

* * * * *

"రూప ఏది వనజా?"

"దసరా సెలవులకు యన్. స. స. కాంపు వుందని మద్రాసు వెళ్ళింది" వస్తుంటే బాధపడుతుందేమోనని నేనేమీ అనలేదు.

"పోన్లే! ఇప్పటికయినా తెలుసుకున్నావు! డాలీ అంతా శివ పోలికే ఎంతో వుషారుగా చురుకుగా వుంటుంది. చదువుకునేటప్పుడే నాలుగు ప్రదేశాలు చూసి రానియ్యి! తర్వాత తర్వాత వీలవుతుందో కాదో!"

"ఈ ఏటితో బి. యె అయిపోతుంది గదా! మరి ఏదైనా మంచి సంబంధం చూడరాదూ?"

"డాలీ కోసం సంబంధం వెతకవలసిన ఖర్మ యేం పట్టింది? మన ఆస్తికి శివ ఆస్తి రెండిటికీ వారసురాలు. కళ్ళు చెదిరే అందం! చదువుకు చదువూ వుంది ఈ వూళ్ళో వున్న కోటీశ్వరులు అయిదారుగురు ఆమెను కోడలు చేసుకుందామని వువ్విళ్ళూరుతున్నారని తెలిసింది! అయినా ఐ. ఏ. యస్. సెలక్షన్‌కు కూర్చుని పాసవనీ! ఇక చూడు రాష్ట్రంలో ఐశ్వర్యవంతులంతా వచ్చి మన యింటి ముందు క్యూలో నిలబడతారు. మా అబ్బాయికి చేసుకుంటాం అంటే మా అబ్బాయికి చేసుకుంటాం అని"

"బాగుందండీ! మరి అంత మిడిసిపడకండి ఆడపిల్ల పెళ్ళి అంటే మాటలా! ఎన్ని చూడాలి.

అన్నయ్య, వదినా పోయినా కూడా ఏ లోపం లేకుండా పెంచాం! సరైనవాడిని చూసి పెండ్లి చెయ్యకపోతే జీవితం వృథా అవుతుంది తరువాత ఏమనుకొని ఏం ప్రయోజనం?"

"అపశకునపు పక్షి! ఏం మాటలే అవి! డాలీ ఐ. ఏ. ఎస్ పాసయినాక రాజాలాంటి సంబంధం చూసి పెండ్లి చేస్తా! ఈ లోపల నువ్వు ఆ ప్రస్తావన తేవద్దు!"

* * * * *

"రూపా! క్యాంపు యివాళ్టితో అయిపోతుంది ఎల్లుండి వుదయంగాని విజయవాడకు బయల్దేరి వెళ్ళం. రేపు మద్రాసు చుట్టుప్రక్కల ఏదైనా నాలుగు ప్రదేశాలు చూద్దాం ఏమంటావు" క్యాప్టెన్ సువర్చల అంటే

"వుండండి మేడమ్! కొ డెట్స్ అందరినీ కనుక్కొని వచ్చి చెబుతాను" అంటూ టెంట్స్ దగ్గరకు వెళ్ళింది.

"మేడమ్ రేపు హాలిడే యిచ్చారు! ఎక్కడకైనా వెళ్ళి రావచ్చు! ఏమంటారు"

"పాండిచ్చేరి వెళదాం

"కాదు తిరుపతికి"

"కాదు మహాబలిపురం"

"అబ్బ! అన్ని ప్రదేశాలకు ఒక్క రోజులో ఎలా వెళతాం వుండండి మూడు చీట్లు వ్రాస్తాను రమా! కళ్ళు మూసుకుని ఒక చీటి తియి" అంది రూప.

రమ తీసిన చీటిలో మహాబలిపురం అని వుంది.

ఒక చిన్న ఎమెండ్‌మెంట్! దారిలో పక్షితీర్థం కూడా చూద్దాం" అంది రూప.

(ఇంకా ఉంది)

(4 వ పేజీ తరువాయి)

కష్టాలని పదిమంది దృష్టికి తేవటానికి ఎంతో మంది **ఆత్మహత్యలకి** పాల్పడుతూ ఉంటారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి అజమాయిషీలో ఉన్న సంస్థలలో ఒక డజన్ మందికి పైగా మరణించారు. వాటి అధికారులని విచారణ సంఘాలు తరచు వేలెత్తి చూపించినా ఆ రకమైన ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ మధ్యే ఢిల్లీ విశ్వ విద్యాలయంలోని వృక్ష శాస్త్ర విభాగానికి చెందిన ప్రతిభావంతురాలైన ఒక విద్యార్థిని విషపూరితమైన ద్రవం తాగటం వల్ల మరణించింది. ఆమె ఆత్మహత్య చేసుకున్నదని నమ్మే వారు కూడా ఉన్నారు. కానీ జరిగిందేమీ లేదు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఒక విద్యార్థి ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ విభాగానికి చెందిన వారంతా డీన్ నాయకత్వంలో సంతాపం తెలిపేందుకు అతని, లేక ఆమె ఇంటికే వెళతారు. మన శాస్త్ర వేత్తలందరూ చాలా సాధారణ వ్యక్తులు. వాళ్ళు తమ ప్రతిభతో లోకంలోని మిగతా శాస్త్రవేత్తలతో పోటీ పడలేనటువంటి వారు. హార్వర్డ్, యేల్ వంటి చోట్ల జరిగే సెమినార్‌లకి ఆహ్వానాలు వస్తే చాలని తృప్తిపడే రకం వాళ్ళు. స్వాతంత్ర్యానంతరం మనకి ఒక్క నోబెల్ బహుమతి కూడా రాలేదు. ఖొరానా సంగతి వేరు, ఆయన అమెరికనే కానీ భారతీయుడు కారు. ఇక ముందు మనకి అవి అసలు వస్తాయా అని నా సందేహం.

అభివృద్ధి చెందుతున్న సమాజాలలో జరిగిన విధంగానే ఒక సమాజం బాగుంటే కొందరు అసాధారణమైన ప్రతిభని కనపరుస్తారు. దాని వల్ల అలాంటి ప్రతిభ లేని వారి వల్ల, వెనుకబడిన వారి వల్ల కలిగే నష్టం చాలా వరకు పూడుతుంది. ఒక సమాజం ఎంతగా అభివృద్ధి చెందుతున్నదన్నది ప్రతిభావంతుల పట్ల అది ఎలా ప్రవర్తిస్తున్నదన్నదానిపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకి ఎస్కార్ట్స్‌కి చెందిన నందాని, రిలయన్స్‌కి చెందిన అంబానీలాంటి వారిని అది ఎలా గౌరవిస్తున్నదన్న దానిని తీసుకోవచ్చు. వాళ్ళకి ఉన్న అవకాశాలని ఉపయోగించుకుని స్వయంకృషితో పైకి వచ్చిన వ్యక్తులు వాళ్ళు. సర్వతోముఖంగా అభివృద్ధి సాధించి పైకి వచ్చిన వాళ్ళు. డబ్బు సంపాదించటం అన్నది నేరం కాకూడదు. ప్రజలకి ఉద్యోగావకాశాలని కల్పించటం, సంపదని సృష్టించటం కూడా నేరం కాకూడదు. కానీ వారేదో నేరం చేసినట్లు చూడడం జరుగుతున్నది. కాదని నిరూపించుకోడానికి వాళ్ళు కోర్టుకి వెళ్ళి పోరాడాల్సి వస్తున్నది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అంబానీ, నందా వంటి వ్యక్తులు ఆ దేశాధ్యక్షుడిచే సన్మానింపబడతారు. విజయాన్ని చిన్న చూపు చూడకుండా ఆరాధించే ఒక సమాజానికీ, అసలు ఆ మాటే అనుమానాస్పదమైనదిగా, గాంధేయ సిద్ధాంతానికి వ్యతిరేకం అయినదిగా భావించే సమాజానికీ సూక్ష్మంగా చెప్పాలంటే అదే తేడా. .. □

స్వయంకృషితో ఐ. ఎ. ఎస్‌లో 42వ స్థానాన్ని అందుకున్న ఆంధ్రుడు!

1985వ సంవత్సరంలో నిర్వహింపబడిన అఖిలభారత సివిల్ సర్వీసెస్ పరీక్షలలో ఐ. ఎ. ఎస్. కి ఎంపిక అయి 42వ స్థానాన్ని సంపాదించిన శ్రీ కందాళ జోగ భాస్కర వెంకట సుబ్రహ్మణ్యం 1958లో అనకాపల్లిలో ఒక సామాన్య కుటుంబంలో జన్మించారు. తండ్రి కీ శే. బంగారయ్య శాస్త్రి ఆయుర్వేద వైద్యులు. తల్లి శ్రీమతి సుబ్బలక్ష్మి స్వయంకృషి, పట్టుదలలే ఈయన సాధించిన ఈ ఘన విజయానికి ముఖ్య కారణాలు.


శ్రీ సుబ్రహ్మణ్యం అనకాపల్లి మునిసిపల్ స్కూళ్ళలో తమ ప్రాథమిక, హైస్కూలు విద్యాభ్యాసం చేసారు తండ్రిగారి సూచన మేరకి 6వ తరగతిలో ఉండగానే సాయంత్రం వేళలలో హిందీ క్లాసులకి వెళ్ళి 10వ తరగతి పూర్తయ్యేసరికి ఉత్తర భారత హిందీ ప్రచార సభవారిచే నిర్వహింపబడే 'హిందీ విద్వాన్' కూడా పూర్తి చేసారు.

ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేనందువల్ల కళాశాలలో చేరలేకపోయారు తెనాలిలో 'సీనియర్ హిందీ పండిట్" శిక్షణ ఒక సంవత్సరంపాటు పొందారు. అయినా కాలేజీలో చదివే తమ స్నేహితులకంటే వెనుకబడరాదని పట్టుదలతో ఇంటర్ ప్రైవేటుగా చదివి అనకాపల్లి ఎ. ఎం ఎ ఎల్ కళాశాలలో ఇంటర్ చదివిన తమ స్నేహితుల కంటె ఎక్కువ మార్కులు సంపాదించారు

లెక్చరర్ల అభినందనల పరంపరతో ఈయనలోని ఆత్మస్థైర్యం పెంపొందింది నార్మన్ ఎన్ సెంట్‌పేల్ రచనలు "ది పవర్ ఆఫ్ పాజిటివ్ థింకింగ్," యూ కెన్ ఇఫ్ యు థింక్ యూ కెన్, కాంపిటిషన్ సక్సెస్ రెవ్యూలలో ఐ ఎ ఎస్ లో ప్రథములుగా వచ్చిన వారి ఇంటర్వ్యూలు చదవటంతో ఆయనకి ఐ ఎ ఎస్ కావాలన్న దృఢ నిశ్చయం కలిగింది. అదే తమ జీవిత గమ్యంగా పెట్టుకున్నారు

సీనియర్ హిందీ పండిట్ శిక్షణ అనంతరం ఆయనకి ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు దానితో టైపు, షార్ట్‌హాండ్ లోయర్, హయ్యర్‌లలో సంవత్సరన్నర కాలంలో ఉత్తీర్ణులైనారు ఈలోగా ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని బాగా అభివృద్ధి చేసుకున్నారు

1978లో బి. ఎ. ప్రథమశ్రేణిలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 12వ ర్యాంక్ సాధించారు బి. ఎ. లో ఆయన చరిత్ర, రాజనీతి శాస్త్రం, హిందీ లిటరేచర్‌లని ప్రధాన విషయాలుగా తీసుకున్నారు ఇంటర్ చదువుతూ ఉండగానే భాషా ప్రవీణ సంస్కృతం ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణులైనారు బి ఎ వరకూ ఆయన చదువు తెలుగు మీడియంలోనే సాగింది. ఆ తర్వాత ఇంగ్లీషు లిటరేచర్ తో ఎం ఎ పాసైనారు



శ్రీ కె. జె. బి. వి. సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్రహ్మణ్యం 1981లో స్టీల్ ఏథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో మానేజిమెంట్ ట్రైనీగా ఎంపిక అయి విశాఖ ఉక్కు కర్మాగారంలో నియమింపబడ్డారు. ప్రస్తుతం అసిస్టెంటు మానేజర్ (పెర్సనల్)గా ఉన్నారు మొట్ట మొదటిసారి 1983లో కలకత్తాలో సోషల్ వర్క్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా చేస్తూ ఐ.ఎ ఎస్ పరీక్షకి వెళ్లారు కానీ ఆ ప్రయత్నం విఫలమైంది. రెండవసారి 1984లో మరింత పట్టుదలతో విశాఖపట్నంలో కోచింగ్‌పొంది మళ్ళీ ఐ ఎ ఎస్ కి వెళ్లారు. కాని కొద్దిలో అదృష్టం చేజారిపోయింది దానితో ఆయన మరింత పట్టుదలతో శ్రమించి 1985లో జరిగిన సివిల్ సర్వీసెస్ పరీక్షకి వెళ్ళి ఐ. ఎ ఎస్ లో 42వ స్థానాన్ని సాధించి తమ జీవిత ఆశయాన్ని సఫలం చేసుకున్నారు ఐ ఎ ఎస్ లో శ్రీ సుబ్రహ్మణ్యం, హిస్టరీ, సోషియాలజీలని ప్రధాన విషయాలుగా తీసుకున్నారు

స్వయం కృషి. పట్టుదలతో తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించిన శ్రీ సుబ్రహ్మణ్యం నేటి తెలుగు యువతరానికి మార్గదర్శకుడు మాతృ భాషలోనే బి ఎ వరకు విద్యాభ్యాసం చేసి కాలేజి మెట్లు ఎక్కకుండా స్వయంకృషితో ఐ ఎ ఎస్ లో 42వ ర్యాంక్ సంపాదించిన ఈ యువకుడికి యోగ విద్యలో, వీణా వాదనంలో కూడా మంచి ప్రావీణ్యం ఉన్నాయి కృషి ఉంటే సాధించలేనిది అంటూ ఏదీ లేదని చెప్పడానికి ఈయన ఒక మంచి ఉదాహరణ

-(ఐ. వి.)

కలువబాల లక్కీ డిప్ చందాదారులకు నిబంధనలు సూచనలు.

1 చందా పైకము రు 60లు మనియార్డరు ద్వారా గాని, డిమాండు డ్రాఫ్టు ద్వారా గాని పంపవచ్చును
2 ఎమ్ ఒ లు పంపేవారు వారి కూపన్‌తో పాటు, ఎమ్ ఒ పంపిన తేదీ తెలుపుతూ, దాని రశీదు జతచేసి మరీ కూపన్ పంపాలి లేదా డి డి ని కూపన్‌తో జతచేయాలి
3 చందా భారత దేశంలో వున్న వారెవరైనా కట్టవచ్చును
4 చందా పైకము నేరుగా విజయవాడ, ఆంధ్రపత్రిక కార్యాలయంలో కూడా కట్టవచ్చును
5 ఎమ్ ఒ లు, డి డి లు వ్యక్తుల పేర పంపించకూడదు
6 కూపన్‌లు రిజిష్టర్డు పోస్టులో పంపరాదు లక్కీడిప్ గడువు పూర్తి అయిన తర్వాత యిందులో పాల్గొన్న చందాదారులకు చీట్లుతీసి, పైన తెలిపిన బహుమతులను ప్రకటించుతాము ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు
7 కూపన్‌మీద, మనియార్డరు కూపన్ మీదా కూడా పంపేవారి పేరు, చిరునామా స్పష్టంగా, పూర్తిగా వ్రాయాలి వారు ఇదివరకే చందాదారులైతే కూడా, వారి స్నేహితులెవరికైనా, "కలువబాల" చందాను బహుమతిగా కట్టవచ్చును

---------- కత్తిరించాలి ----------



నిజమయితే ✓
కాకపోతే x
అని గుర్తు పెట్టాలి

ఆంధ్రపత్రిక బొంబాయి నుంచి వెలువడుతూ వుండేది ( )

దినపత్రిక కన్నా వారపత్రిక ముందే పుట్టింది ( )

"భారతి" సాహితీప్రియుల పత్రిక ( )

బాలరంజని పిల్లల పత్రిక ఆంధ్రపత్రిక ప్రచురణ ( )

కలువబాల చందాదారుల 'లక్కీడిప్' చందా కట్టిన వారి పూర్తి పేరు :..............................

....

చిరునామా :..............................

....

....

ఎమ్ ఓ పంపిన తేది ....
లేదా
డి డి జత చేయడమైనది

8. "లక్కీడిప్" 1-11-1986 లేదా ఆ లోపల కట్టే చందాలకి మాత్రమే వర్తిస్తుంది.
కూపన్‌లు, చందాలు పంపవలసిన చిరునామా :
కలువబాల, కేరాఫ్; ఆంధ్రపత్రిక, గాంధీనగరం, విజయవాడ-3కి పంపాలి.

9. ఈ పథకంలో పాల్గొనే వారికి స్థానిక ఏజెంట్ ద్వారా పత్రిక సప్లయి చేస్తాము
గమనిక. ఏజెంట్ లేనిచోట పోస్టులో పంపిస్తాము.

10. ఆంధ్రపత్రిక సంస్థలోని ఉద్యోగులు, వారి బంధువులు ఈ లక్కీ డిప్‌లో పాల్గొనరాదు

రక్తాశ్రువు

కుమారి. ఎ. వి. శేషారత్నం

డాక్టర్ పరాంకుశంగారి నర్సింగ్‌హోం-

రాత్రి తొమ్మిదవుతోంది అప్పటిదాకా పేషంట్లతో కిటకిటలాడుతున్న నర్సింగ్‌హోమ్‌లో అవుట్ పేషంట్లు ఇక ఒకరో ఇద్దరో ఉన్నారు.

జోగయ్య బల్లమీద కూర్చుని రెండు చేతులూ కళ్ల కడ్డం పెట్టుకున్నాడు. 'ఇంకా ఇద్దరు' అనుకున్నాడు.

'నాన్నా!'- చిన్నిగాడి గొంతు క్రోధంగా ఉరుముతున్నట్టుంది.

ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు. ఎవరూ లేరు

"రూపాయిలకి నన్ను అమ్మేసావా నాన్నా"-చిన్నిగాడు మళ్లీ మూసుకున్న కళ్లముందు ప్రత్యక్షమై నిలదీసి అడుగుతున్నాడు.

ఎంత మర్చిపోదామన్నా మధ్యాహ్నం సంఘటన మరపుకి రావడంలేదు జోగయ్యకు.

రచ్చబండ దగ్గర పది గంటలకు మొదలైన పేకాట పన్నెండయేసరికి ఊపు అందుకుంది.

'అరువు ఆటలు లేవు జోగయ్యా'- గుర్నాథం అప్పుడే వచ్చిన జోగయ్యను ఎక్కిరింపుగా అన్నాడు.

'పోరా పక్షి నిన్నగాక మొన్న పేక ముక్క పట్టిన నువ్వు జోగయ్యలాంటి పెద్ద హెంతును నిలదీసేంతవాడవయ్యావేం- వాడి మాటలకేం గాని రా కూర్చో జోగయ్యా! నీ పెట్టుబడి నేను పెడతాను '

ఊరి పెద్ద రాఘవులు జోగయ్యను చెయ్యి పట్టి చనువుగా కూర్చోబెట్టాడు. గుర్నాథం మొహం మాడ్చుకున్నాడు.

'ఒరే చిన్నిగా అందరికీ టీలు తెచ్చి పెట్టరా - గుర్నాథం! నీకు సిగరెట్లు కావాలా' - జోగయ్య మాటలకి గుర్నాధం ఏం మాట్లాడలేకపోయాడు.

చిన్నిగాడు డబ్బులు తీసుకుని పరిగెత్తాడు.

మరో గంట గడిచేసరికి జోగయ్య రెండు వందలు బాకీపడ్డాడు రాఘవులికి

'నీ మనసేం బాగులేనట్టుంది జోగయ్యా అలా చూస్తూ కూర్చోకూడదమ్మా' మృదువుగా అన్నాడు రాఘవులు.

'ఒంట్లో ఎలా వుంది కడుపులో నొప్పి తగ్గిందా?' డాక్టరేమన్నాడు. నిన్న పట్నం వెళ్లినట్టున్నావు-రామచంద్రం అడిగాడు

'ఆపరేషన్ చెయ్యాలన్నాడు భద్రం. లేకపోతే ఈ నొప్పి తగ్గదట' విగులుగా ఉంది జోగయ్య గొంతు

'ఏంటో మా లక్ష్మి పోయినదగ్గర్నుంచే బొత్తిగా పాడయిపోయావు కుర్రాడిని చూసైనా కాస్త మనసు దిటవు చేసుకోవాలి జోగయ్యా'-ఊరి కరణం సానుభూతిగా అన్నాడు.

'ఆపరేషన్‌కి మూడు వేలవుతుందిట.'

జోగయ్య మాటలకి ఎవరూ సమాధానం చెప్పలేదు ఇల్లూ, వాకిలీ, భూమీ, పుట్రా లేని అతనికి అంత డబ్బు అప్పిచ్చే సాహసం ఎవరికీ లేదు.

పేక ముక్కలు కింద పడేసాడు జోగయ్య.

'ఆటకేంగాని చిన్నిగాడిని అమ్మేద్దాం అనుకుంటున్నాను'

పక్కలో బాంబు పేలినట్టు ఉలిక్కిపడ్డారందరూ. టీలు తీసుకొచ్చిన చిన్నిగాడి ఎనిమిదేళ్ల బుర్రకి తండ్రి అన్నదేమిటో ఒక్క క్షణం అర్థం కాకపోయినా ఎందుకో భయపడ్డాడు.

'నాన్నా' అన్నాడు మేకపిల్లలా.

'ఒంట్లోనే కాకుండా నీకు మనసులో కూడ బాగా అనారోగ్యంగా ఉన్నట్టుంది జోగయ్యా లేకపోతే చేతికందివచ్చే కుర్రాడిని అమ్ముతా ననడమేమిటి?'-రాఘవులు కసిరాడు.

'నువ్వన్నమాట నిజమే అయితే నా పాట రెండు వందల ఏభై'- గుర్నాధం వెక్కిరింపుగా అన్నాడు. ఎందుకో జోగయ్యంటే మొదట్నుంచి బాగా చిన్న చూపు అతనికి

'చాల్లెండ్రా ఏదో జోగయ్య తెలివి తక్కువగా మాట్లాడత మేమిటి మనం పై అనడ మేమిటి'- భద్రం అన్నాడు అనుమానంగా.

'లేదు. నేను నిజంగానే చెబుతున్నాను. ఇక్కడ కాకపోతే పట్నంలో నైనా రేపు అమ్మేస్తాను.'

జోగయ్య మాటలతో అందరికి అనుమానం తీరిపోయింది.

'అయితే నా పాట నాలుగు వందలు'- ఎవరో అన్నారు.

'నాది అయిదు వందలు'-ఎర్రగా కళకళ్లాడుతున్న చిన్నిగాడి ముఖం వైపు చూస్తూ అన్నాడు గురువులు.

చిన్ని బిత్తరపోయాడు. మళ్లీ 'నాన్నా' అన్నాడు.

'అలా పిలవకురా చిన్ని! నిన్నిపుడు ఎవరు కొనుక్కుంటే వాళ్లే మి నాన్న'- మొహం తిప్పుకున్నాడు

'నా పాట ఏడు వందలు'-

క్రమంగా అందరిలో కుతూహలం హెచ్చింది. పెద్ద గుంపు పోగయింది రచ్చబండ దగ్గర.

రాఘవులు మనస ట్టుడికినట్టుడిగిపోతోంది.

'ఆగండి. నేనీ ఊరి పెద్దను. ఎవరూ నోరెత్తకండి. నా పాట మూడు వేలు. చిన్నిని నేను కొనుక్కుంటున్నాను'-అన్నాడు గంభీరంగా అతను.

మరెవ్వరూ నోరెత్తలేకపోయారు. జోగయ్య తువ్వాలు మొహంమీద కప్పుకున్నాడు.

'జోగయ్యా నీ ఆపరేషన్‌కి ఈ మూడు వేలూ అప్పుగా తీసుకో- నీ కొడుకుని లాక్కునేంత కసాయివాడినికాను నీకు జబ్బు తగ్గాక తిరుద్దువు గాని. రోగిష్టివాడివి కొడుకు ఆసరా నీకెంతేనా అవసరం'-

'అప్పుగా నేను తీసుకోను. వాడిని నువ్వు కొనుక్కున్నట్టే లెక్క అలాగయితేనే నాకు మూడువేలియ్యి'- రాయిలా ఉంది జోగయ్య మొహం.

రాఘవులికి కోపం వచ్చింది.

'నీ మంచికోసం చెప్తుంటే ఏమిటి మొండితనం. సరే అయితే నేను చెప్పేదికూడ విను. వీడిని నిజంగానే నా కమ్మినట్టయితే నువ్వీ వూళ్లొంచి తక్షణమే వెళ్లిపో. నువ్విక్కడుంటే వీడు నా కొడుకెలా అవుతాడు. అయినా వీడిని నేను కొడుకుగానే చూడాలనేముంది. పశువులా చాకిరి చేయిస్తాను.'

'నీ యిష్టం'- జోగయ్య నెమ్మదిగా లేచాడు.

అదేదో అద్భుతం చూస్తున్నట్టున్న జనంలో అప్పుడే కదలిక మొదలై దారి తప్పుకున్నారు.

ఒక్కుమ్మడిగా జోగయ్య మొహంమీదే తిట్టడం మొదలెట్టారు. జోగయ్య అదేం పట్టించుకోకుండా ముందుకు పోయాడు.

'నాన్నా' గుండె పగిలేలా ఏడుస్తున్న చిన్నిగాడి ఏడుపుగానీ, రాఘవులి గద్దింపు గాని అతన్నాపలేకపోయాయి. పూనకం వచ్చిన వాడిలా నడుస్తున్న జోగయ్యను నాగవల్లి నిలేసింది.

'నీ కిదేం పోయే కాల మొచ్చింది జోగయ్యా! కొడుకును నీ ప్రాణం కోసం అమ్ముకుంటావా?' పురుగులు పడపోతావు. అడుక్కుని అయినా బిడ్డను పెంచుకోవచ్చు. నీకు పుట్టగతులుండవు.'

'అమ్మలే'

'ఛి! నువ్వు మనిషివి కావు.'

'ఏవయ్యా నువ్విక్కడ కునికిపాట్లు పడుతున్నావా? డాక్టరుగారు వెళ్లిపోయే టయిమయింది. త్వరగా లోపలికెళ్లు'- కాంపౌండరు జోగయ్యను కసిరేసరికి గబగబా లోపలికి నడిచాడు జోగయ్య.

'నువ్వా జోగయ్యా! డబ్బు తెచ్చావా? ఆపరేషన్ ఆలస్యమయినకొద్దీ ప్రాణానికే ముప్పు.'

జోగయ్యను బాగా ఎరిగివున్న డాక్టర్ పరాంకుశం హెచ్చరిస్తున్నట్టు అన్నాడు. జోగయ్య వెంటనే ఏం మాట్లాడలేదు.

'అదేం మళ్లీ నొప్పి ఉధృతంగా వచ్చిందా? అలా వున్నావు? డబ్బు దొరకలేదా? నా దగ్గర పూర్తి ఎక్విప్‌మెంటు లేదయ్యా. లేకపోతే ఊరికినే చేద్దును. పోనీ నా ఫీజు ఇవ్వకు. డాక్టర్ కృష్ణతో

మాట్లాడతాను. వాళ్ళ నర్సింగ్‌హోంలో ఆపరేషన్‌కి అంతా సిద్ధం చెయ్యమని.'

పరాంకుశం జోగయ్య గ్రామంలో పుట్టి పెరిగినవాడు. చదువుకునే రోజుల్లో పట్నం వచ్చినపుడల్లా తన కోసం జున్నూ, స్వీట్లు తెచ్చే జోగయ్యంటే పరాంకుశానికి అభిమానం.

మూడు వేలు తెచ్చాను డాక్టర్ బాబూ!'-ఎలాగో గొంతు పెగిలింది జోగయ్యకి.

'అయితే ఇకనేం రేపే ఆపరేషన్‌కి సిద్ధం చేయిస్తాను.'

'బాబూ ఆపరేషన్ చేస్తే నా జబ్బు నిజంగా తగ్గుతుందా? నా కళ్ళలోకి చూసి నిజం చెప్పండి బాబూ. మిమ్మల్ని చిన్నప్పట్నుంచి ఎరుగుదును.'

'జోగయ్యా! ఎందుకు అలా అనుకుంటున్నావు.'-తడబడింది డాక్టర్ గొంతు.

'మొన్న మీరు నేను వెళ్ళిపోయాక ఇంకో డాక్టర్ బాబుతో అంటున్న మాటలు విన్నాను బాబూ!'

డాక్టర్ తలవంచుకున్నాడు.

'మూడు వేలూ తెచ్చాను బాబూ. ఎలాగో తెలుసా! నా చిన్నిగాడిని అమ్మిన సొమ్ము బాబూ ఇది.'

'జోగయ్యా'

'నన్ను చూస్తే అసహ్యంగా వుంది కదూ!' జోగయ్య గొంతు రుద్ధమైంది.'- కానీ ఇది ఆపరేషన్ కోసం తేలేదు డాక్టర్ బాబూ!

కాస్త సర్దుకున్న పరాంకుశం అన్నాడు ఓదార్పుగా-

'జోగయ్యా! ఆపరేషన్ చేసినా తగ్గదని ఎందుకనుకుంటున్నావు. చాలవరకు కేసు సక్సెస్ అయ్యే అవకాశాలున్నాయి. ఎలాగైనా నిన్ను బ్రతికించుకునే పూచీ నాది.'

'మీ సామర్థ్యం నాకు తెలుసు బాబూ. కానీ నా కొడుకుని అమ్ముకున్న డబ్బుతో...... వద్దు. రాత్రుళ్ళు ఉుంగజాట్టుకుపోతూంటే నాకే తెలుస్తోంది నే నెంతోకాలం బ్రతకనని. నా కొక్కసాయం చేయమని కోరేందుకు వచ్చాను బాబూ!'

'ఏమిటి?' –

'మీరంటే నాకెంతో నమ్మకం. ఈ డబ్బు మీ దగ్గర దాచండి. నా బిడ్డను రాఘవులకి అమ్ముతుంటే ఊరంతా నన్నసహ్యించుకుంది. కానీ రాఘవులికి పిల్లల్లేరు. చిన్నిని ప్రాణంలా చూసుకుంటాడని తెలుసు. అయితే చేతులారా కన్నకొడుకు బంధాన్ని తెంచుకోలేక నాటకమాడి చిన్నిని అమ్మేసి నాకూ వాడికీ ఏ బంధమూ లేదని నా మనసుని తృప్తి పరచుకున్నాను. నేను చచ్చిపోతే – తల్లి కూడ లేని వాడిని మామూలుగా అయితే ఎవరూ ఆదుకోరు. నౌకరులా ఉపయోగించుకుంటారు. అందుకే ఒక హక్కు కలగాలనే అమ్మేసాను. కానీ పెద్దయ్యాక ఈ డబ్బు వాడికిస్తూ చెప్పండి బాబూ 'మీ నాన్న కసాయివాడు కాదురా' అని. అప్పుడుగానీ నా ఆత్మశాంతించదు. ఇప్పుడే తెలిస్తే వాడు రాఘవులి దగ్గర ఉండడు. అందుకే నా మీద కోపంతోనైనా చిన్ని నన్ను మర్చిపోవాలని....'



డబ్బు సంచి వణుకుతున్న చేతులో డాక్టర్ బల్లపైపెట్టి వడివడిగా వెళ్ళిపోయాడు జోగయ్య.

అదేరోజు రాత్రి సత్రం అరుగు మీద నొప్పితో విలవిల్లాడుతూ ఆఖరి క్షణంలో అనుకున్నాడు జోగయ్య –

'చిన్ని! ఇంత నొప్పి నీ చల్లని చిన్న చెయ్యి పడితే ఉపశమిస్తుందని తెలుసురా. కానీ నా స్వార్థం కోసం నిన్ను అనాథను చెయ్యలేక .... అబ్బా... నాన్నను క్షమిస్తావు కదూ!'

ఒకే ఒక్క అశ్రుకణం కనుకొలకుల నుంచి సానుభూతిగా రాలి పడింది – జోగయ్యను ఒంటరివాడిని చేసి – □

జి. ఎస్. కె. జగిత్యాల

★ కోర్టులో లాయర్లు నల్లకోటు ధరించడానికి కారణం?

● గుర్తు తెలియడానికి అయి వుంటుంది – లేకపోతే కోర్టులో జనానికి లాయరుకి తేడా ఏమిటి?ఎలా తెలుసుకోడం?

పి. ఎస్. ఆర్. గుంటూరు

★ కులమతాలకు అతీతంగా వుండా లంటూనే ఉద్యోగాలకి చదువులకి రిజర్వేషన్లు కల్పించడంపైఅభిప్రాయం?

● వీటిపై అదుపు వుంటేనే – రాజకీయ వాదులు బ్రతక్కలరు. నిజంగా సర్వసమానత్వం ఎవరికీ అక్కరలేదు.

వి. వి. పి. బ్రాహ్మణక్రాక

★ మీకు నేను ఒక లెటర్ రాశాను. పెరసనల్‌గా సమాధానం కోరాను. మీరు యివ్వలేదు. ఎందువలన? టైమ్ లేకనా? అభిమానులంటె అయిష్టమా?

● టైమ్ లేక కాదు. అభిమానులంటే అయిష్టం అంత కన్న కాదు. నేను ప్రశ్నావళికి వచ్చే ఉత్తరాలకి పరసనల్‌గా జవాబివ్వ దల్చుకో లేదంతే. అలా చేయటం ప్రారంభిస్తే – ఇది ప్రశ్నావళి కాదు – నాకు ఉత్తరాలయి కూర్చుంటుంది.

డి. ఏ. వి. సోంపేట

★ అష్ట వివాహాలు వివరించాయి శాస్త్రాలు కదా నేటి యువతకు ఏ వివాహాలు అనుకూలమైనవి?

● అన్నిటిలోనూ కట్నం గొడవ లేదు కనుక నేటి యువతకవి – సరిపడవు

జి. ఎం. డి. ఆర్. ఆదోని

★ స్త్రీలకు బాల్యంలో తండ్రి,యౌవ్వనంలో భర్త, ముదిమిని పుత్రులు రక్షింతురు గావున స్త్రీలకు స్వాతంత్ర్యము అక్కరలేదని నీతిశాస్త్రం మరి స్త్రీలు స్వాతంత్రం కావాలి అంటారెందుకు?



● మనుషుల్లా బ్రతకాలని! ఇలా ముగ్గురూ లేనివాళ్ళేం చెయ్యాలి!! ఆ దరిద్రపు నీతిశాస్త్రం యీ నాటి పరిస్థితులకు అన్వయించ తగినవి కానే కాదని!!! యమధర్మరాజా! (పేరు హాయిగా వుందయ్యా)

ఎం. ఆర్. డి. బళ్ళారి

★ ఒక వైపు రాజకీయ నాయకులు జై తెలుగునాడు, జై కన్నడనాడు అంటున్నారు. మరోవైపు పేరున్న రచయితలు, రచయిత్రులు రాముడు తెలుగువారి మేనల్లుడు, అంజనేయుడు కన్నడిగ, అంటూ అగ్నిలో ఆజ్యం పోస్తున్నారు. ఇక సినిమా కవులకు బూతు మార్కెట్లో వేరే సబ్జక్టు లేనట్టు 'రఘువంశ సుధా' త్యాగయ్య కీర్తనని దోపిడిచేసి బూతుమాటలతో కలుషితం చేస్తే శాస్త్రీయ సంగీత ప్రవీణులం అని చెప్పుకొనే గాయక గాయనీ మణులు ఆ బూతుగీతాన్ని ఏ మాత్రం సంకోచం లేకుండా ఆలాపిస్తున్నారు! ఆహార పదార్థాలని కలుషితం చేస్తే చట్టం శిక్షిస్తుంది. మన యువతని యిలా కలుషితం చేస్తున్న వారికి శిక్షలేదా? ఏదైనా ఆలోచించండి. పర్యవసానం ఎలా వుంటుందో వూహించలేరా?

● నీ వేదన అర్థం కాకకాదు గాని నీలాగే చాలామంది స్త్రీలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ముఖ్యంగా వాణీ రంగారావు (చిలకలూరిపేట) ఏం చేద్దాం ఆలోచించండి– అంటూనే వుంది. వేదనలోంచి రోషం పుట్టదా? రోషం– కార్యోన్ముఖులని చేయదా?.... ముందు– బహిరంగ చర్చ అవసరం– ఢిల్లీ పాదుషా దృష్టికి దారుణాలు తీసుకురావడం అవసరం– రాజుగారు తలుస్తే దెబ్బలకి కొదువా? ఏదో జరుగుతుంది.... తరాలకి తరం దిగజారిపోతూండే తల్లులకి బాధేమరి.

ఎన్. హెచ్. పి. స్టూఅర్ట్‌పురం

★ సినిమా కథలని ఎవరికి పంపితే త్వరగా రిసీవు చేసుకుంటారు? చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాను. ఎవరి దగ్గర నుంచి రెస్పాన్సులేదు.

● ఉండదు. సినిమా జాతి చాలా వింతైనది. వాళ్ళ అవసరం అయితే– మీరు పాతాళంలో వున్నా వెతికి పట్టుకుంటారు. అవసరం తీరాక– మీకు దొరకరు!! కథలంటారా? సింగిల్‌లైన్ ఆర్డర్‌విని స్క్రీన్‌ప్లే రాసేసుకునే వాళ్ళు; కథలకి కథలే– తీసేసుకునేవాళ్ళు; అన్ని నవలలోని మంచి సంఘటనలు ఏరి కథలు రాసుకునేవాళ్ళు; వీడియోలో 'రాని' సినిమాలని సహితం చూసి చూడక తస్కరించే వాళ్ళు– చెప్పలేం యిక్కడ జరిగే గారడీ. ఛాంబర్లల్లో మీ నవలల పేర్లు తమతమ కంపెనీల కింద నమోదు చేసేసుకుంటారు; ('కోటిగాడు' నవలలాగ?) దొరికితే దొంగలు గాని లేకుంటే అంతా దొరలే (గిల్డులలో వారి వారి సంఘాలలో చదీ చప్పుడు లేకుండా డబ్బుకట్టి–) కాలర్లెత్తుకు విజయవంతమైన చిత్రాలు మావి అని తిరుగుతారు. అసలు కథల బాధ లేకుండా పరాయి భాషల సినిమాలు (కొని) కొనకొట్టేసి... తీసేస్తారు. అంచేత నేనేం చెప్పగలను సోదరి! ఏం చెప్పలేను. ఇక్కడ విధినపడ్డ రచయితల్లా కథలు భుజాన వేసుకుని ఎక్కే గడపా దిగేగడపాగా నిర్మాతలకి దర్శకులకి వానిపక్క వాద్యగాళ్ళకీ– వంతపాడుతూ వినిపించే ప్రయత్నం– వచ్చి చేసుకు చూడమనే నా సలహా!!

ఎస్. ఎస్. బి. కోటబొమ్మాళి

★ ప్రేమ, దయ, జాలి, కరుణ, అభిమానం ఆత్మీయత అనురాగం– అన్నీ ఒకటే అర్థాన్నిస్తాయి కదా?


● అలా అనిపిస్తుందంతే– కాని– ప్రేమే దయా? కాదే? అలాగే అభిమానమే ఆత్మీయతా? అనురాగమా– కాదు.

★ మీరింత కోపంగా జవాబులిస్తారు. మీ యింటిపేరు కోపమా?

● కాదు– కొరివి?

★ జవాబు లేవేళరాస్తారు? రాత్రిపూటా? పగలా?

● నేనెప్పుడూ రాయడానికంటూ ప్రత్యేకంగా టైము పెట్టుకోలేదు. కూర్చుని రాయాలనుకుంటే– రాయడమే. రాస్తే వరసగా రాసేస్తా– లేకపోతే నెలల తరబడి రాయను. □





ఎదుగుతున్న పిల్లలతో నిండిన క్లాసుకి పాఠాలు చెప్పడం... వారిని సరియైన రీతిలో పెట్టడం... వారి అభివృద్ధిని గమనించడం... అది పూర్తికాలం పనే!
అయితే స్కూల్‌లో నా క్లాసుకి మంచి ఫలితాలు వస్తాయి. అదే గొప్ప తృప్తి. నాకు తెలుసు వారందరినీ ఎంతో ఆరోగ్యంగానూ, మరెంతో చురుకుగానూ వుంచేది హార్లిక్సేనని.
అందుకే నేను హార్లిక్స్ తీసుకోవడం ఒక అలవాటుగానూ చేసుకున్నాను. ఇక ఇటువంటి క్లాసు వున్నప్పుడు నేను ఇంతకంటే తక్కువ చురుకుగా ఉండగలనా?
మాల్టెడ్ బార్లీ, వెన్నతో కూడిన పాలు, బంగారు వన్నె గోధుమలలోని పోషక శక్తుల మంచితనమంతా చక్కగా రంగరించబడిన హార్లిక్స్ ఎంతో రుచికరమైన పానీయం.
పోషక శక్తిని సమకూర్చేందుకు ఉత్తమ మార్గంగా అందరు నమ్ముతారు. 100 సంవత్సరాల్నకు పైగా ప్రపంచమంతటా లక్షలాది కుటుంబాలు హార్లిక్స్‌ని నమ్ముకున్నాయంటే ఆశ్చర్యం ఏముంది?
Horlicks
The Great Nourisher
కొత్త సమయం, కొత్త రూపం
మంచి పుష్టికరమైనది

సీరియల్

కరిగినశిల

రాపినాతల  సువర్ణకన్నక

(గత సంచిక తరువాయి)

అనుకున్న రోజుకి భార్యని తీసుకుని వెళ్ళిపోయాడు ప్రభాకర్.

శరవేగంగా తయారయింది నర్సింగ్‌హోమ్. ఓపెనింగ్ కూడా బ్రహ్మాండంగా జరిగింది. అనతికాలంలోనే మంచి పేరు తెచ్చుకుంది.

చుట్టుపక్కల పల్లెటూళ్ళ వాళ్ళందరికీ అదే దేవాలయం! ప్రభాకర్ ఓ దైవం.

ప్రతిరోజూ ఏదో ఆపరేషన్స్ జరుగుతూనే వుంటాయి. హెల్ప్‌కి మరికొంత మంది డాక్టర్స్‌ని పిల్చేవాడు ప్రభాకర్.

అక్కడకి మెటర్నటి కేసులే ఎక్కువగా వచ్చేవి. భరించలేని బాధతో వచ్చి కొండంత ఆనందంగా వెళ్ళే తల్లుల్ని చూస్తుంటే ప్రభాకర్‌కి ఎంతో తృప్తిగా వుండేది

అయితే శ్యామల ప్రవర్తన మాత్రం అతన్నెంతో గాయ పరుస్తోంది. ఓ సమస్య అయి కూర్చుంది

పసి పిల్లలు యూరిన్ పాస్ చేసినా, పెద్దలు కాస్త గలీజు చేసినా మండి పడేది. గర్భిణి స్త్రీలు మూలిగితే చిరాకు పడేది. లేబర్ రూమ్‌లో స్త్రీలు ప్రసవవేదన పడుతుంటే–

"ష్! నువ్వు నెప్పులు పడుతున్నట్టు అందరికీ తెలుసుగానీ అంతగా అరవకు." అంటూ విసుక్కునేది. నలుగురు పిల్లల తల్లి మళ్ళీ కాన్పు కొస్తే–

"ఏవిఁటీ.. అయిదో కాన్పా?... మీ ఆయనకి లేకపోతే నీ బుద్ధేమయింది.... మీలాంటి వాళ్ళు ఇంతమందిని కని దేశం మీద వదలబట్టే దేశం ఇలా మండిపోతోంది!" అంటూ ఈసడించేది.

మగపిల్లల కోసం చూస్తున్నాం అంటే– "ఏం? ఆడపిల్లలు తేరగా వచ్చారా?– మగాడికన్నా ఆడది ఎందులో తీసిపోయింది?" అంటూ అరిచేది.

"ఆడపిల్ల కోసం చూస్తున్నాం" అంటే–

"మీకున్న ఎస్టేట్స్‌కి ఆడపిల్లలు కూడా కావాలా? ఆడపిల్ల బాధ్యత లంటే మాటలతో వున్నాయా?" అంటూ నోరు పారేసుకునేది.

ఆమెకి, పేషెంట్స్‌కి మధ్య సర్ది చెప్పలేక సతమత మయ్యేవాడు ప్రభాకర్.

ఇన్ని జరిగినా అతని హస్తవాసి మంచిదనీ, ఆ హాస్పటల్లో ఎన్నో సౌకర్యాలున్నాయనీ.... ముఖ్యంగా ప్రభాకర్ చాలా మంచివాడని శ్యామల మాటలు అంతగా పట్టించుకునేవారు కాదు చాలా మంది.

కొందరు ఆమె ముఖం మీదే నాలుగూ దులిపి పోయారు కూడా. అయినా ఆమె ధోరణిలో మార్పు రాలేదు.

అర్ధరాత్రి ఫోన్స్ వస్తుంటాయని రిసివర్ తీసి పక్కన పెట్టేసేది. ఎక్కడికైనా వెళ్ళేటప్పుడు ఎవరైనా పేషెంట్స్ వస్తే–

"ఛ! ఛ! వెధవ రోగాలు! ఓ సరదా లేదు, పాడూ లేదు!" అంటూ రుసరుసలాడి పోయేది.

ఇవన్నీ సర్దుకోవడం ప్రభాకర్‌కి కాస్త యాతనగానే వుంది.

అయితే శ్యామల మాట ఎంత దురుసైనా, ఆమె ఎంత గర్విష్ఠి అయినా భర్తంటే మాత్రం ప్రాణం. ఆ ప్రేమ మూలంగానే.... మకాం మార్చడానికి ప్రయత్నించ లేదామె.

* * * *

సరయుని, మాధవ్‌ని సెంటర్లో చూశాక సరయుతో ఫ్రీగా మాట్లాడలేక పోతున్నాడు రమణ. సరయు ఇంటికి రావటం కూడా తగ్గించేశాడు.

అతను పిల్చినప్పుడు రానన్నందుకే అతను నొచ్చుకున్నాడని అనుకున్న సరయు తనకి తానుగా అతని పోర్షన్‌లో కెళ్ళి పలకరిస్తోంది. అయినా అతను ముభావంగానే వుంటున్నాడు.

సరయు మనసు చాలా బాధపడింది.

ఆ రోజు ఆఫీసులో పెట్టుకున్న లోన్ శాంక్షనై డబ్బు చేతి కొచ్చింది సరయుకి. తల్లి కర్మకాండలకి చాలా డబ్బు ఖర్చయిందని తెలుసామెకి. అది ఏనాటికైనా రమణకి ఇచ్చెయ్యాలనీ తెలుసు. అందుకే లోన్‌కి పెట్టుకుంది

డబ్బు తీసుకుని ఇంటి కొచ్చేసరికి రమణ గది తలుపు తీసే వుంది. మళ్ళీ వెళ్ళిపోతాడేమో అని ఇంట్లోకొచ్చి కాళ్ళూ చేతులూ కడుక్కుని పక్క పోర్షన్లో కెళ్ళింది సరయు.

"రండి!" అన్నాడు రమణ ఏదో కాయితాలు చూసుకుంటున్న వాడల్లా లేచి.

సరయు అతను చూపించిన కుర్చీలో కూర్చుంది. రమణ చేతిలోని కాయితాలు పేపర్‌వెయిట్ కింద పెట్టి–

"ఏవిఁటిలా వచ్చారు?" అన్నాడు తనూ కూర్చుంటూ.

"డబ్బు.... ఇద్దామని!" మెల్లగా అంది సరయు.

"డబ్బా?" అర్థం కానట్టు చూశాడతను.

"అవును! మీకివ్వాలిగా....!"

"నాకివ్వాలా? ఎందుకు?"

జరిగిన కథ - 6: పీడకల వచ్చి త్రుళ్ళిపడి లేచిన సరయుకి స్పృహకోల్పోయి ఉన్న తల్లిని చూసేటప్పటికి గుండె ఆగినంత పనయింది. తమ ఇంట్లో అద్దెకుండే రమణని తల్లి దగ్గర ఉంచి 'వంశధార'కేసి పరిగెత్తింది సరయు. సరయు తల్లి చనిపోయింది. రమణ అన్నీ తానే అయి ఆదుకున్నాడు. సరయుకి రమణతో చనువు పెరిగింది. శ్యామల భర్త డా. ప్రభాకర్ మామగారి ఊరిలో ప్రాక్టీసు పెట్టను ఒప్పుకోలేదు. సరయు మాధవ్ కార్లోంచి దిగటం రమణకంట బడింది కానీ సరయుకి ఆ సంగతి తెలియదు

"అ.... అదే.... అమ్మ పోయినప్పుడు...."

"ఓ! కూలి డబ్బు లివ్వడాని కొచ్చారా?" వ్యంగ్యంగా అన్నాడతను.

"ఛ! ఛ!.... అలా అని కాదు. అప్పుడు మీ చేతి డబ్బు చాలా ఖర్చు చేశారు.... వెంటనే ఇద్దామన్నా నా దగ్గర అప్పుడు డబ్బు లేదు... అందుకే.... ఇప్పుడు...."

"ఓ! ఇప్పుడు వుందా?" కఠినంగా అన్నాడు రమణ.

"ఆఁ!" అతని మాటతీరుకు నొచ్చుకుంటూ అంది సరయు.

"ఎక్కడిదో?"

"అది మీ కనవసరం!" చిరాగ్గా అంది.

"అఫ్‌కోర్స్!.... కుతూహలం!...."


"..... ....."

"మీ కారు ఫ్రెండ్ ఇచ్చాడా?"

గతుక్కుమంది సరయు.

"చెప్పండి!.... అతనే ఇచ్చాడు కదూ?" లేస్తూ అన్నాడు.

"అది మీ కనవసరం అని ఇందాకే చెప్పాను!" కోపంగా అంది సరయు, తనూ లేస్తూ.



"అయితే సరే! కానీ.... ఎవరో, ఎందుకో ఇచ్చిన డబ్బు పూజ్యురాలైన మీ అమ్మగారి కోసం ఖర్చు చెయ్యడం నాకు ఇష్టం లేదు!"

"అంటే?" తీక్షణంగా అంది సరయు.

"మీరిచ్చిన డబ్బు తీసుకోను!"

"తీసుకున్నా సరే.... లేకపోతే కాల్చి బూడిద చేసుకున్నా సరే! మీ ఇష్టం. ఇదిగో డబ్బు! ఇంకా రావాలంటే చెప్పండి! ఇస్తాను." చేతిలోని నోట్లని అతనికేసి దూకుడుగా విసిరేసింది సరయు.

"అవును! ఇప్పు డెంత డబ్బయినా పారెయ్య గలరు. ఓ నిధి దొరికింది కదా! వ్యంగ్యంగా అన్నాడు రమణ ఎగిరే నోట్లని నిర్లక్ష్యంగా చూస్తూ.

"అంటే.... ఏవిఁటి మీరనేది?"

"ఉన్నమాటే!.... ఆ మాధవ్ వున్నన్నాళ్ళూ మీకు డబ్బుకేం కొదవ!"

"ఏవిఁటి?" బిత్తర పోయింది సరయు.

"మరేం లేదు. మాధవ్‌తో తిరిగితే కావల్సినంత డబ్బు!.... కార్లలో షికార్లు.... ఈ పేదవాడితో ...."

"యూ!...." ఆవేశంతో ఒణికిపోయింది సరయు. అతను తగ్గలేదు.

"అవును! అతన్ని నమ్ముకుంటే వేలకి వేలు...." అతని మాట పూర్తి కానేలేదు.


"ఏవఁన్నావ్?" అంటూ గభాల్న దగ్గరి కెళ్ళి అతని చెంపమీద బలంగా కొట్టింది సరయు.

అనుకోని ఈ సంఘటనకి నిర్ఘాంత పోయాడు రమణ. రెండు నిమిషాల తర్వాత తనేం చేసిందో అర్థమైంది సరయుకి.

"అయామ్ సారి! అయామ్ వెరి సారి మిస్టర్ రమణా!.... నేను.... నేను తొందర పడ్డాను!" అనేసి ఒక్క అంగలో తన ఇంట్లో కొచ్చి పడింది.

కిందపడ్డ నోట్లు గాలికి చిందరవందరగా ఎగిరి పోతున్నా, వాటిని తియ్యాలన్న స్పృహ అయినా లేకుండా కుర్చీలో కూలబడి పోయాడు రమణ!

* * * *



కరిగిన శిల

రాత్రి పది గంటలు కావస్తోంది. శ్యామల బెడ్‌రూమ్‌లో సోఫాలో కూర్చుని ఏదో నవల చదువుకుంటోంది. ప్రభాకర్ బెడ్‌మీద పడుకుని రీడర్స్ డైజెస్ట్ చూస్తున్నాడు.

ప్రభాకర్ తల్లిదండ్రులు పల్లెలోనే వుంటున్నారు. ఎంత బతిమాలినా వూరొదిలి రామన్నారు. తరచూ వచ్చి చూస్తామని ప్రామిస్ చేశారు. అలాగే వచ్చి చూసెళ్తున్నారు. భార్యా భర్తలు మాత్రమే వుంటున్నారిక్కడ. అందుకే ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

వున్నట్టుండి ప్రభాకర్ గుండెల దగ్గర అదిమి పట్టుకుని–

"అమ్మో!" అంటూ మెలికలు తిరిగి పోసాగాడు. తుళ్ళిపడి చూసిన శ్యామల ఒక్కంగలో భర్త దగ్గరి కొచ్చి–

"ఏమైందండి?" అంది.

అతను జవాబు చెప్పకుండా బాధతో మెలికలు తిరిగి పోతున్నాడు. పల్స్ చూడబోయిన భార్యని వెనక్కి నెట్టేసి ఉండలు చుట్టుకు పోసాగాడు.

ఆమెకి దుఃఖం వచ్చేస్తోంది.

"ఏమిటండీ?" అంది అతన్ని పట్టుకుంటూ. అతని గుండెల్లో నెప్పి అన్నట్టు సైగ చేశాడు. దిక్కుతోచని శ్యామల ఆ వూళ్ళోనే వున్న మరో డాక్టరైన మోహన్రావుకి ఫోన్ చేసింది. అయితే ఎంతసేపూ ఆ ఫోన్ ఎంగేజ్‌లోనే వుంది.

"మైగాడ్! ఇప్పుడెలా?" ఆమెకి కాళ్ళూ చేతులూ ఆడ్డం లేదు. కంగారుగా భర్తకేసి ఓసారి చూసింది. అతను ఇంకా మెలికలు తిరుగుతూనే వున్నాడు.

దగ్గరగా వచ్చి, "ఎలా వుందండి?" దాదాపు ఏడుస్తూ అంది శ్యామల.

"బాధ! గుండెల్లో బాధ...." గుండెల్ని అదింపెట్టాడతను. ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్దయి పోయింది.

కాస్త తెలివి తెచ్చుకున్న శ్యామల మెడికల్ చెస్ట్ దగ్గరికి పరిగెత్తబోయింది.

"శ్యామలా!" అతి ప్రయాసగా పిల్చాడు ప్రభాకర్.

"ఏమిటండీ?" గభాల్న అతని దగ్గరికి పరిగెత్తుకొచ్చింది శ్యామల.

"ఓసారి.... మోహన్రావుని...."

అతని మాట పూర్తి కాకుండానే–

"ఇప్పుడే తీసుకొస్తానండి!" అని వీధిలోకి పరిగెత్తింది. వీధిలో నిద్రపోతున్న నౌకర్ని వెంట బెట్టుకుని పక్క వీధిలో వున్న డాక్టర్ మోహన్రావింటికి పరిగెత్తింది.

సరిగ్గా అప్పుడే మోహన్రావు కారు స్టార్ట్ చేసి ఎక్కడికో వెళ్ళబోతున్నాడు. శ్యామలని చూసి ఆగి–

"ఏమిటమ్మా?" అన్నాడు.

కంగారుగా విషయం వివరించింది శ్యామల.

"అయ్యో! మీరే వచ్చారా! ఫోన్ చెయ్యక పోయారా?" అన్నాడతను కారు దిగుతూ.

"చేశాను.... కానీ...."

"నేనే పక్కన పెట్టాను!.... వెధవ ఫోన్ కాల్స్‌తో విసుగెత్తి పోతోంది!" కాస్త విసుగ్గా అంది మోహన్రావు భార్య గిరిజ.

శ్యామల మొహం నల్లబడింది.

"ప్లీజ్! త్వరగా రండి!" అంది.

అతను భార్యకేసి చూశాడు.

"వాట్ నాన్సెన్స్! బయల్దేరక బయల్దేరక ఎలా అయితేనేం ఇన్నాళ్ళకి బయల్దేరాం! ఇప్పటికే అరగంట లేటు!.... ఇది మొదట్నుంచి చూడాల్సిన పిక్చర్!...." వినపడీ వినపడనట్టు గొణిగిందావిడ.

శ్యామల ముఖం అవమానంతో మరింత నల్లబడింది. అయినా అభిమానాన్ని పక్కకి నెట్టి–

"ప్లీజ్ డాక్టర్!.... ఒక్కసారి వచ్చి చూడండి." అంది ప్రాధేయపడుతూ.

సంధిగ్ధావస్థలో పడ్డట్టు భార్యకేసి చూశాడతను. ఆమె నుదురు చిట్లించడం గమనించి –

"సారి డాక్టర్!.... టైమయిపోయింది. సినిమా నించి వచ్చేటప్పుడు చూస్తాను. ఈలోగా ఏదైనా ట్రాంక్విలైజర్ ఇవ్వండి!" అంటూ తిరిగి కారు స్టార్ట్ చేశాడు.

కారు కళ్ళ ముందే దూసుకుపోయింది.

"సాటి డాక్టరనైనా చూడకుండా ఎంత నిర్మొహమాటంగా మాట్లాడారు." అనుకుని విస్తుపోయింది శ్యామల. అప్రయత్నంగా, ప్రమాదం తెలిసే తను పేషెంట్స్‌ని సైతం విసుక్కున్న సంఘటన గుర్తొచ్చిందామెకి. అర్ధరాత్రులు డిస్టర్బెన్స్‌గా వుంటుందని ఫోన్ పక్కన పెట్టేసిన సంగతి గుర్తొచ్చింది.

మనసంతా భారంగా అయిపోయింది. ఉసూరుమంటూ తిరుగు మొహం పట్టింది.

ఇంట్లో ఎలాంటి దృశ్యం చూడాల్సొస్తుందో అని భయం భయంగా అడుగు పెట్టిన శ్యామల అక్కడ కనిపించిన దృశ్యం చూసి కొయ్యబారి పోయింది.

అక్కడ హాల్లో ప్రభాకర్, మోహన్రావు, గిరిజ కూర్చుని నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"సారి శ్యామలగారూ! మిమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టాం! కాని ... ఇందులో నా తప్పేం లేదు సుమండీ!... అంతా వీళ్ళిద్దరే చేశారు!" గిరిజ లేచి శ్యామల చేతులు పట్టుకుంటూ సంజాయిషీగా అంది.

"రామ! రామ! నాకూ ఏం సంబంధం లేదండోయ్! ఈ ప్లానంతా వేసింది.... ఇదిగో ఈ ప్రభుగాడే... ఫోన్ పక్కన పెట్టమన్నదీ, సినిమాకి వెడుతున్నట్టు నటించమన్నదీ.... మీరు రమ్మంటే రానని అనమంది అన్నీ... వీడు చెప్తేనే చేశాను." భయంగా రెండు చేతులూ జోడించాడు మోహన్రావు.

నిర్ఘాంతపోయింది శ్యామల.

"సారి డియర్!" భార్యని తీసికెళ్ళి తన పక్కగా కూర్చో పెట్టుకుంటూ అన్నాడు ప్రభాకర్.

"శ్యామలగారూ! ఓ చిన్న అనుమానం!" నవ్వుతూ అన్నాడు మోహన్రావు.

"ఏమిటి?" అన్నట్టు చూసిందామె.

"మీరూ ఒక డాక్టరై వుండి... ఇది హార్టెటాకో, నటనో తెలుసుకోలేకపోయారా?"

"నేనసలు పల్స్ చూడనిస్తేగా?" ముసి ముసిగా నవ్వాడు ప్రభాకర్.

"మరి ... ఆ చమటలు?" అనుమానంగా అంది శ్యామల.

"ఓ! అవా ఓ చెంబు నీళ్ళు ముందే సిద్ధం చేసుకుని మంచం కింద పెట్టుకున్నాను."

"ఎంత మోసం!" చిరుకోపంగా అంది శ్యామల.

"క్షమించండి డాక్టర్ శ్యామలా!.... మీ మనసు నొప్పించేలా ప్రవర్తించాం." నొచ్చుకుంటున్నట్టు అన్న మోహన్రావుని చూసి చిన్నగా నవ్వేసింది శ్యామల.

ఓ రచయితా! జాగ్రత్త !

రచనా పటిమవున్నదని
కారుకూతలు రాసి –
ప్రజల పైకి విసరకు –
అది అణ్వస్త్రానికి మించిన
మారణాస్త్రము –
ప్రజల నాడి తెలిసిన పండితుడనని
విషబీజపు మొక్కల కవనాన్ని
నీ సాహిత్య క్షేత్రంలో పండించకు!
ఆ మొక్కలు పెరిగి – పెద్దవైతే –
నీ జ్ఞానాన్ని – యింగితాన్ని నాశనం చేస్తాయ్!

— చికటి సుబ్రహ్మణ్యం

"బాధ పడకండి డాక్టర్!"... ఇందులో మీరు నొప్పించిందేం లేదు. నా తప్పు నాకే తెలిసేలా సున్నితంగా ప్రవర్తించారు. నిజంగా నేనే మీకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి కూడా!

ఒక డాక్టర్నయి వుండి పేషెంట్స్‌తో నేను ప్రవర్తించిన తీరు తల్చుకుంటే నాకే సిగ్గుగా వుంది.

ఒక వ్యక్తికి సుస్తీ చేస్తే .... ఆ పేషెంట్ తరపు వారికి ఎంత ఆదుర్దాగా వుంటుందో అనుభవించి మరీ తెలుసుకున్నాను. మీ అందరి దయ వల్ల నాలో కాస్త మార్పు వచ్చినట్టే వుంది." అంది శ్యామల.

అందరూ తృప్తిగా చూశారామె కేసి.

మరి కాసేపు కూర్చుని వెళ్ళిపోయారు మోహన్నాథ్, గిరిజ.

ప్రభాకర్, శ్యామలా మంచం మీదికి ఒరిగారు. భార్య మౌనం చూసిన ప్రభాకర్–

"కోపం వచ్చిందా శ్యామూ?" అన్నాడు ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"ఎందుకు?"

"నిన్నో ఆట పట్టించినందుకు."

"పరవాలేదు. ఏదో సరదాకి చేశారు."

"సరదాక్కాదు. నీలో మార్పురావాలని!" భార్య జుట్టు సవరిస్తూ అన్నాడతను.

"పోనీ అదే అనుకోండి.... కానీ..... నేనా కాస్సేపూ ఎంత నరకం అనుభవించానో తెలుసా?" భర్త కళ్ళల్లోకి చూస్తూ అంది శ్యామల.

ఆమె కళ్ళనిండా నీళ్ళూరాయి

"ఛ! ఛ! ఈ మాత్రానికే కన్నీరా?" ఆప్యాయంగా ఆమె కళ్ళు పైట చెంగుతో వత్తాడు ప్రభాకర్.

ఆమె తేరుకుంది.

భార్యకి కబుర్లు చెప్పి నవ్వించాడతను.

పడుకో బోతూ–

"శ్యామూ?" అన్నాడతను మెల్లగా.

"ఏమిటి?" అన్నట్టు చూసిందామె.

"ఈసారి నిజంగానే హార్ట్‌టాక్ వస్తే..... " అతని మాట పూర్తి కానేలేదు. చటుక్కున అతని నోరు మూసి గుండెల్లో తల దాచుకుంది శ్యామల.

* * * *

చాలా రోజుల తర్వాత సరయు ఇంట్లో అడుగు పెట్టాడు రమణ. సంతోషంగా ఆహ్వానించింది సరయు.

ఆ రోజు అతన్ని చెంప దెబ్బ కొట్టాక వెళ్ళి క్షమార్పణ చెప్పుకోవాలని ఎంతగానో అనుకుంది కానీ అతనా అవకాశం ఇవ్వలేదామెకి.

ఆమె ఎంత చేరువ కావాలన్నా అతను దూరంగానే తొలగి పోతున్నాడు అలాంటి అతను తనకి తానే వచ్చేసరికి సరయుకి చాలా సంతోషం వేసింది

"కూర్చోండి రమణా!" అంటూ లోపలికెళ్ళి రెండు కప్పులతో కాఫీ తెచ్చి అతనికో కప్పు ఇచ్చి తనొకటి తీసుకుంది. అతనికెదురుగా కూర్చుంటూ–

"ఏమిటి రమణగారూ! విశేషాలు?" అంది.

"మీరే చెప్పండి" ముభావంగా అన్నాడతను.

"నేనా? భలేవారే!" నవ్వింది సరయు

"ఏం? ఫ్రెండ్స్ ఎవరూ లేరా?" ఫ్రెండ్స్ అన్న చోట ఒత్తి పలుకుతూ అన్నాడు రమణ.

అతని మాటల్లోని వ్యంగ్యానికి సరయు మనసు చివుక్కుమంది కానీ అది పైకి కనిపించనీకుండా–

"నాకు ఫ్రెండ్స్ ఎవరున్నారండి .. కల్పనా వాళ్ళంతా పెళ్ళిళ్ళయి వెళ్ళి పోయాక పట్టి గానుగెద్దు జీవితం అయి పోయింది " బాధగా అంది

"అదేం మీ కారు ఫ్రెండు రావటం లేదా?"

తుళ్ళి పడిన సరయు కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి

"మీరు మాటి మాటికి కారు ఫ్రెండ్, కారు ఫ్రెండ్ అనకండి' నాకు బావుండదు." కాస్త చిరాగ్గా అంది.

"సారీ!"

అతని మొహంలోకి చూసిన సరయు కోపమంతా మంచులా కరిగి పోయింది.

"రమణగారూ! మీరో విషయం నమ్ముతారా?" అంది సూటిగా.

"ఏమిటి?"

"ప్రమాణం చేసి చెప్తున్నాను. మొన్న మీ కిచ్చిన డబ్బు . ఆఫీసులో లోన్ తీసుకుని ఇచ్చాను. మీరు వూహించినట్టు ... " ఆమె గొంతు జీరబోయింది

"తెలుసు!" గంభీరంగా అన్నాడతను.

"తెలుసా?– అయితే ... మొన్న..... "

"సారీ!.... పొరపడ్డాను.... ఆ విషయాన్ని ఇంక మర్చి పొండి ఇప్పుడు మీకో ముఖ్య విషయం చెప్పాలని వచ్చాను." నేల చూపులు చూస్తూ అన్నాడు రమణ

"చెప్పండి". తేలికపడ్డ మనసుతో నవ్వుతూ అంది సరయు

"నేను .... నేను వెళ్ళిపోతున్నాను."

"వెళ్ళి పోతున్నారా? ఎక్కడికి?" అంది సరయు ఆశ్చర్యంగా

"కాళ్ళు తీసి కెళ్ళిన చోటుకి!"

"బావుంది సినిమా డైలాగ్!" నవ్విందామె.

"అలా నవ్వకండి! నేను నిజంగానే వెళ్ళి పోతున్నాను." అన్నాడతను సీరియస్‌గా

అతని మొహం చూసిన సరయుకి అతను నిజంగానే వెళ్ళి పోతాడని



వధూవరుల సమాచారము వుచితంగా ప్రతి బుధవారం ప్రకటిస్తాము.

సమాచారం పంపేవారు ఈ దిగువ నిబంధనలు పాటించాలి.

★ వధువు / వరునికి సంబంధించిన వివరాలు సమగ్రంగా, అచ్చులో 150 అక్షరాలకు మించనట్లుగా తెలుగులోనే స్పష్టంగా వ్రాసి పంపాలి.

★ వధువు / వరుని తల్లిదండ్రులు, సంరక్షకులు తాము ఇచ్చే సమాచారము వాస్తవమని, ఎవరినీ కించపర్చే విషయము అందులో లేదని హామీ ఇవ్వాలి.

★ సమాచారం పంపేవారి పేర్లు వగైరా రహస్యంగానే వుంచబడతాయి. ప్రతి ప్రకటనకు ఒక బాక్సు నెంబరు కేటాయించి, వచ్చిన జవాబులు **వుచితంగానే** వాటికి సంబంధించినవారికి నెల రోజులలోపు పంపడం జరుగుతుంది.

★ ఈ శీర్షికను కుల మత వర్గ భేదాలు లేకుండా అందరూ వుపయోగించుకోవచ్చును.

★ అందిన సమాచారము ప్రతి బుధవారం అవి అందిన వరుస క్రమంలో ప్రకటించబడుతుంది. వీటిని తిప్పి పంపే ప్రసక్తి లేదు. కావున స్వంత అడ్రసు గల కవర్లు, లేదా స్టాంపులు జతపర్చకూడదు.

★ ప్రకటనలు ఏదైన అనర్హమైనదిగా తోచినపుడు దానిని వెయ్యకుండా ఆపుచేసే హక్కు పత్రికకు వుంటుంది.

★ ఇతర విధములైన వుత్తరప్రత్యుత్తరములకు అవకాశం లేదు, ఫోటోలు పంపకూడదు.

★ సమాచారము పంపేవారు ఈ దిగువ కూపను పూర్తిచేసి, స్థానిక ఏజెంటుచే సంతకం చేయించి పంపాలి. కూపను జతపర్చనియెడల పరిశీలించబడవు.

★ కళ్యాణవేదిక శీర్షికద్వారా సంబంధం కుదిరి వివాహం జరిగిన వధూవరుల ఫోటోలు ఉచితంగా ఆంధ్రపత్రికలో ప్రకటించగలము. ఏ తేదీన ప్రకటన వచ్చినది తెలియచేస్తూ ఫోటోలు జతపర్చి "కళ్యాణవేదిక ఫోటో ప్రచురణార్థం" అని వ్రాసి పంపవలెను.

కళ్యాణవేదిక ఉచిత సమాచార కూపను

పేరు... ... ...

చిరునామా ... ...

... ...పిన్‌కోడ్... ....

స్థానిక ఆంధ్రపత్రిక ఏజెంటుసంతకం........................

కరిగిన శిల

అర్థమైంది.

"ఎక్కడికి రమణగారూ?" అంది మెల్లగా.

"ఇప్పుడు చెప్పలేను సరయూ!.... వెళ్ళిపోవాలని మాత్రం అనుకుంటున్నాను."

"వూరొదిలే వెళ్ళిపోతారా?"

"అవును!"

"ఎందుకు?.. ."

"........."

"చెప్పండి రమణా! ... వూర్నించి ఎందుకు వెళ్ళిపోవాలను కుంటున్నారు?"

అప్పుడూ అతను మాట్లాడలేదు.

"నాకు చెప్పడానికి మొహమాట పడుతున్నారా? ట్రాన్స్‌ఫర్ అయిందా?" అనునయంగా అంది సరయు.

"ఉహుఁ!"

"ఉద్యోగం పోయిందా?"

"కాదు!" అన్నట్టు తల వూపాడతను.

"మరి?"

"చెప్తే.... మీరు నొచ్చుకుంటారేమో?" హటాత్తుగా అన్నాడు రమణ.

"నేను నొచ్చుకుంటానా? భలే వారే! చెప్పండి!" నవ్వింది సరయు.

"చెప్పమంటారా?" గంభీరంగా అన్నాడు రమణ.

"చెప్పమనేగా అడుగుతున్నది!" మళ్ళీ నవ్వింది సరయు.

"అయితే వినండి! మీ నుంచి పారిపోవడానికి!" స్థిరంగా వుంది రమణగొంతు.

"వ్వాట్?" అదిరిపడింది సరయు.

"అవును సరయూ! మీ నుంచి దూరంగా చాలా దూరంగా వెళ్ళిపోవాలి.... అందుకే రేపు సాయంత్రం వెళ్ళి పోవాలనుకుంటున్నాను. అద్దె లెఖ్ఖ చూసి ఇస్తాను..... ఈ మాట చెప్పాలనే వచ్చాను. సారీ!" అనేసి చరచరా వీధిలో కెళ్ళిపోయాడు రమణ

ప్రతిమలా బిగుసుకు పోయింది సరయు.

"ఏమన్నాడు? తన నించి దూరంగా పారి పోవాలను కుంటున్నాడా?.... అంటే... అతన్ని తను కట్టి పడేసిందా? లేక కష్టపెట్టిందా?

అమ్మ పోయినప్పుడు సహాయం చేశాడన్న కృతజ్ఞతతో కాస్త చనువుగా వుంటే తన మీద ఇంతటి అభాండం వేస్తాడా?

ఛ! తన బుద్ధి పోనిచ్చుకున్నాడు కాదు. అతని పాత చరిత్ర మర్చిపోయి అతనితో చనువుగా వుండడం తనతప్పు! .... అయినా అతనికీ నాకూ ఏవిటి సంబంధం! అతనేమైపోతే తన కెందుకు!?" కోపంతో ఆమె ముక్కు పుటాలు అదిరాయి. జీవితంలో ఎవరి మీదా, ఎప్పుడూ రానంత కోపం వచ్చిందామెకి రమణమీద.

"ఏమైనా సరే! అతని మీద దెబ్బ తియ్యాలి! రెచ్చగొట్టైనా సరే అవమానించాలి. అభిమానమే మూల ధనంగా బతికే .... తనని అవమానించిన అతన్ని అంత తేలిగ్గా వదలకూడదు!....

అవును! ఆ రోజు డబ్బు ఇచ్చినప్పుడు ఎంత అసభ్యంగా మాట్లాడాడు?.... కారు ఫ్రెండు అంటూ ఎలా గాయపరిచాడు. అసలు తనంటే ఏమనుకుంటున్నాడు.

అవును మరి. కామెర్ల రోగికి లోకమంతా పచ్చగా వుంటుందంటారు.... ఇవే కాబోలు!" పళ్ళు నూరుకుంది సరయు.

అతని రాక కోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తూ కూర్చుంది.

అయితే ఆ రాత్రి అతను ఇంటికే రాలేదు.

(ఇంకా ఉంది)

సాహిత్యాభిమానులకు ★

చక్కటి అవకాశం!

భారతి

చందాదారుగా చేరండి!

ఆదా చేయండి రు 11 దాకా!

ఏజంటు ద్వారా భారతి సంవత్సరం చందా రు. 48.

పోస్టు ద్వారా అయితే భారతి సంవత్సరం చందా రు. 51.

కాని మీరు రు 40 ముందుగా ఒకేసారి చెల్లిస్తే మీకు ఒక సంవత్సరం పాటు భారతి అందుతుంది!

★ అంటే రు. 11 దాకా ఆదా చేసుకో వచ్చునన్న మాట!

రు. 40 చందా మొత్తాన్ని "ఆంధ్రపత్రిక" (గాంధీనగర్, విజయవాడ)కి మని ఆర్డరు ద్వారాగాని, డిమాండు డ్రాప్టు ద్వారాగాని పంప ప్రార్థన. ఏజెంటుకి గాని ఇతరులకి గాని చెల్లించ వద్దని మనవి

ఈ క్రింది కూపనుని నింపి డిమాండు డ్రాఫ్టుతో గాని, మనీ ఆర్డరుతో గాని జతపరచి పంపాలని మనవి.

★ మీరు ఉన్నచోట ఏజెంటు ఉంటే ఏజెంటు ద్వారా భారతి సరఫరా చెయ్యబడుతుంది.

★ ఏజంటు లేకపోతే భారతి మీకు పోస్టులో అందుతుంది!

★ చందా మొత్తాన్ని ఇతరులకి ఇవ్వరాదు! నేరుగా ఆంధ్రపత్రికకే చెల్లించాలి!



- -

నేను "భారతి" మాస పత్రికకు చందాదారునిగా చేరదలుచు కున్నాను. చందా పైకము రు 40 డి. డి./ఎం. ఒ. ద్వారా పంపుతున్నాను.

పేరు : ____

చిరునామా : ____

____

చందాదారుని సంతకం

"మేడ్ ఫర్ ఈచ్ అదర్"

చెలినేని ఉష

సడన్ బ్రేక్‌తో బస్ ఆపాడు రవీంద్ర

'ఏందహ ఇక్కడాపావు?'' సూపర్‌వైజర్ కీచు గొంతుతో వెనకనుండి అరిచాడు.

రవీంద్ర కళ్ళు రెప్ప వెయడం మర్చిపోయాయి కవి విశ్వనాథవారి కావ్య నాయకిలా ఉన్న ఆ బంగారు తీగ వయ్యారంగా బస్ ఎక్కింది

"టింగ్, టింగ్" మంటూ సూపర్‌వైజర్ బెల్ మోగించాడు డ్రైవర్ రవీంద్ర ఈ లోకంలోకి వచ్చాడు. బస్‌ను ముందుకు దూకించాడు.

అతని చేతుల్లో మెత్తగా సాగిపోతోంది బస్. కాలేజీ వచ్చింది. ఆమె అక్కడే దిగింది. రవీంద్ర ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూశాడు

అది సిటీ బస్. నెంబర్ నైన్‌టీన్. రవీంద్ర ఇంటర్ చదివాడు. అతనికి డ్రైవింగ్ హాబీ. చదువుకు తగ్గ ఉద్యోగంలో సుఖం లేదని సిటీ బస్‌లో డ్రైవర్‌గా చేరాడు. సంస్కారవంతుడు, యువకుడు కాలేజీ అమ్మాయిలంతా అతనంటే ఎంతో మోజు చూపిస్తారు. ప్రత్యేకం అతని డ్యూటీలోనే ఆ బస్ ఎక్కుతారు అంతా.

ప్రస్తుతం కాలేజీ తెరిచిన రోజులు ఆమె బస్ స్టాప్‌కు రాబోతుండగా మధ్యలోనే బస్ వెనుకనుండి వస్తోంది. ఆమె యథృచ్ఛికంగా చెయ్యెత్తి బస్ ఆపమన్నట్టుగా వూపింది. రవీంద్ర అప్రయత్నంగా బస్ ఆపాడు.

డ్యూటీ దిగి ఇంటికి వెళ్ళిపోయినా రవీంద్ర మనసు ఆమె గురించి ఆలోచిస్తూనే ఉంది. "ప్రేమ గుడ్డిది. వయసు పిచ్చిది" అన్న సామెత రవీంద్ర విషయంలో ఆరోజు నిజమయింది.

తల్లి పెట్టిన గుత్తొంకాయ కూరలో అతనికి అదివరకటి రుచి తెలియలేదు. ముద్ద మందారంలాటి ఆమె వికసిత వదనం కళ్ళల్లో తిరిగింది.

"ఏమిటిరా ఆలోచన?" తల్లి శ్యామల కసురుకుంది. ఉలిక్కి పడ్డాడు "నాకు ఆకలి లేదమ్మా!" అంటూ కంచం ముందు నుండి లేచిపోయాడు. శ్యామల తెల్లబోయింది. డ్యూటీ చేసి రాగానే నచ్చిన కూరలతో శుభ్రంగా తిని కావాల్సినంతసేపు నిద్రపోవడం కొడుకు అలవాటు అటువంటిది అన్నం వదిలేసాడంటే. ఏమైఉంటుంది? అనుకుంది. ఆవిడకు రవీంద్ర కాక మరో కూతురు ఉంది. కూతురు పెళ్ళి చేసి అత్తారింటికి పంపారు తగ్గ సంబంధంవస్తే రవీంద్ర పెళ్ళి చేయాలనే ఆలోచనలో ఉన్నారు ఆవిడ భర్త పోస్ట్‌మాస్టర్‌గా వేస్తున్నాడు

* * * * * *

మర్నాడు డ్యూటీ ఎక్కాకా రవీంద్ర కాలేజీ మిదుగా వస్తున్న ప్రతి డ్యూటీలోనూ ఆ మెరుపుతీగకోసం తెగ చూసాడు. ఇనుప కడ్డీలతో చేసిన గేట్లు, లోపల బిల్డింగులు తప్ప అతను ఆశించిన వ్యక్తి కనబడలేదు.

ఈ వెధవ డ్రైవర్ డ్యూటీ అంటే మొదటిసారిగా చిరాకు పుట్టింది. 'ఈ ఉద్యోగం మూలానా కనీసం కాలేజీ దగ్గర కాపు వేసి ఆమెను చూసే అవకాశం లేదే? అనుకుని దిగులు పడ్డాడు.

"ఏం గురూ! ఇవాళ చాలా విసుగ్గా ఉన్నావు?" మార్కెట్ దగ్గర బస్ ఆపి ఎదురుగా హొటల్‌లో టీ గ్లాసులు రెండు తెచ్చి ఒకటి రవీంద్ర కిచ్చి మరొకటి తను తీసుకుంటూ అడిగాడు కండక్టర్ భరత్.

'కుర్రాడికి పెళ్ళిగాని కుదిరిందేమో" ముసలి సూపర్‌వైజర్ రాజారావు జోక్ వేసాడు.

రవీంద్ర నవ్వేసి ఊరుకున్నాడు. అతనిలో అందరినీ ఆకర్షించే ప్రత్యేకత అదే. ఏ విషయానికైనా నవ్వుతూ తప్పించుకుంటాడు. ఎక్కువగా మాట్లాడడు. తనకు అక్కరలేని విషయాల్లో తల దూర్చడు. ప్రతిదానికి చిఱునవ్వే సమాధానంగా చూపిస్తాడు

"నాయనా! పెళ్ళాడకు. జీవితం అంటే థ్రిల్ ఉండదు" కండక్టర్ కాళలు తీరిన ప్లీడర్, అనుభవం తెలీని తన క్లయింట్‌కు సలహా ఇచ్చినట్టుగా గొప్పగా ఫోజ్ పెట్టాడు.

మార్కెట్ దగ్గర బస్ ఐదు నిమిషాలు ఆగుతుంది. ఖాళీగా ఆగి ఉన్న బస్‌లోకి ఒకొక్కరు వచ్చి ఎక్కుతున్నారు. డ్రైవర్, కండక్టర్, సూపర్‌వైజర్ ఆ ఐదు నిముషాలు లోకాభిరామాయణం మాట్లాడుకుంటారు. మిగిలిన సిటీ బస్‌లు కూడా అక్కడ ఆపుతారు. ఒకరినొకరు అభిమానంగా గురూ అనీ, బావా అనీ, బ్రదర్ అనీ పలకరించుకుంటూ సిటీ బస్‌ల వర్కర్స్ కూడా స్నేహపాత్రులని నిరూపించుకుంటారు.

"అదేం? మీ ఆవిడ బాగానే చుక్కలా ఉంటుందిగా!" రవీంద్ర నవ్వుతూ అడిగాడు ఫిలాసఫర్‌లా పెళ్ళి చేసుకున్నందుకు చింతిస్తున్న భరత్‌ను.

"లాభంలేదు బ్రదర్! పెళ్ళి అయిన మగవాడిని ఏ ఆడపిల్ల అయినా అస్సయ్యో అంటూ పరిగెట్టి ఏలిచేస్తుంది. సాయంత్రం కాలేజీ వదిలాకా చూడు. జనంలో మునిగిపోయి ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరిఅయి యమధర్మరాజులా ఒక్కళ్ళనీ వదలక టికెట్ కొట్టే నన్నెవరూ లెక్క చేయరు. అద్దాలనుండి వచ్చే చల్లగాలి ఆస్వాదిస్తూ ఎదురు అద్దాలనుండి కనబడే అప్సరసలను తిలకిస్తూ సుతారంగా డ్రైవ్ చేస్తావు. పూలరంగడిలా కనబడే నిన్నే గమనిస్తారు అమ్మాయిలంతా" కండక్టర్ విచారంగా అన్నాడు.

"ఏడ్చావులే. ముందు టీ డబ్బు లిచ్చేసిరా! టైమ్ అయింది పోదాం" అంటూ రవీంద్ర హారన్ పెద్దగా మోగించాడు. అప్పటికే బస్‌లో సీట్లన్నీ నిండిపోయాయి. పుష్పక విమానంలా, వయ్యారంగా కదిలింది బస్. రవీంద్ర చేతిలో ఉన్న డ్రైవింగ్ నైపుణ్యం అదే.

కాలేజీ ముందుకు వచ్చేసరికి కాలేజీ వదిలారు. అమ్మాయిలు స్టయిల్‌గా, రాజకుమార్తెల్లా ఎక్కేది బస్‌కాదు. విమానం అన్నంత గర్వంగా తలలు ఎగరేస్తూ, తలలు దించుతూ రక రకాల భంగిమలలో తమ విలాసం చూపిస్తూ బస్ ఎక్కసాగారు. మగవాళ్ళ కళ్ళన్నీ వాళ్ళమీదే అంటుకుపోయి కళ్ళు అటూ ఇటూ తిరగడం, మానేశాయి. చివరకు ముసలి తాతయ్యలు కూడా కళ్ళతో పాటు కళ్ళద్దాలు కూడా అమ్మాయిలకే అంకితం చేసేసారు.

హంసల్లా ఎగలుపోతూ అలా ఎక్కే అమ్మాయిలనుచూస్తూ స్టీరింగ్ ముందు కూర్చుని తల మాత్రం స్టయిల్‌గా వెనక్కి తిప్పి అమ్మాయిలకు చక్కటి ఫోజులిస్తూ హీరో కృష్ణలా అభినయంచేసే రవీంద్రకు ఇవాళ ఆ అమ్మాయిలను చూడాలంటే వెగటు పుట్టింది. వాళ్ళు మాత్రం అందమైన బస్ డ్రైవర్ తమని గమనించటానికి పాటుపడుతూ బస్ నిండిపోయారు.

బస నిండింది కాని రవీంద్ర ప్రేమ దేవత రాలేదు. "రైట్ గురుగారూ!" సూపర్‌వైజర్ బెల్ మోగించాడు.

గేర్ మార్చబోతున్న రవీంద్ర కళ్ళు కాలేజీ గేటు దగ్గర ఆగిపోయాయి. ఆమె వస్తుంది.

అంతే సూపర్‌వైజర్ ఎంత బెల్ మోగించినా ఫలితం లేకపోయింది. ప్రైంమినిష్టర్ వచ్చాకనే పార్లమెంటు ప్రారంభం అయినట్టు ఆమె తనూ లత బస్‌లో చేరాకనే బస్ స్టార్టు అయింది. ఆమె ఆ జనంలో జరుగుతూ జరుగుతూ డ్రైవర్ సీట్ దగ్గరగా వచ్చేసింది.

రవీంద్ర ఓరకంట ఆమెను చూస్తూ సుతారంగా

డ్రైవ్ చేయసాగాడు.

"గురు! మన బస్, ఆర్. టి. సి వాళ్ళు పుచ్చుకున్నారా?" భరత్‌కు అనుమానం వచ్చి గట్టిగా అరిచాడు.

'లేదే ఏం?" రవీంద్ర ఆశ్చర్యపోయాడు.

"ఆర్ టి. సి వారి బస్‌లా నత్తనడక నడిపిస్తున్నావుగా అందుకు" భరత్ మాటకు బస్‌లో అంతా ఘొల్లున నవ్వారు. ఆమె కూడా నవ్వింది. ఆ నవ్వు చూసాడు రవీంద్ర. అతనికి రోషం వచ్చింది. తన శక్తి నిరూపించుకోవాలన్నట్టు వీరాంజనేయుడిలా అయిపోయాడు. బస్ అఘ మేఘాలమధ్య ఉరికించాడు. నిలబడ్డ అమ్మాయిలంతా ఆ వేగానికి ఒకరిమీద ఒకరు పడిపోతూ కంగారుగాను, హుషారుగాను కేరింతలు కొట్టసాగారు. పుష్పవిలాపంలా అందం గమనిస్తున్నారు కళ్ళద్దాల తాతయ్యలు.

అలా వేగంగా ప్రతి స్టాపింగ్‌లోను బస్ ఆపిన వెంటనే రయ్యిన డ్రైవ్ చేసేస్తున్నాడు రవీంద్ర. జనం ఎక్కేది, దిగేది కూడా గమనించటంలేదు

ఆ బంగారు తీగ కూడా డ్రైవర్ చేష్టలనే గమనిస్తూ అతని వెనుకగా నిలబడింది.

ఆమె పేరు విశాలి. ఆడిటర్ ఆఫీసర్‌గారి ఒక్కగా నొక్క అమ్మాయి. అందంలో ఫస్ట్. చదువులో చురుకు. తెలివిలో జీనియస్. బి. ఎ. ఫస్టియర్‌లో జేరింది. పెళ్ళిళ్ళు స్వర్గంలోనే జరుగుతాయట. అందుకే ఆమెను ఆకర్షించాలని ప్రయత్నిస్తున్న ఆ సుకుమారి మనసులో రవీంద్ర రూపం పడింది.

* * * * * *

ఆరోజు నుండి ఆమె రవీంద్ర ప్రతి డ్యూటీలో అదే బస్ ఎక్కసాగింది. అతని దగ్గరగా నిలబడో కూర్చునో అతడినే అబ్జర్వ్ చేయసాగింది. మూడు నెలలు తిరిగేసరికల్లా ఒకరిమీద ఒకరికి ఆకాశమంత నమ్మకం, భూదేవి అంత ప్రేమ పెరిగాయి. మిత్రుడు వ్యవహారం కండక్టర్ భరత్ గమనించేసాడు. దాంతో డ్రైవర్‌గారి కాబోయే శ్రీమతికి టికెట్ కొట్టడం మానేశాడు. దాంతో ఆమె మొదట సిగ్గు పడినా తరువాత గర్వంతో పొంగిపోయింది. రెగ్యులర్‌గా ఆ బస్‌లో ఎక్కే అమ్మాయిలు కూడా స్నేహితురాలి ప్రేమాయణం కనిపెట్టేసారు. అక్కడితో బస్‌లో ఉన్నంతసేపూ ఆ ప్రేమ జంటమీద జోక్‌లు విసరసాగారు. విశాలి బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కిపోయేయి. రవీంద్ర కళ్ళు కొంటిగా నవ్వేయి.

అటువంటి శుభ సందర్భంలో ప్రేమ మైకంలో మునిగి తేలుతున్న రవీంద్ర చేతులు స్టీరింగ్ నుండి తప్పాయి పక్కకు. దాంతో పక్కనున్న మున్సిపాలిటీ గోడకు ముద్దు పెట్టుకుంది బస్ వెళ్ళి. బస్‌లో హాహాకారాలు మిన్నుముట్టాయి. రవీంద్ర తల వెళ్ళి అద్దానికి కొట్టుకుంది. అతనికి స్పృహ తప్పిపోయింది.


సింపుల్‌గా జరిగిన యాక్సిడెంట్ కాబట్టి బస్‌లో ఎవరికీ ప్రాణాపాయ స్థితి రాలేదు కానీ శరీరాల్లో అక్కడక్కడ చిన్న గాయాలు తగిలాయి.

కళ్ళద్దాల తాతయ్యలు భయంతో కళ్ళద్దాలు కిందకు వదిలేసారు. అవి ఫటా ఫటామంటూ విరిగిపోయాయి.

సురక్షితంగా బైటపడ్డ అందరూ రవీంద్ర దగ్గరకు పరుగు పెట్టారు. అతన్ని హాస్పటల్‌కు తరలించారు. బస్‌లో అందరూ అతన్నిచూసి బోలెడు సానుభూతి చూపించి "ఎవరికి వారే యమునాతీరే" అన్నట్టుగా



గడుసులోకం —బాబు



వెళ్ళిపోయారు. విశాలి మనసు అలా వెళ్ళటానికి ఒప్పలేదు. రవీంద్ర ఎందుకు యాక్సిడెంట్ చేసాడో ఆమె గ్రహించింది.

అందుకే ఆ బస్‌స్టాఫ్‌తో ఆమె హాస్పటల్‌కు వెళ్ళింది. అతడి నుదుట గుచ్చుకున్న గాజు పెంకులు లాగేసి అందంగా కట్టుకట్టారు నర్సులు. బస్ ఓనర్ వచ్చాడు. విషయం అంతా సేకరించాడు. తరువాత పోలీసులు వచ్చారు (ఇక అదంతా ఓనర్, చూసుకున్నాడనుకోండి.)

రవీంద్రకు స్పృహ వచ్చింది. పక్కనే నిలబడ్డ నెచ్చెలిని చూడగానే అతనికి తను చచ్చి స్వర్గం వెళ్ళిన అనుభూతి కలిగింది. కానీ లబో దిబో మంటూ వచ్చిన అమ్మా, నాన్నను చూసి ఆ అనుభూతి దూరంగా పారిపోయింది.

రవీంద్ర శరీరం ఆరోగ్యంగానే ఉంది. తల్లీ, తండ్రికి నచ్చచెప్పాడు "ఐయామ్ ఆల్ రైట్!" అంటూ.

"రవీంద్రా! యు ఆర్ డిస్‌మిస్‌డ్!" రావణాసురుడిలా గంభీర కంఠంతో అతను చేసిన తప్పుకు శిక్ష విధించాడు బస్ ఓనర్‌గారు.

దాంతో రవీంద్ర ప్రేమ హృదయంలో ఫిరంగులు పేలాయి. తన డిస్‌మిస్సా? మరైతే తన ప్రియభామినిని ఎలా చూసుకోగలడు? ఆ క్షణంలో ఆమె కనుక అక్కడ లేకపోతే ఓనర్‌గారి కాళ్ళు పట్టుకుని డ్యూటీ వేయించుకునేవాడు. కానీ ప్రేయసి ముందు తన ఇమేజ్ తగ్గించుకోలేక, అలా అని ఉద్యోగం వదులుకోలేక యన్టీఆర్‌లా తలవాల్చి దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

ఆ భంగిమలో ప్రియుని చూసిన విశాలి హృదయం విశ్వనాథవారి ఏకవీర హృదయంలా కరిగి నీరైపోయింది. హాస్పటల్ అంతా పాకిపోతున్న ఆమె కన్నీరు చూచి కృష్ణగానీ పొంగిపోయిందా!" అంటూ కంగారుపడి నర్సులూ. డాక్టర్స్ అంతా

"మేడ్ ఫర్ ఈచ్ అదర్"

మెయిన్‌రోడ్‌మీదకు పరిగెత్తుకు వచ్చారు.

"ఏమి మా చెల్లమ్మ ఘాటు ప్రేమ" అంటూ భరత్ డ్రైవర్ ప్రేమగాథ ఓనర్‌గారికి వివరించాడు.

విన్న ఓనర్ అవాక్కయ్యాడు తలఎత్తి విశాలిని ఏదో అనబోయాడు. అంతలో "బేబీ వాట్ హాపెండ్?" అంటూ విశాలి తండ్రి ఆడిటర్ ఆఫీసర్ శ్రీనివాసరావుగారు లోపలకు వచ్చేసారు.

ఓనర్‌గారు ఆయన్ని చూడగానే సినీ నటుడు గుమ్మడిగారిలా యమశాంతంగా మారిపోయి, సత్యనారాయణ ఫోజ్ ఇస్తూ ఆడిటర్‌గార్ని కౌగలించుకున్నాడు. ఆ ఇద్దరూ అలా కౌగిలిలో అంటుకుపోయారు.

'మనకా ఛాన్స్ ఎప్పుడు?' అన్నట్టు విశాలి, రవీంద్ర కళ్ళు కలిసి విడదీయలేనట్టుగా అతుక్కు-పోయాయి.

కండక్టర్ భరత్ ఎంతో శ్రమ పడి చివరకు ఎలాగైతేనేం ఆ కౌగిలి, ఈ కళ్ళు విపార్చుకాపార్చు విడిదీసి దూరంగా నిలబెట్టాడు. ఆ ఓనర్‌గారు, ఈ ఆఫీసర్‌గారు స్నేహితులని అర్థం అయిపోయింది అతడికి.

"మీ బేబీ లవర్, అదే మా డ్రైవర్ బహు యోగ్యుడు. అందగాడు, మాటగాడు, ఆటగాడు. అతనికి నా దగ్గర ఉద్యోగం జీవితాంతం గ్యారెంటీ!" గయుడికి హామీ ఇస్తున్న అర్జునుడిలా చెప్పాడు ఓనర్‌గారు.

అంతే "వాట్! మా బేబీ లవరా?" అంటూ శ్రీనివాసరావు అమ్మవారు పూనినట్టుగా ఉగ్రంగా తాండవం చేయసాగాడు. హాస్పటల్ అదిరిపోయింది. కృష్ణానది వరదలు తగ్గి భూకంపంగానీ వచ్చిందా దేవుడా! అంటూ హాస్పటల్ స్టాఫ్ భయంతో మళ్ళీ బైటకు పరిగెత్తారు.

అర్జంట్‌గా బస్ తెచ్చి ఆ ఉగ్ర నరశింహావతారాన్ని పెద్ద యాక్సిడెంట్ చేయాలన్నంత కోపం వచ్చింది డ్రైవర్ రవీంద్రకు. నిస్సహాయంగా ప్రేయసి కళ్ళలోకి చూసాడు.

కళ్ళతోనే ధైర్యం చెప్పింది విశాలి. కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తూ తండ్రిని శాంతపరచింది.

ఈసారి రైస్ కాలువ పొంగిందంటూ హాస్పటల్‌లో గగ్గోలు పుట్టింది.


దేవతల ప్రార్థనతో ఉగ్రం తగ్గించుకున్న నరశింహుడిలా గారాల కూతురు కన్నీటి ప్రార్థనకు పూర్తిగా ఐస్ అయిపోయి చివరకు తియ్యని క్రీమ్‌గా మారిపోయాడు శ్రీనివాసరావు. కూతురి ప్రేమను ఆమోదించాడు తన బస్ మూలంగా రవీంద్రకు పట్టిన అదృష్టానికి తానే అదృష్ట దేవత అయినట్టుగా ఓనర్‌గారు రవీంద్రను చల్లగా చూసారు.

మూడు నెలల నుండి కొడుకులో వస్తున్న మార్పు, అతడికి పెళ్ళిమీద వస్తున్న ఇంట్రస్టు గమనిస్తున్న రవీంద్ర అమ్మ, నాన్నకు అభ్యంతరంపెట్టే అవసరం రాలేదు. కొడుకు సుఖమే తమ సంతోషం అనుకున్నారు.

విశాలి, రవీంద్ర హృదయాలు అప్పుడే ఈస్ట్‌మన్ కలర్‌లో విహరించసాగాయి. కండక్టర్ భరత్ పెద్దగా విజిల్ వేసాడు. ఫలితం సున్నా! కలల్లో తేలిపోతున్న రవీంద్ర, విశాలి బెదర్లేదు, కదల్లేదు. తండ్రులూ+తల్లీ మురిపెంగా చూసుకున్నారు. నాగయ్యలా మంచి మనసుతో దీవించారు ఓనర్‌గారు ఆ ప్రేమ జంటను. □

ఈ కథ ఏ బస్ సంస్థనూ, ఏ వ్యక్తులనూ ఉద్దేశించి రాసినది కాదు. కేవలం హాస్యానికి రాసాను. నేనీ కథ రాయడానికి స్ఫూర్తినిచ్చిన మిత్రులు సత్యం (డ్రైవర్)గారికి కృతజ్ఞతలు.


-రచయిత్రి



వ్యక్తిగతం



ప్రముఖ గుజరాతి రచయిత శ్రీ పన్నాలాల్ పటేల్‌కి 1985 వ సంవత్సరానికి 'జ్ఞాన పీఠం' అవార్డు లభించింది. ఈయన వయసు 74 సంవత్సరాలు. 'జ్ఞాన పీఠం' అవార్డుని అందుకున్న గుజరాతి రచయితలలో ఈయన రెండవ వారు. 1967లో ప్రసిద్ధ గుజరాతి రచయిత శ్రీ ఉమాశంకర్ జోషి ప్రఖ్యాత కన్నడ రచయిత శ్రీ కె వి పుట్టప్పతో సంయుక్తంగా ఈ అవార్డుని అందుకున్నారు. శ్రీ పన్నాలాల్ పటేల్ రచించిన "మన్‌విని భవయ్" నవల గుజరాత్‌లో ఎంతో ప్రామాణిక మైనదిగా పరిగణింప బడుతున్న "సారస్వతి చంద్ర"తో సమానంగా గౌరవింప బడుతున్నది. శ్రీ పన్నాలాల్ పటేల్ 5వ తరగతి కన్నా ఎక్కువ చదవలేదు అయినా సాహితీ రంగంలో అత్యున్నత మైన గౌరవాన్ని అందుకున్నారు. ఈ అవార్డు క్రింద ఆయనకి ఒక లక్షా యాభై వేల రూపాయల నగదు బహుమతి లభిస్తుంది □



కర్నాటక మాజీ ముఖ్య మంత్రి శ్రీ ఆర్. గుండు రావుని కాంగ్రెసు (ఐ) అధిష్టాన వర్గం పార్టీ నుంచి బహిష్కరించింది. ఇటీవల ఆయన చేసిన ప్రకటనలు పార్టీ ప్రతిష్టని దిగజార్చేవిగా ఉన్నందు వల్ల ఆయన్ని ఆరేళ్ల పాటు కాంగ్రెసు (ఐ) నుంచి బహిష్కరించినట్లు ఎ ఐ సి సి(ఐ) ప్రధాన కార్యదర్శి శ్రీ భగవత్ ఝా ఆజాద్ వెల్లడించారు. కొంత కాలంగా ఆయన ప్రవర్తన పట్ల కేంద్ర నాయకత్వం అసంతృప్తితో ఉన్నది. కర్నాటక ప్రదేశ్ కాంగ్రెసు (ఐ) సంఘం కూడా గతంలో ఆయన మీద ఎ ఐ సి సి (ఐ)కి అనేక ఫిర్యాదులు చేసింది. ఈ బహిష్కరణ తమకు ఏమి ఆశ్చర్యం కలిగించ లేదని, ఇలా జరుగుతుందని తాము ముందే ఊహించామని ఆయన అన్నారట! □



ప్రఖ్యాత హాలీవుడ్ నటి రాక్వెల్ వెల్ష్ తనని 'కానరీ రోవ్' చిత్రం తారాగణం నుంచి తొలగించినందుకు నష్ట పరిహారాన్ని కోరుతూ మెట్రో గోల్డ్‌విన్ మెయర్ స్టుడియోల మీద, మరి కొందరి పైనా ఒక కోటి పది లక్షల డాలర్లకి అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని లాస్ ఏంజిల్స్ కోర్టులో దావా వేసింది ఇటీవలే ఆ దావా పరిష్కారం అయి కోర్టు ఆమెకి అనుకూలంగా తీర్పు ఇచ్చింది □

వారఫలం

8-8-1986 శుక్రవారం మొదలు 14-8-1986 గురువారం వరకు

★ **మేషం** : ఎందరెందరికో సాయపడు తున్నారు. సహాయం చేయటంలో మీది పైచేయి. మీదే అగ్రతాంబూలం. అదే చాలదు. వ్యాపార వ్యవహారాలందు దృష్టి ఉంచాలి, శ్రమించాలి. సంస్థను బాగా పెంచాలి. ముఖ్యులతో వివాదం రావచ్చు, గమనించాలి. స్త్రీలకు : బంధువుల రాక, విందు వినోదాలతో కాలక్షేపం.

★ **వృషభం** : శ్రమకు తగిన ఫలితమున్నది. రాజకీయంగా పెద్దగా పెంపు కలదంటే నమ్మ శక్యం గాదు. 'కృషి చేయటం అవసరమే' చాలా మంది కోరిన ప్రదేశాలకు 'ట్రాన్స్‌ఫర్' అయ్యే పరిస్థితు లుంటాయి. వ్యవహారపు చిక్కులుంటే పరిష్కారపు మార్గం ఆలోచించుకొండి. స్త్రీలకు : వృత్తియందు పెంపు, ఆదాయ మందు వృద్ధి, కార్యానుకూలత, చెప్పదగిన వారం.

★ **మిధునం** : దావాతగాదాలు, కోర్టు వ్యవహారాలు, మధ్యస్త తీర్పు వ్యవహారాలుంటే, నింపాతిగా, ఓర్మితో, సుముఖంగా తీర్మానమయ్యే లాగు సంచరించండి. ఇతరుల సహాయం ఆపేక్షించటం న్యాయం. చిక్కుల నుండి విముక్తికై శ్రమించండి స్త్రీలకు: చుట్టు ప్రక్కల గొడవలతో, కార్యభంగంతో నిరుత్సాహతతో చాల మంది సతమత మవుతారు.

★ **కర్కాటకం** : ఎవరేమనుకొన్నా, ఏది ఎలాగైనా, మీ మతం విడనాడకండి. మీ ఆలోచనలకు స్వస్తి చెప్పకండి. కొంతలో కొంత మేలైన కాలమే. ఆరోగ్యాన్ని కాపాడు కోవాలి. కొందరకు 'శస్త్ర చికిత్స'కు అవకాశ మున్నది. అయినా ఇబ్బంది లేదు స్త్రీలకు: ఉన్నత విద్యాభ్యాసానికి ఉద్యోగరీత్యా పెంపు ఆశించుటకు అనుకూలం.

★ **సింహం** : 'ఒకానొక వ్యవహారం బాగా అనుకూలం, డబ్బు చేతి కందినది. అవసరాలు తీరా'యని అనుకొన్నంతలోనే నిరుత్సాహత ఏర్పడుతుంది. చాల మంది ఉద్యోగరీత్యా యత్నించిన కృషి వ్యర్థం కాదు. అనుకూల వార్తాశ్రవణం. వృత్తియందు పెంపు రాణింపు గలవారం. స్త్రీలకు: ఆశయ సిద్ధికా యింకా కొంత వ్యవధి ఉన్నది

★ **కన్య** : అన్నివిధాలా, అన్ని రంగాలలో, అనుకొన్నది అలాగే జరగటం గమనిస్తారు. "వారఫలం అత్యుత్తమం" అని కూడా తలచు కొంటారు ఏనాహో, ఎవరికో యిచ్చిన డబ్బు రాబట్టు కొనుటకు బ్రహ్మ ప్రయత్నం చేస్తారు. సంపాదిస్తారు. మంచిదేగా! స్త్రీలకు: వస్తు, వస్త్ర సేకరణకు, చిన్న చిన్న ప్రయాణాలు చేయుటకు అనుకూలం. ఆదాయం గల వారమే

★ **తుల**: వారమంతా ఊహాగానాలతో, స్వర్గానికి నిచ్చెన అనుసంధిస్తా మనుకోవటంతో గడచి పోతుంది. కొందరకు అధిక ధనాదాయం, గ్రహరీత్యా ఉన్నది, కాని ప్రయోజనం? అధిక వ్యయం. స్త్రీలకు: నాట్య నాటక రంగస్థల, చలన చిత్రావకాశాలు కొందరకు అప్రయత్నంగా లభ్యం కాగలవు.

★ **వృశ్చికం** : నాలుగు విధాలా వత్తిడి రానున్నది. అప్పులు చిక్కవు. పైపెచ్చు క్రితం తీసిన బాకీలను గూర్చి అధిక వత్తిడి రానున్నది. ఉద్యోగ విషయంగానో, యిచ్చి పుచ్చుకొనే విషయంగానో యిచ్చిన మాట తప్పటంతో మరి చికాకు. స్త్రీలకు: చాల మందికి ఏవిధంగా కలసిరాని వారం, అధిక శ్రమ, కొందరకు గొడవలు.

★ **ధనుస్సు** : "ఏది కలసి రాలే"దని ఆరాట పడవద్దు. కాలం అనుకూలంగా లేదు. "శని" గ్రహానుకూలత లేనే లేదు. అధికంగా వెచ్చించాలసిన కాలం అలాగని మీరు జాగ్రత్త పడుట మానివేయకండి. ముఖ్యులతో విముఖంగా ఉండకండి. స్త్రీలకు: మనస్తాపాలు, లేనిపోని గొడవలు, ఉద్యోగ సంబంధ అంతరాయాలు లేకుండా చూడండి.

★ **మకరం** : మీ ఆలోచన యందు లోపం లేదు. కార్యాచరణమందు అంతకన్న లోపం లేదు. ధనరాబడి యందు పొరపాటు లేదు. అధిక విద్యార్జనకు అనుకూలం. వృత్తియందు పెంపు చేకూరుట, "కాలం కలసి వచ్చినదని" సంతోషింప తగిన వారం స్త్రీలకు అలాగే, సర్వత్రా అనుకూలం. శుభ వార్తాశ్రవణం.

★ **కుంభం** : "అన్నివిధాలా అనుకూలం" అనుటకు వీలు లేదు. శుభం జరిగే మార్గం లేదు. అధిక వ్యయం, అనవసరమైన గొడవలకు ఆస్కారమైన వారం. అలాంటప్పుడు జాగ్రత్తగా ఉండాలిగా! ఇంటికి బంధుమిత్రులు రానున్నారు. స్త్రీలకు: కొంతలో కొంత మేలు, విందు వినోదాలు, వృధా కాలక్షేపం.

★ **మీనం** : అసలు విషయం మినహా అన్నీ చేకూరుతాయి. ఏదో ఒక వ్యవహారం అనవసరంగా మెలిక పడుతుంది అసలు నెరవేరు తుందా? అనే సందేహం. ఏమయితే నేం అంతో యింతో ధనాదాయ మున్నది. శుభ కార్యాచరణమునకు అనుకూల వారం స్త్రీలకు ఆరోగ్యాభివృద్ధి. కొందరకు గృహ మార్పు.

– విద్వాన్ కోటసత్య రంగయ్యశాస్త్రి

మనుషులకు కాకపోతే కోర్కెలు మానులకుంటాయా? మనుషులకు కోర్కెలు కలగటం సహజం గదా! రామమూర్తికి, ఎందుకో ఆ రోజు - ఆ వింత కోర్కె కలగటం మాత్రం కాస్త వింతేననాలి!


అతను ప్రముఖ రచయితగా వ్రాసే నవల "ఇది మా కథ", ధారావాహికంగా, ఒక ప్రముఖ దినపత్రికలో వచ్చేప్పుడు, అది ఎంత మంది చదువుతున్నారో తెలుసుకోవాలనేదే - ఆ కోరిక!

అంతే! లేడికి లేచిందే పరుగు అన్నట్టు ఆ కార్యక్రమం అంతు తేల్చుకోవాలని, రంగంలోకి దిగాడు.

తను రచయిత కాబట్టి తనను ఎరిగినవాళ్ళు తన

ఇదీ నడుస్తున్న చరిత్ర

ఎం.డి.సౌజన్య



నవలను గురించి అడిగితే - మొహమాటపడుతూ నిజం చెప్పరు!?

అందుకని, తానెవరో తెలియని గుంటూరు లాంటి పట్టణంలో, తన పాప్యులారిటీ ఏ పాటిదో తెలుసుకోవాలనుకున్నాడు. అందుకే నిముషాల్లో గుంటూరు చేరాడు.

మొదట రామ్మూర్తి, దినపత్రికలు కొనకుండా చదివే అలవాటుండే జనం చేరే 'క్షుర కర్మశాలకు' వెళ్లాడు.

అక్కడ జనం అయిదారుగురు క్షుర సేవలు పొందుతుంటే, అయిదారుగురు వెయిటింగ్ లిస్టులో ఉన్నారు.

రామమ్మూర్తి, తనూ గడ్డం చేయించుకొనే నెపంతో, ఆ వెయిటింగు లిస్టులో చేరిపోయాడు

అక్కడ తన సీరియల్ ధారావాహికంగా వెలువడుతున్న 'తెలుగు ఢంకా' పత్రిక ఎవరి చేతిలో వుందో చూశాడు.

ఎవరో పాతిక ముప్ఫయి ఏళ్ల మధ్య వయసున్న గడ్డం యువకుడు ఆ పత్రిక చూస్తున్నాడు

అతని వాలకం చూస్తే నిరుద్యోగి ఏమో

'వాంటెడ్ కాలమ్' లాంటి శీర్షిక తదేకంగా చూస్తున్నాడు.

అతన్ని మెల్లిగా మాటల్లోకి దింపి తీరా విషయం కదిపితే "నేను దినఫలాలు - స్పోర్ట్స్ కాలమ్‌లు తప్ప, మరొకటి చదవను! అయినా కాలక్షేపం కోసం వ్రాసే నవలల సీరియల్స్ చదివి టైం వేస్ట్ చేయటం ఇష్టంలేదు!" అన్నాడు నిర్మొహమాటంగా.

"అయితే నిరుద్యోగ సమస్య చిత్రించే నవలను నిరుద్యోగి కూడా చదవటం లేదన్నమాట-' అనుకున్నాడు, రామమూర్తి.

వెయిటింగ్ లిస్టులో ఉన్న వాళ్లల్లో, ఆ మధ్య యాభై అయిదేళ్లకే అర్థాంతరంగా రిటైర్ అయి కోర్టుకెక్కిన ఉద్యోగి, ప్రక్కనే ఉన్నాడు.

ఆయనను "ఇది మా కథ" నవల గురించి కదిపాడు, రామమూర్తి.

ఆయన చిద్విలాసంగా, సర్వసంగ పరిత్యాగిలా ఒక చిరునవ్వు నవ్వి ... మీరు చెప్పే ఆ నవల - అర్థాంతరంగా, తెల్లారేప్పటికి ఉద్యోగాలు పోయిన మా బాధామయ గాథ కంటె గొప్పగా వుంటుందా!? యువకుడిగా నేను ప్రేమగీతాలు, ఆ ప్రేమ ఫలించక, విషాద గీతాలు, విరహ గీతాలు - ఒకప్పుడు వ్రాశాను! ఇప్పుడు నేను పేపర్లో చూసేది ... నాలా ఉద్యోగాలు పోయిన వాళ్లను ప్రభుత్వం ఏ విధంగా ఆదుకోబోతోంది - అన్నదే!" అన్నాడు.

ఇక అక్కడ లాభం లేదని, అన్ని కాలేజీలకు సెంటర్‌లో ఉన్న వెంకటేశ్వర రీడింగ్ రూమ్‌కు బయలుదేరాడు, రామమూర్తి.

అక్కడైతే "ఇది మా కథ" నవల చదివే విద్యార్థులైనా, తమ తమ అభిప్రాయాలు నిర్మొహమాటంగా వెలువరిస్తారని, అతని ఆశ!

రామమూర్తి అక్కడికి వెళ్లేటప్పటికి దాదాపు రీడింగ్ రూమ్ నిండా అన్ని వయసులవాళ్లూ కిటకిటలాడి పోతున్నారు.

ఎవరో స్టూడెంట్ 'తెలుగు ఢంకా' పత్రిక శ్రద్ధగా చదవటమే కాదు, నోట్సులో ఏదో వ్రాసుకుంటున్నాడు.


"బహుశా అతను నా నవల "ఇది మా కథ" - అనేది చదివే ... ఏదో ఇంపార్టెంట్ మేటర్ నోట్ చేసుకుంటున్నాడు!" అనుకున్నాడు, రామమూర్తి.

ఆ సంతోషంతో రామమూర్తి, 'తెలుగు ఢంకా' - పత్రిక చేతిలో వున్న విద్యార్థి ప్రక్కన ఎలాగో ఇరుక్కుని, "ఇది మా కథ" సీరియల్ చదివి ఇస్తాను!" అన్నాడు, పత్రికవేపు ఆశగా చూస్తూ.

అంతవరకు ఆ పత్రిక చూస్తున్న విద్యార్థి "మా అభిమాన హీరో సినిమా ఎన్ని కేంద్రాల్లో శతదినోత్సవాలు చేసుకుందో 'నోట్' చేసుకుంటున్నాను!! జస్ట్ వొన్ మినిట్!" అంటూ తెలుగు ఢంకా ఇచ్చివేశాడు.

అతను ఆ పని మీదే అక్కడి రీడింగ్ రూముకు వచ్చినట్టు అక్కడి నుంచి వెళ్లిపోతుంటే, అతని వెంట నడచి ఆ విద్యార్థిని మాటల్లోకి దింపి "ఇది మా కథ" - సీరియల్" నవల బాగుందని అంటున్నారు! ఈ రీడింగ్ రూమ్‌లో పాత కాపీలు ఇవ్వమంటే ఇస్తారా

హలో! —గీతా



ఇదీ నడుస్తున్న చరిత్ర

ఇక్కడే చదవటానికి?" అన్నాడు, రామమూర్తి.

అలాగన్నా, ఆ విద్యార్థిని సంభాషణల్లోకి దింపాలని.

రామమూర్తి వేపు ఆశ్చర్యంగా చూసిన ఆ విద్యార్థి "సోషల్ నవలలు ఎవరు చదువుతారండి ఈ రోజుల్లో! కాస్త - క్రైమ్, సెక్స్, మర్డర్ హర్రర్ ఉండాలి గాని!" అన్నాడు.

సోషల్ నవలలు ప్రచురించే పత్రికల పాత కాపీల విషయం అతనికి పట్టినట్టే లేదు.

"ఇదేమిటి! విద్యార్థులు - నేటి విద్యా విధానం వాటిలో లోపాలు - గైడ్లు - వాటి వల్ల విద్యా స్థాయి ఎలా దిగజారిపోయిందో ఎంతో కష్టపడి వ్రాశానే! అయితే అవి ఎవరూ చదవటం లేదన్నమాట ...!! విద్యార్థి సమస్యలు కూలంకషంగా చర్చించిన విషయాలు -విద్యార్థులే తెలుసుకునే పరిస్థితిలో లేరన్న మాట ... వాట్ ఎ ఫాల్ మై కంట్రీ మెన్!" అనుకున్నాడు, రామమూర్తి, బాధగా.

ఇక అక్కడ వుండబట్టక రామమూర్తి సిటీ బస్సెక్కి లక్ష్మీపురం బయలుదేరాడు.

బస్సులో ఎవరి దగ్గరా 'తెలుగు ఢంకా' లాంటి పత్రికేలేదు.

వందమందున్న బస్సులో ఒక్కరి దగ్గరా -'తెలుగు ఢంకా' లాంటి - అత్యధిక పాఠకుల చేత (కొని) చదవబడుతున్న పత్రిక - లేకపోవటం ... ఎంత బాధాకరమైన విషయం!

పోనీ 'తెలుగు ఢంకా' కాకపోతే మరొక పత్రిక వుందా అంటే అదీలేదు.

నిరాశగా లక్ష్మీపురంలో దిగిన రామమూర్తికి ఎదురుగా 'ఒక 'అద్దె లైబ్రరీ' పుస్తకాల షాపు కనిపించింది.

అక్కడ అన్ని రకాల పుస్తకాలతో పాటు డైలీ పేపర్లూ, వీక్లీలు, మంత్లీలూ అద్దెకివ్వబడునని బోర్డు ఆశ్చర్యంగా చూశాడు.

"డైలీ పేపర్లూ అద్దెకిస్తారా?" అన్నాడు ఆశ్చర్యంగా, రామమూర్తి.

"పేపరు కొని ఇంటికి తీసికెళ్లి చదివి గంటలో తెచ్చిస్తే, అద్దె ఒక పావలా అవుతుంది! ఇక్కడే చదివి ఇచ్చేటట్లయితే ... పావలాకి రెండు పేపర్లు, గంటలో చదవటానికి ఇస్తాను!" అన్నాడు, ఆ షాపువాడు.

రామమూర్తి తెలుగు ఢంకా పత్రిక కొంటూ

"ఇందులో ఏదో సీరియల్ బాగుందంటున్నారు మీరు చదివారా?" అన్నాడు, రామమూర్తి.

"మాయలు, మంత్రాలు, హత్యలు, మాన భంగాలు, క్రైమ్, డిటెక్షన్ లేకుండా వ్రాస్తే ఎవరు చదువుతారు సార్ సీరియల్!" అన్నాడు షాపతను.

"అయితే సామాజిక స్పృహ ...!" అన్నాడు రామమూర్తి.


"రాసేవాళ్ళు వంటి మీద స్పృహ వుండి వ్రాస్తే ఇక చదివేవాళ్లని గురించి అడగొచ్చు! రైటర్సులో ఉన్నంత హిపోక్రసీ ప్రపంచంలో మరెవరి దగ్గరైనా వుందా!! వాళ్లందుకోలేనివి, వాళ్లకే సరిగా అవగాహన కానివి, వాళ్లకే తలా తోకా తెలియని వ్రాసే వాళ్ళు ఎక్కువయ్యారు!! కాలక్షేపం కోసమో పేరు కోసమో వ్రాసే వాళ్ళు ఎక్కువయ్యారు!! అలాగే .. ఏమీ తోచక చదివేవాళ్ళు!! సాహిత్య విలువలు ఎవరికి కావాలి?సంఘం బాగుపడాలని ఎవరు కోరుకుంటారు!!పాఠకుల బలహీనతలను ఆధారం చేసుకుని రచనలు సాగించినన్నాళ్ళు, ఆ రచనలు ఆధారంగా పత్రికల సర్క్యులేషన్లు కాపాడుకోవాలనుకున్నన్నాళ్ళు ఈ సమస్యకు పరిష్కారం లభించదు!" అన్నాడు షాపువాడు.


రామమూర్తికి ఆ షాపు యజమాని ధోరణి వింతగా అనిపించి "మీరు చెప్పేదాన్ని బట్టి చూస్తే, మీకు రచనల విషయం - పత్రికల విషయం, పాఠకుల విషయం, బాగా తెలిసిన వారల్లే వుంది ...!!మీ పేరు?" అన్నాడు, రామమూర్తి.


ఆ వ్యక్తి సమాధానంగా నవ్వి, "పూర్వాశ్రమంలో నా కలం పేరు 'కమలాప్రియ'!! ఒకప్పుడు నేనే ఒక సాహితీ మాసపత్రిక నడిపాను! సాహితీ రంగంలో ఏమాత్రం పరిచయం వున్నవారైనా 'కమలిని' అనే పత్రిక పేరు వినే వుంటారు.

నా అసలు పేరు రాంప్రసాద్!! వెయ్యి కథలు వంద నవలల పైచిలుకు వ్రాశాను. ఈ సాహితీ పిచ్చిలో పడి ఇల్లు, పొలం పోగొట్టుకున్నాను. ఇక జ్ఞానోదయం అయ్యాక జీవికకు ఈ అద్దె పుస్తకాల షాపు ఆధారమయ్యింది!" అన్నాడు, బాధగా.

పూర్వం సాహితీరంగంలో 'కమలాప్రియ' పేరు తెలియని వారు లేరు. అంత గొప్పగా, అన్ని రచనలు చేసిన రచయితనే విస్మరించింది ప్రస్తుత సమాజం!! మరి ... నాలుగు నవలలు వ్రాసిన తనను గురించి ....?? రామమూర్తికి భయంవేసింది. □


కోమలబాబు బి.ఎ.
సమర్పించు
కె.కె.ఆర్ట్స్
వారి
నిర్మాత కోమల సత్యనారాయణరావు బి.ఎ. ఫోటోగ్రఫీ పి.ఎస్.ప్రకాష్ దర్శకత్వం జి.సి.శేఖర్ సంగీతం చక్రవర్తి


ఆ పక్క గోడౌనుకి 1000/- రూపాయలు అద్దె ఐతే మీరు 1500/- అడుగుతున్నా రేంటి!
అవునండీ - మాది నాగార్జున సిమెంట్ తో కట్టిన గోడౌన్ - మీ స్టాక్సు భద్రంగా వుండేది ఇక్కడే మరి! అదీ సంగతి!
MAM-26



ఆ భవంతి గేటు ముందు నిలబడి పరీక్షగా చూస్తూ రెండు నిమిషాలు గడిపిందామె.

చేతిలో బరువుగా తోచిన ఎయిర్ బేగ్‌ని క్రింద వుంచి చెదరిన ముంగురులను సవరించుకొంది.

కర్చీఫ్‌తో మొహానికి పట్టిన చెమటను తుడుచుకొంది. ఆ భవంతి పై అంతస్థులో గానీ, క్రింది భాగాన గానీ ఎవరూ

కనిపించలేదు.

తండ్రి చెప్పిన యిల్లు అది అవునో కాదో నన్న అనుమానం తోచింది. పర్సులో వున్న అడ్రసు చీటీని మరోసారి బయటకు తీసింది.


అందులో వున్న యింటి నెంబరూ గేటుపై వేసి యున్న నెంబరూ ఒకటేనని నిర్ధారించుకొంది. "డాక్టరుగారిల్లైతే ఆయన పేరుతో బోర్డు వుండాలే!" సంకోచంతోనే గేటు తెరచుకొని లోనికి అడుగు పెట్టింది.

గేటు దాటగానే చిన్న సైజు పూలతోట! భయం భయంగా దిక్కులు చూస్తూ పూలతోట దాటి ఆ భవనం ముందు వరండాలో ప్రవేశించింది.

ముందు తలుపులు వేసి వున్నాయ్. నిశ్శబ్దంగా వుంది. ఎవర్ని పిలవడం?ఎలా పిలవడం? సందిగ్ధావస్థలో పడింది. ఎవరైనా బయటకు రాకపోతారా అన్న ఆశతో నిలబడింది. ఎయిర్ బాగ్ని గోడవారగా వుంచింది.

"ఏవిటిలా వచ్చావ్? ఒంటరిగా వచ్చావా? లోపలికి రా!" అంటూ లోనికి నడిచారు ధర్మరాజుగారి అర్ధాంగి అనసూయమ్మ.

బేగ్ని చేతిలోకి తీసుకొని ఆమెను అనుసరిస్తూ ఆ భవంతిని పట్టి పట్టి చూస్తోంది రేణుక. "డాక్టరుగారు పోయారన్న మాట!" అనుకొంది. అనసూయమ్మగారిలో చాలా మార్పు వచ్చింది. పది సంవత్సరాల క్రితం చూసింది. తాను కూడా పోల్చుకో లేకపోయింది. రేణుకను మూడు గదులు దాటించి హాల్లోకి తీసుకెళ్లారు అనసూయమ్మ. సోఫాలో కూర్చుంటూ "రా కూర్చో!" అన్నారు ఆప్యాయంగా.



వీధిలోంచి గేటు తెరచుకొని పని పిల్ల వచ్చింది. ఆమెను పరీక్షగా చూస్తూ పలకరించకుండానే లోపలకి వెళ్ళింది. ఆ పిల్లను ఏదో అడగాలనుకొన్న ఆమె అడగలేక పోయింది. కొన్ని క్షణాలు గడిచాయ్. తలుపులు తెరచుకొని ఒకామె బయటకు వచ్చింది. ఏభై సంవత్సరాలు దాటి వుంటాయ్. వితంతువు సంస్కారవంతురాలు.

"ఎవరు కావాలమ్మా?" అడిగిందామె ఆ యువతిని పరీక్షగా చూస్తూ.

"డాక్టర్ ధర్మరాజు గారిల్లు యిదేనాండి?" అడిగింది వినయంగా, ఆ యువతి.

"అవును! యిదే!" గంభీరంగా వచ్చాయ్ మాటలు.

"నమస్కారమండి!" అంటూ చేతులు జోడించి,

"మాది విశాఖపట్నమండి! విశ్వనాధం మాష్టారమ్మాయి రేణుకను!" చెప్పిందా యువతి.

ఆ యిల్లాలి కళ్ళు పెద్దవయ్యాయ్. మొహంలో ఆనందాశ్చర్యాలు చోటు చేసుకొన్నాయ్.

"ఏవిటీ! సత్యవతమ్మగారమ్మాయివా! ఎంత పెద్ద దానివయ్యావే! పోల్చుకోలేకపోయాను!"

ఆమె మాటల్లో ఆప్యాయత, చూపుల్లో అనురాగం.

"అవునండి!" సిగ్గుతో తలవంచుకొంది రేణుక.

బెహరా వెంకటసుబ్బారావు

చేతిలోని బేగ్ని ఎక్కడ పెట్టడమా అని తటపటాయిస్తున్న రేణుకను చూసి,

"ఆ బేగ్ని అక్కడ పెట్టమ్మా! ఎక్కడకి పోదు!" అన్నారు ఆప్యాయంగా. బేగ్ని సోఫాకి పక్కనే వుంచి అనసూయమ్మగారి పక్కనే పొందిగ్గా కూర్చొంది రేణుక.

"అమ్మగారూ నాన్నగారూ కులాసాయేనా?" అడిగారు.

"బావున్నారండి!" చెప్పింది నమ్రతగా.

"వెంకాయమ్మగారూ! మరో కాఫీ తెండి!" వెనక్కు తిరిగి ఆజ్ఞాపించారు అనసూయమ్మ.

"సరిగా కూర్చోవమ్మా! మేమేవీఁ కొత్తవాళ్ళం కాదు!" నవ్వుతూ

నిశ్శబ్ద సంగీతం

మందలించారు ఆమె సంకోచాన్ని పోగొట్టాలని.

వంట మనిషి వెంకాయమ్మ రెండు కాఫీ తెచ్చి టీపాయ్ మీద వుంచారు. రేణుకను తదేకంగా చూసి లోనికి వెళ్ళారు. ఒక కప్పుని రేణుకకి అందించి రెండో కప్పుని తీసుకొన్నారు అనసూయమ్మ.

ఓ సిప్ చేసి,

"మీ అన్నయ్య ఏం చేస్తున్నాడు?" అడిగారు. రేణుక మొహంలో విషాదం ఆవరించింది.

"అన్నయ్య ఓ షిప్పింగ్ కంపెనీలో స్టెనోగా పని చేస్తూ వుండేవాడండి! సిటీ బస్ ఏక్సిడెంటులో చనిపోయాడు! రెండేళ్ళయింది!"

గద్గదస్వరంతో చెప్పింది రేణుక.

"అయ్యో పాపం!" విచారించారు అనసూయమ్మ" నాన్నగారు రిటైర్ అయారనుకొంటా!" అన్నారు.

"అవునండి! మూడేళ్ళయింది!" చెప్పింది.

వారి కుటుంబ పరిస్థితిని అవగాహన చేసుకొన్న అనసూయమ్మ మరి ప్రశ్నలు వేయలేదు. కొన్ని క్షణాలు మౌనంగా దొర్లాయ్. అనసూయమ్మ గారమ్మాయి గురించి అడగాలనుకొంది రేణుక. కానీ అంతలో అనసూయమ్మ గారే అడిగారు, మందహాసం చేస్తూ –

"మా రమని మర్చి పోలేదనుకొంటా!"

"ఆమె గురించే అడగాలనుకొంటున్నానండి!" అంది నవ్వు మొహంతో.

"అది బియస్సీ పాసయింది. ఉద్యోగం చేస్తానంటూంది! వాళ్ళన్నయ్య ఒప్పుకోలేదు. నేను కూడా యిష్టపడ లేదనుకో! సంబంధాలు చూస్తున్నాం!"

"ఇంట్లో లేరాండి?" అడిగింది.

"సిటీలోకి వెళ్ళింది. పంజాగుట్టలో మా అన్నయ్య వుంటున్నారు. వాళ్ళింటికి వెళ్ళింది. వచ్చేస్తుంది!"

"డాక్టరుగారు పోయారన్న సంగతి మాకు తీలీదండి! డాక్టరుగారి కిమ్మని మా నాన్నగారి లెటరిచ్చారు!" పర్సులోంచి తీసి ఒక వుత్తరాన్ని అందించింది రేణుక.

ఆ వుత్తరం చదివాక అనసూయమ్మగారి కళ్ళు చెమర్చాయ్.

"ఆయన పోయి నాలుగేళ్ళయింది! ఎవరెవరికి ఉత్తరాలు రాసారో తెలీదు!" ఆవేదనపడ్డారు.

"ఇక్కడికెప్పుడొచ్చావ్? ఇంటర్వ్యూ అయిందా?" అడిగారు.

"ఇదే రావడవండి! రేపే యింటర్వ్యూ!"

"అలాగా! చాలా సంతోషం!" అంటూ లేచారామె. రేణుక కూడా లేచి నిలబడింది. పనిమనిషిని పిల్చి వేడినీళ్ళు పెట్టమని పురమాయించారు అనసూయమ్మ.

"శుభ్రంగా వేడినీళ్ళ స్నానం చెయ్! బడలిక తీరుతుంది! రా! రమ గదిలోకి వెళ్దాం! నీ బేగ్‌ని ఆ గదిలో పెట్టుకో!" అంటూ రమ గదిలోకి నడిచారామె.

గదిని చూసి రమ అభిరుచు లెలాంటివో గ్రహించింది రేణుక.

* * * *

డాక్టర్ ధర్మరాజుగారూ, మ్యున్సిపల్ హైస్కూల్ హెడ్మాష్టరు విశ్వనాధంగారూ విశాఖపట్నంలో ఒకే యింట్లో అద్దికుండేవారు. డాక్టరుగారు కె. జి. హాస్పిటల్లో ఫిజీషియన్. డాక్టరుగారు ఎంతో కలుపుగోరు మనిషి. అనసూయమ్మ కూడా అంతే! డాక్టరుగారి కిద్దరు సంతానం. మాష్టారికి ముగ్గురు పిల్లలు. మాష్టారి పెద్దబ్బాయి శంకరమూ, డాక్టరుగారబ్బాయి రఘు ఒకే ఈడు వారు. ఒకే క్లాసు చదువుతూ వుండేవారు. డాక్టరుగారమ్మాయి రమ – రేణుక ఒకే వయస్సు పిల్లలు! అన్నయ్యల కన్నా రెండు క్లాసులు దిగువ వుండేవారు. ఆ రెండు కుటుంబాలు రమారమీ పది సంవత్సరాలు ఆ యింట్లో వున్నాయ్. ఏ అరమరికలూ లేకుండా ఒకే కుటుంబంలా మసిలేవారు. తర్వాత డాక్టరు గారికి ప్రమోషన్ వచ్చి హైదరాబాద్‌కు బదిలీ అయారు. ఆ కుటుంబాల మధ్య మూడేళ్ళ పాటు వుత్తర ప్రత్యుత్తరాలు జరుగుతూ వుండేవి. ఆ తర్వాత ఆగిపోయాయ్. డాక్టరుగారి కుటుంబం విశాఖపట్నం వదలి పది సంవత్సరాలైంది.

* * * *

వేణీళ్ళ స్నానం చేసి తల దువ్వుకొంది రేణుక. డ్రెస్సింగ్ టేబులు ముందు కూర్చొని బొట్టు పెట్టుకొంటూంటే అద్దంలో, రమ గదిలో అడుగు పెట్టడం కన్పించింది రేణుకకి. చటాల్న వెనక్కు తిరిగింది. ఒకరి మొహాలొకరు చూసుకొన్నారు. సభ్యత కోసం మందహాసం చేసింది రమ. కానీ ఆమెవరో తెలీక తికమక పడింది. పలకరించాలనుకొంది.

"మీరు .... మీరు ...." అని ఆగిపోయింది.

"నేనండి! రేణుకను!" చెప్పింది రేణుక.

అర్థం కానట్టు చూసింది రమ. గదిలో అడుగు పెడ్తూ అడిగారు అనసూయమ్మ కూతుర్ని.

"విశాఖపట్నం విశ్వనాధం మాష్టారమ్మాయి రేణుక! మర్చిపోయావా?"

"మాష్టారు మావయ్యగారి రేణుకా!" రమ మొహం వికసించింది. గుర్తించ లేకపోయినందుకు సిగ్గుపడింది. ఆ తర్వాత "మీరు చాలా మారిపోయారు! పోల్చుకోడం చాలా కష్టమైంది!" అంది క్షమాపణ అర్థిస్తున్నట్టుగా.

"నీవు మాత్రం మారిపోలేదుటే! చిన్నప్పటి దానిలాగే వున్నావా?" కూతుర్ని అడిగారు అనసూయమ్మ.

"అవునండి! నేను కూడా పోల్చులేకపోయాను!" అంది రేణుక.

"ఎప్పుడొచ్చారు?" సోఫాలో కూర్చుంటూ అడిగింది రమ.

"సాయంత్రం అయిదు గంటలవుతుందండి!" అంది రేణుక రమ కెదురుగా నిలబడి.

వారి సంభాషణలు విన్న అన్నసూయమ్మ అచ్చెరు వొందారు.

"బావుందర్రా! మీ పలకరింపులూ మీరూను! ఏవే! ఒసే! అని పిల్చుకొనేవారు. ఇప్పుడు ఏవండి అని మన్నించుకొంటున్నారేవిఁటి!" ఆప్యాయంగా మందలించారు ఆ యిరువురినీ. సిగ్గు పడ్డా రిద్దరూ.

"అన్నయ్య రాలేదామ్మా!" మాటలు మార్చాలని అడిగింది రమ.

"ఇదే నేవిఁటే వాడొచ్చే వేళ? వాడొచ్చేసరికి ఎనిమిదో తొమ్మిదో అవుతుంది కదా! కొత్తగా అడుగుతున్నావేంటి?" అంటూ సోఫాలో ఆశీనురాలయ్యారు అనసూయమ్మ. రేణుక నిలబడే వుండడం ఆమెకు నచ్చలేదు.

"ఏవిటలా నిలబడే వుండిపోయావ్! రా కూర్చో!" అన్నారు. రమ పక్కనే కూర్చొంది రేణుక.

"రేణుకకి టెలిఫోన్ ఆపరేటర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది!" చెప్పారు కూతురుతో.

"హాయ్ రేణూ! కంగ్రాట్స్! ఈ సిటీలో నేనా ఉద్యోగం?" ఆనందోత్సాహాల్తో ఆమెను వూపేస్తూ అడిగింది రమ.

"లేదండి! ఇంటర్వ్యూ అవాలి! సెలక్టయ్యాక మూడు నెలలు ట్రైనింగ్! ఆ తర్వాత ఉద్యోగం!" చెప్పింది రేణుక.

అంతలో వెంకాయమ్మగారు కేక వేయడంతో, "మీరు మాట్లాడుకొంటూ వుండండి!" అంటూ అక్కడ నుంచి బయటకు వెళ్ళారు అనసూయమ్మ.

"మా అన్నయ్య కిక్కడే ఉద్యోగం! హెవీ యెలక్ట్రికల్స్‌లో ఇంజనీర్!" చెప్పింది రమ

"అలాగా! చాలా సంతోషం! చాలా కాలానికి కల్సుకొన్నాం!" సంతోషాన్ని తెలియ జేసింది రేణుక.

"నీ వొచ్చావని అన్నయ్యకి ఫోను చేస్తా!" అంటూ లేచింది రమ. "వద్ద"ని వారించాలనుకొంది రేణుక. కానీ రమ ఆ అవకాశం యివ్వకుండా రిసీవరెత్తి నంబర్ డయల్ చేసింది.

"రఘునాధ్‌గారున్నారాండి?"

"..... ...."

అలాగా అంటూ క్రెడిల్‌మీద రిసీవర్ను పెట్టింది.

"అన్నయ్య ఆఫీసు వదలి పదినిమిషాలైందిట!" చెప్పింది.

ఆ కుటుంబం తనపై చూపుతూన్న ఆదరాభిమానాలకి, ఆప్యాయతకి

ముగ్ధురాలైంది రేణుక.

ఇద్దరూ చిన్న నాటి విషయాలెన్నో ముచ్చటించు కొన్నారు. వీధిలో మోటారు సైకిలు వచ్చిన శబ్దం అయింది....

"అన్నయ్యొచ్చాడు!" అంది రమ.

తొట్రుపడుతూ చివాల్న లేచి నిలబడింది రేణుక. ఆమె తడబాటుకి పకాల్న నవ్వింది రమ.

"కంగారెందుకు? అన్నయ్యంటే పులను కొన్నావా? అయినా అన్నయ్య నా గదిలోకి రాడు! తిన్నగా మేడ మీదకి తన గదిలోకి వెళ్తాడు!"

ఆమె చేయి పట్టుకొని లాగి కూర్చోపెట్టింది రమ.

★ ★ ★ ★

డైనింగ్ టేబిల్ ముందు కూర్చున్నాడు రఘు. నలుగురికి మీల్సుండటం చూసి,

"మావయ్య వచ్చాడేవిటమ్మా?" తల్లి నడిగాడు.

"లేదురా! విశాఖపట్నం విశ్వనాథం మాష్టారు జ్ఞాపకం వున్నారా?" అడిగారు కొడుకుని.

"ఆఁ! ఆఁ!" మాష్టారొచ్చారా? ఏరి?" సంబరపడుతూ లేచి నిలబడ్డాడు రఘు.

"ఆయన రాలేదు!" చెప్పిందామె.

"మరి?"

"వారమ్మాయి రేణుక వచ్చింది!"

"రేణుకా?" సాలోచనగా అన్నాడు.

"రేణుకేరా! జ్ఞాపకం లేదా? మన రమతో కల్సి చదువుకొంటూ వుండేది.. ఇద్దరూ ఒకే ఈడు! ఒకే క్లాసు!"

తిరిగి కుర్చిలో కూర్చొంటూ, "అవునవును!" అన్నాడు రఘు.

"రేపు టెలిఫోన్ ఆపరేటర్ ఉద్యోగానికి యింటర్వ్యూ వుందిట! వచ్చింది!" అని కొడుక్కి చెప్పి,

"భోజనం వడ్డించడమైంది రండర్రా!" వెనక్కి తిరిగి పిల్లల్ని కేకేసారు.

విశాఖపట్నంలో తాను గడిపిన రోజులు జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు రఘు. మాష్టారబ్బాయి శంకరవూఁ తనూ ఒకే క్లాసు చదువుతుండేవారు! రమా-రేణుకా ఒకే క్లాసు! వారిద్దరూ కల్సి తన నాడించాలని ప్రయత్నించేవారు. లెక్కలు తన చేతనే చేయించుకొనేవారు. వాళ్లని ఏడిపించాలని తప్పుగా చేసి యిచ్చేవాడు. వారు మేష్టారి చేత చివాట్లు తిని, తిరిగొచ్చి తనకు లెక్కలు చేయడం రాదని వెక్కిరించేవారు. శంకరం చాలా మంచివాడు. లెక్కల్లో జీనియస్. ఇద్దరూ కవలపిల్లల్లా వుండేవారు. అలాగే అంటుకొని తిరిగేవారు

పిల్లలిద్దరూ భోజనానికి ఎంతకూ రాకపోవడంతో లేచి రమ గదిలోకి వెళ్లారు అనసూయమ్మ. రేణుక సిగ్గుపడుతుంటే చేయి పట్టుకొని లాగుతోంది రమ.

"రేణు రావడానికి సిగ్గుపడుతోందమ్మా!" ఆమె చేయి వదలి తల్లితో చెప్పింది రమ. ముసి ముసిగా నవ్వుకొన్నారు అనసూయమ్మ.

"రఘు నీకు కొత్తవాడుటే! చిన్నప్పుడు మీరిద్దరూ కల్సి వాడితో కోరుండి కయ్యానికి దిగేవారు! వాడూ మీలాగే పెద్దవాడయ్యాడు. మీలా చిన్నతనం చేష్టలు పోలేదు! కాకపోతే ఉద్యోగం చేస్తున్నాడంతే! పదండి!" తొందర చేసారు.

"అన్నయ్యా! ఈవిడెవరో చెప్పుకో చూద్దాం!" డైనింగ్ టేబిల్ సమీపిస్తూ అడిగింది రమ. తల వంచుకొని నిలబడి వున్న రేణుకని చూస్తూ-

"ఏమో నాకేం తెలుస్తుంది! మొహం కనబడితే కదా చెప్పడానికి!" అన్నాడు చమత్కారంగా రఘు.

వెనక్కి తిరిగింది రమ. "ఓహో! ఈమెకు మళ్లీ సిగ్గు ముంచుకొచ్చిందిలా వుంది!" అంటూ ఆమె మొహాన్ని మీదకు ఎత్తింది బలవంతంగా.

"ఇప్పుడు చెప్పు చూద్దాం!" అడిగింది అన్నయ్యని.

"ఎవరో తెలీదు గానీ విశాఖపట్నం శాల్తీలా వుంది!" అని నవ్వేసాడు. అనసూయమ్మ కలుగజేసుకొన్నారు.

"బావుందర్రా మీ వేళాకోళం! దాన్ని భోజనం చేయనివ్వరా!" మందలించారు పిల్లల్ని. తన ప్రక్కనే ఆమెను కూర్చోబెట్టుకొన్నారు.

భోజనం చేస్తూ ఏవో ప్రశ్నలు వేసింది రమ.

"ఆఁ, వూఁ!" అని రేణుక సమాధానాలు చెబుతూంటే,

"నువ్ వాగడవేఁ గానీ ఆమె పెదవి విప్పి మాట్లాడదు! ఈవిడేం ఆపరేట రుద్యోగం చేస్తుంది రమా! ఆ జాబ్‌కి ఈమె అన్‌ఫిట్!"

డిక్లేరు చేసాడు రఘు ఎగతాళిగా.

ఫకాల్న నవ్వింది రమ.

"ఫోనులో మాట్లాడుతుంటే ఎదుటి వ్యక్తి కనబడ్డు కదన్నయ్యా! వాడు పరిచితుడైనా అపరిచితుడైనా ఒకటే! ఫేస్ టూ ఫేస్ మాట్లాడ్డవంటి ఇబ్బందిగానే వుంటుంది! అయినా నువ్వు సవ్యంగా మాట్లాడుతున్నావా? అన్నింటికీ వేళాకోళమే! మీ ఆఫీసరుగారి దగ్గర కూడా యిలాగే మాట్లాడుతావా?"

ప్లేటు ఫిరాయించింది రమ.

"ఒక్క అయిదు నిమిషాలు మాట్లాడకండి! దాన్ని భోజనం చేయనీండి!" మరోసారి మందలించారు అనసూయమ్మ పిల్లల్ని.

"మాష్టారి ఆరోగ్యం బావుందాండి?" సాఫీగా, సౌమ్యంగా అడిగాడు రఘు.

"బావున్నారండి! రిటైరయి మూడేళ్ళయింది!" చెప్పింది నమ్రతగా రేణు.

"పాపం వాళ్లన్నయ్య బస్ ఏక్సిడెంట్‌లో పోయాడుటరా!" అన్నారు అనసూయమ్మ.

తృళ్లిపడ్డాడు రఘు, షాక్‌తిన్నాడు.


"శంకరం పోయాడా?" ఆశ్చర్యపడ్డాడు.


"అవునండి! షిప్పింగ్ కంపెనీలో పనిచేస్తూ వుండేవాడు." చెప్పింది రేణుక.

"శంకరం చాలా మంచివాడమ్మా!"

సానుభూతి ప్రకటించాడు రఘు.

★ ★ ★ ★ ★ ★





కార్టూనిస్టులకు సూచనలు !

- ★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి.
- ★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.
- ★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి !
- ★ వ్యాఖ్య **చిన్నదిగా, క్లుప్తంగా** వుండాలి. అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి ! కార్టూన్ **మీదే** పేరూ, వూరూ అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.
- ★ సొంత చిరునామాగల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పి పంపడం జరుగుతుంది. దారిలో పోయేవాటికి మా బాధ్యత లేదు.
- ★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది. పరిశీలనకు ఐదారు వారాలు పట్టవచ్చు.
- ★ పండుగల కార్టూన్‌లు — బాగా ముందుగా వాటి కవరుమీద ఆ ''ప్రత్యేక'' సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.
- ★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.
- ★ మా కార్యాలయానికి స్వయంగా వచ్చి కార్టూన్‌లు అందజేసేవారు ... స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతచేయాలి. ... కార్టూన్‌లు పంపరాదు.

నిశ్శబ్ద సంగీతం

మర్నాడుదయం తన యిష్టదైవానికి మొక్కుకొంది రేణుక. ఇంటర్వ్యూకి బయలుదేరుతూ అనసూయమ్మగారితో చెప్పింది.

"ఇంటర్వ్యూకి వెళ్లివస్తానండి!"

అనసూయమ్మ సోఫాలోంచి చటాల్నలేచి

"ఒక్కనిమిషం ఆగమ్మా !" అని వంటగదిలోకి వెళ్లారు. ఎందుకోతెలీక రమవైపు ప్రశ్నార్థకంగా చూసింది రేణుక.

"చూస్తావుగా! అమ్మకి చాదస్తం ఎక్కువ. శకునాల్లో ఆమెకు దృఢమైన నమ్మకం వుంది!" అంది రమ.

తన వెంట వెంకాయమ్మగార్ని తీసుకొచ్చారు అనసూయమ్మ.

"అలా వీధిలోకి వెళ్లి మన రేణుకు ఎదురురండి!" పురమాయించారు.

'నీకంతా చాదస్తవమ్మా!" విసుక్కొంది రమ.

'అలా అనకు రమా! శకున ఫలాలు తప్పకుండా కన్పిస్తాయ్!" అన్న రేణుక మాటలు విని మరి విసుక్కపోయింది రమ.

'సరి సరి! నీకూ వుందన్నమాట ఆ సెంటిమెంట్! ఇద్దరికీ సరిపోయింది!" విసుక్కొంది మరోసారి. ఆమె వెనుకనే గేటుదాకా వెళ్లి సాగనంపింది.

"విష్‌యూ బెస్టాఫ్ లక్!" విష్ చేసి తిరిగొచ్చింది.

★ ★ ★ ★ ★ ★

టెలిఫోన్ ఆపరేటర్‌గా సెలక్టయింది రేణుక. మూడు నెలలు ట్రైనింగ్. ట్రైనింగ్ కాలంలో నెలకి నూటముప్పయి స్టైఫండిస్తారు. ట్రైనింగ్ పూర్తయాక ఆ సిటీలోనే ఉద్యోగం యిస్తారు. మర్నాటినుంచే ట్రైనింగ్. తేలికపడిన హృదయంతో ఆఫీసునుండి బయట పడింది రేణుక. ఎన్నో వూహలు! ఆలోచనలు!!

ఉద్యోగంలో చేరాక యింటికి సాధ్యమైనంత ఎక్కువ డబ్బు పంపాలి! తమ్ముడి కాలేజీ పూర్తికావాలి! వాడుకూడా వుద్యోగస్థుడైతే తమకి కష్టాలు తొలగుతాయి. అప్పుడు తన పెళ్లి గురించి ఆలోచించొచ్చు! మరి ట్రైనింగ్ మూడునెల్లూ ఎలాగడపడం? స్టైఫండ్‌తోనే కాలక్షేపం చేయాలి. అనసూయమ్మగారింట్లో వుండొచ్చు! మరి భోజనం? తమ యింట్లోనే భోజనం చేయమనొచ్చు! ఎంతకాలం తింటాను? ఆ యింట్లోనే ఒక గదిలో వండుకొని తినొచ్చు! కానీ అనసూయమ్మగారు ఏమంటారో? వండుకొని తినడవే మంచిది!

ఆలోచిస్తూ తిరిగి అనసూయమ్మగారిల్లు చేరుకొంది. తన అభిప్రాయాన్ని తెలియజేసింది. అనసూయమ్మ, అనుకొన్నట్టుగానే అంగీకరించలేదు.

ట్రైనింగ్ మూడు నెలలూ తమతోనే ఉండమన్నారు. ఇరకాటంగా వున్నా ఒప్పుకోక తప్పలేదు రేణుకకి.

ట్రైనింగ్ మూడు నెలలూ యిట్టే గడిచి పోయాయ్. హైదరాబాద్‌లోనే అపాయింట్ చేసారు. ఆ విషయం తెల్సుకొని ఆ యింటిల్లిపాదీ అమితానందం పొందారు. . కానీ అప్పుడే రేణుకకి అసలు సమస్య పట్టుకొంది.

తానెక్కడ వుండాలి? ఒంటరిగా ఆ మహాపట్నంలో ఎలా వుండడం? తమ్ముడి చదువుకోసం అమ్మ అక్కడే వుండాలి. తండ్రి జబ్బు మనిషి. ఈ సంవత్సరం పూర్తయితే వారినందర్నీ హైదరాబాదు తీసుకొని రావచ్చు! అంతవరకూ ఎలా? ఆలోచనలో పడింది. తనలాగే అవస్తపడుతున్న తన కోలీగ్ వనజ తటస్థపడింది. ఇద్దరూ ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు. ఒక చిన్నయిల్లు అద్దెకు తీసుకొని కలిసి వుండడానికి నిశ్చయించుకొన్నారు.

రేణుక తన అద్దె కొంపకు వెళ్తానంటే అంతా అయిష్టంగానే "వూ!" అన్నారు. అయితే అనసూయమ్మ, రమా కొన్ని షరతులు పెట్టారు.

"రోజూ తీరిక సమయంలో ఒక్కసారైనా వచ్చి కనబడాలి! ఆదివారాల్లోనూ, పండగ దినాల్లోనూ తమ యింట గెస్టుగా వచ్చి తీరాలి!"

వారి అనురాగానికి, ఆప్యాయతకీ మరోసారి ముగ్ధురాలైంది రేణుక. ఆ గుమ్మందిగుతూంటే ఏడుపు వచ్చింది ఆమెకి.

(ఇంకా ఉంది)



శ్రీ బాబూరావు శ్రీమతి యూన్సీ

ఇద్దరూ ఉద్యోగస్తులైతే!

అన్నీ ఇబ్బందులే

మేమిదరం ఆంధ్రా యూనివర్సిటీలో చదువుకుంటుండగా ప్రేమించుకున్నాము నేను ఎమ్ కాం చదువుకుంటున్నాను ఆమె ఎమ్ ఎ ఇంగ్లీషు లిటరేచర్ చదివేది ఇద్దరి చదువు పూర్తయ్యాం తరువాత ఉద్యోగాలలో స్థిరపడిం తరువాత వివాహం చేసుకోవాలను కున్నాము అలాగే నాకు హైదరాబాద్ సెక్రటేరియేట్‌లో ఉద్యోగం వచ్చింది ఆమెకు టెలిఫోన్స్‌లో ఉద్యోగం వచ్చింది ఇదరం సంపాదిస్తున్నాము కదా హాయిగా జీవితం సాగిపోతుందని నా భావన కొంత కాలం తరువాత చిత్తూరు జిల్లాలోని వాయిల్పాడు గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం వస్తే చేరాను అనుకున్న విధంగా మేము వివాహం చేసుకున్నాము ఆ ఉద్యోగం నాకంతగా నచ్చలేదు ఆలిండియా రేడియోలో పోస్టులున్నాయని తెలుసుకుని నేనూ నా భార్య ఇదరమూ అప్లై చేశాము ఇంటర్వ్యూలో ఇదరం సెలక్ట్ అయ్యాము

నన్ను విజయవాడ రేడియో స్టేషన్‌లో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా నా భార్యను విశాఖపట్నం రేడియోస్టేషన్లో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా పోస్ట్ చేశారు కొంత కాలం తరువాత ఆమెను కూడా విజయవాడ ట్రాన్స్‌ఫర్ చేశారు అంటూ వివరించారు ప్రస్తుతం ఆలిండియా రేడియోలో యువవాణి ప్రోగ్రామ్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్న శ్రీ ఎన్ బాబూరావు

శ్రీ బాబూరావు శ్రీమతి యూన్సీ ఆలిండియా రేడియోలోనే ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నారు!

మీకింకా ప్రమోషన్ రాలేదా? అని అడిగితే ఆయన యు ఎ ఎస్ ఇంటర్వ్యూకి వెళ్ళి ప్రమోషన్ సంపాదించారు నాకు మరో సంవత్సరం పడుతుంది అని – అయినా ఎందుకు లెండి? ప్రమోషన్ వచ్చిన దగ్గర నుండి మా వారు ఆలిండియా రేడియోకే అంకితమైపోయారు ఇరవై నాలుగ్గంటలూ రేడియో స్టేషన్లోనే కాపురం చేస్తున్నారు! భార్యా పిల్లలూ గుర్తుకు వచ్చినప్పుడు ఇంటి కొస్తుంటారు ఇదరం ఉద్యోగాలు చేసుకుంటే హాయిగా ఉండొచ్చు అనుకున్నాను కానీ అసలు రిలీఫ్ ఉండదనుకోలేదు ఎంత గవర్నమెంటు సర్వెంట్సయినా కాస్త కుటుంబ విషయాలు కూడా పట్టించుకోవాలి కదండి అంటూ నిష్ఠూరం వెళ్ళబుచ్చారు

అదండి ఆవిడ బాధ ఆవిడకేమో ఎప్పుడూ డ్యూటీలు తెల్లవారు జామున ఐదు గంటల నుండి పదకొండింటి వరకూ డ్యూటీ ఉన్న రోజు నేనే అన్ని కార్యక్రమాలూ నిర్వర్తించి పిల్లల్ని స్కూలుకి పంపి ఎది గంటలకు నా డ్యూటీకి యటెండ్ అవుతాను ఒకవేళ రాత్రి డ్యూటీ పడితే ఆవిడ లేకపోయినా పిల్లల్ని చదివించి భోజనం పెట్టి నిద్ర పుచ్చి ఆవిడకోసం ఎదురు చూస్తాను ఇవి మామూలు డ్యూటీ ఉన్నప్పుడు నేను ఇంకా ఇంట్లో స్పెషల్ డ్యూటీలు ఎక్కడ చెయ్యనండి నాది ఎగ్జిక్యూటివ్ పోస్ట్ తలకు మించిన పనులతో సతమతమౌతుంటాను అన్నారు బాబూరావు

కనీసం ఆదివారమన్నా ఇంట్లో ఉండక పోతే ఎలాగండి ? పిల్లల విషయం తండ్రి పట్టించుకోపోతే వాళ్ళకి భయభక్తులు ఎక్కడుంటాయి? కుటుంబంలో భార్యాభర్తలిదరికి బాధ్యత లుంటాయి ఒకరినొకరు అరం చేసుకుని ఒకరికష్టాలు ఒకరు తెలుసుకుని మసలుకుంటే సంసారం సాఫీగా సాగిపోతుంది పిల్లలు కూడా అభివృద్ధిలోకి వస్తారు మేమిద్దరం చదువుకున్నా పిల్లలకి చెప్పలేక ట్యూషన్ పెట్టించాల్సి వచ్చింది ఇద్దరం సంపాదిస్తున్నా పైసా మిగుల్చుకోలేక పోతున్నాం! ఎంత కష్టపడినా ఏం ప్రయోజనం చెప్పండి! అన్నారు శ్రీమతి యూన్సీ

ఒక ప్రక్క స్త్రీకి సమాన హక్కులు కావాలంటారు మరో ప్రక్క పురుషుడి మీద అజమాయిషీ చెయ్యాలనుకుంటారు! ఎలా చెప్పండి? అసలు నన్నడిగితే కుటుంబం విషయంలో పురుషుడి కన్నా స్త్రీకే ఎక్కువ బాధ్యతలు ఉంటాయి పిల్లలు తండ్రి దగ్గరకన్నా తల్లి దగ్గరే బాధ్యతలు తెలుసుకుంటారు నేను కుటుంబం కన్నా ఉద్యోగానికే ప్రాముఖ్యత ఇస్తాను అంటారు శ్రీ బాబూరావు

అందుకనే ఆయనతో వాదించడం మానుకున్నాను సరుకు పోతున్నాం కాబట్టి సమస్యగా కనిపించడం లేదు కానీండి ఎలాగైనా భార్యా భర్తలిద్దరూ ఉద్యోగం చేయడం వల్ల అన్నీ ఇబ్బందులేనండి భర్త సౌత్‌పోల్ భార్య నార్త్‌పోల్ అయితే ట్రబుల్స్‌పోల్ తప్పదు అన్న యూన్సీగారి మాటలకు అడ్డు తగులుతూ ఆ రెండు పోల్స్ లేకపోతే ఆకర్షణే లేదు అన్నారు శ్రీ బాబూరావు అక్కడే పుట్టింది కదూ మాగ్నటిజం!

— కృష్ణాజీ

పెద్దమనసు

కె. ఛాయారమ్మ

ఎండ చురుక్కుమని తగలగానే మెలకువ వచ్చింది ఇందిరకి. గతుక్కుమనిలేచి కూచుంది మంచం మీద.

గడియారం ఎనిమిది గంటలు చూపిస్తోంది.

"ఇంతసేపు నిద్రపోయిందా తను?" రాత్రి ఒక్కక్షణం కూడా కంటిమీద కునుకులేదు.

మనస్సంతా చికాకుగా వుంది.

బాబిగాడు పక్కంతా పాడుచేసి అందులోనే నిద్రపోతున్నాడు. "వీడికి కూడా ఇవాళ తెలివిరానట్టుంది!" అనుకుని వాణ్ణి తీసుకుని బాత్‌రూమ్ వైపుగా నడిచింది ఇందిర.

ముందు కాలువ దగ్గర రాత్రి వేసిన కంచాలు గిన్నెలు అలాగే వున్నాయి. "ఈ రాణీగారు దయచేసినట్టులేదు!" అనుకుంది పనిమనిషి సితాల్ని గురించి తలుచుకుంటూ.

సితాలు రోజూ తెల్లారగట్ల నాలుగు గంటలకే వచ్చి గిన్నెలుతోమి వెళ్తుంది. తనకి హాయిగా వుంటుంది.

"కాని ఈ రోజు.....?"

చల్లని నీళ్ళు ఒంటిమీద పడగానే "కయ్"! మని ఏడ్చాడు బాబిగాడు.

"నోర్మూయ్! వెధవాయ్!" అంటూ వాడి వీపుమీద రెండు చరించింది ఇందిర.

వాడు ఏడుపు స్థాయి పెంచాడు.

"ఇంక ఆయనగారు దిగుతారు! వస్తూనే చిందులు తొక్కుతారు! ఈ పనులన్నీ ఎప్పుడు తెములుతాయో?"

కాఫీ కలుపుకు తాగి గిన్నెలు ముందరేసుకుని కూచుంది.

"బాబిగాడు పాడు చేసిన గుడ్డలన్నీ ఉతకాలి కుక్కర్ ఎక్కించాలి!" "భగవాన్!" అప్పుడే బారెడు పొద్దెక్కింది."

"దీనికెంత పొగరు!" విలాసాలు చిత్తగిస్తోంది విలాసాలు!" ఫస్టు తారీకు రాకముందే జీతానికి రడీ! కాని పనిమాత్రం చెయ్యాలని వుండదు. అయినా తన తెలివితక్కువతనంకాని. అది పనిమనిషేమిటి? మహరాణి?" అనుకుంది నుదుట పట్టిన చెమటని పైటతో తుడుచుకుంటూ.

బాబిగాడు పాలుతాగి మురికిలో ఆడుకుంటున్నాడు. "వీడికింకా తలస్నానం చేయించాలి! దీనికేం పొయ్యేకాలమో?" పని ఎగ్గొట్టింది.

గిన్నెలు కడిగి లోపలపెడుతూవుంటే వచ్చాడు భర్త ప్రసాద్. "ఏమోయ్ ఇందూ వంట రెడియేనా! ఆఫీసుకి వేగం వెళ్ళాలి! అసలే ఆఫీసర్ యముడు! అందునా క్యాంప్ విశేషాలు అన్నీ క్షణాలలో తెలియచెయ్యకపోతే ఊరుకోడు!" అన్నాడు టవల్ భుజంమీద వేసుకుని బాత్‌రూమ్‌వైపు నడుస్తూ.

కోపం ద్విగుణీకృతమయ్యింది ఇందిరకి. మరోసారి సితాలుమీద విరుచుకుపడింది.

"తనేం లోటుచేసింది దానికి!" భర్తకన్నా ముందు దానికే కాఫీపోసేది!" తన చేతిఖర్చుకి వుంచుకున్న డబ్బులు కూడా నెలాఖరు ముందర దాని ముఖాన్నే కొట్టేది! కాని దానికి విశ్వాసం ఏది!

"వాణ్ణి చూస్తున్నావా ఎంత దర్జాగా తయారయ్యాడో? ఎక్కడున్నావు?" గట్టిగా అరిచాడు ప్రసాద్.

"ఆవిడగారు దయచెయ్యలేదు!" పనులు తెమిలిఛావలేదు!" "మీరూ వెళ్ళి హోటల్‌లో భోంచెయ్యండి!" అంది ఇందిర విసురుగా.

"ఏమిటా పొగరు!" ఇంతసేపు ఏంచేస్తున్నావు?" పని మనుషులు కూడా మనుషులే!" వాళ్ళకి కూడా బాధలు వుంటాయి!" అన్నాడు ప్రసాదు. భార్యని కసురుతూ.

"అవున్లెండి!" ఇంట్లో భార్యకన్న ఆ పని మనిషే ఎక్కువ!" సినిమాలూ షికార్లూ చిత్తగించటానికి లేని బాధలు పని చెయ్యడానికి వచ్చాయా?" అయినా దాన్నని ఏం ఫలితం!" మీ దివాసా దానికి ఎక్కువయ్యింది" పక్కవాడు పాడి గేదంటే ఇంటి వాడు గొడ్డు గేదన్నాడంట" అలా వుంది మీ వరస. అయినా నా అదృష్టం!" అని సణుక్కుంటూ మురికిలో వున్న బాబిగాణ్ణి లేపి ఎత్తుకుంది.

ఇంతలో భర్త స్కూటర్ స్టార్ట్‌చేసిన శబ్దం వినిపించింది. ఇందిర మనస్సు చివుక్కుమంది.



ఏనాడూ భర్త తిండి తినకుండా ఆఫీసుకి వెళ్ళలేదు. కాని ఈ రోజు.... ఈ సితాలు మూలంగా.

క్రితంరోజు జరిగిన సంఘటన ఆమె మనస్సులో మెదిలి కోపం ఉవ్వెత్తున పొంగింది. హృదయం దహించుకుపోతోంది.

ఆఫీసు పని మీద భర్త ప్రసాద్ నాలుగు రోజులు కేంప్ కెళ్ళాడు. ఏమి తోచటంలేదు. ఎదురింటి రమణి సినిమా కెళ్దాం ఇందిరా వస్తావా?" అంది.

తనకి బోర్‌గా వుంది. సరేనంది.

సినిమా పెద్ద రష్‌గాలేదు. రెండవ తరగతి టికెట్ తీసుకున్నారు. తాను రమణి. మగవాళ్ళతో బయలుదేరితే ఎలాగూ ఖర్చుతప్పదు!" "తాము కూడా ఖర్చు చేస్తే ఎలా?"

సినిమా జరుగుతోంది.

ఇంటర్‌వెల్‌లో వెనుక తిరిగి చూసింది. ఒక్కసారి త్రుళ్ళి పడింది సితాలు దాని మొగుడు, రిక్షా రంగడు వాళ్ళ గుంటడు మంకుగాడు ఫస్టుక్లాసులో కూచుని వున్నారు.

తలకొట్టేసినట్లయ్యింది ఇందిరకి. మరి సినిమా చూడాలనిపించలేదు. పదేపదే సితాలు రూపం గుర్తు వస్తోంది. తెల్లపూవులున్న నీలిరంగు పాలిస్టర్ చీర, నీలిరంగు జాకెట్టు, తలలో చేమంతులు, నుదుట పెద్ద తిలకం బొట్టు "దీని సోకుమాడ! దీని ముచ్చట్లు మురిగిపోను, దీనికొవ్వు కరిగిపోను!" ఈ తిట్లన్నీ ఇందిర అంతరాంతరాలలో సయ్యాటలాడేయి.

ఒక్క ఉదుటున లేచి సినిమాహాలు నుంచి బైటికి వచ్చింది. ఇందిర. ఈ వింత ప్రవర్తనకి విస్తుపోయింది రమణి తనుకూడా ఇందిర ననుసరించక తప్పలేదు.

"మా అన్నయ్యగారు గుర్తుకొచ్చారా ఇందిరా?" హాస్యంగా అంది రమణి.

"అన్నయ్యగారుకాదు. పాడుకాదు!" తలనొప్పిగా వుంది!" పదవెళ్దాం!" అంటూ రిక్షాపిల్చింది ఇందిర.

రెండు రోజులు దొర్లాయి. సితాలు జాడలేదు. "దీనికేమయ్యింది?" నెలకి పాతిక రూపాయలు తీసుకుంటోంది!" కొంచెమైన విశ్వాసం, భయం భక్తిలేదు లేవు!" గిన్నెలు తోమితోమి తన చేతులు అరిగిపోతున్నాయి. బట్టలు ఉతికి ఉతికి జబ్బలు పులిసిపోతున్నాయి." ఇది ఎప్పుడు తగలపడుతుందో?"

"హవ్వ!" తాముకూడా హైక్లాసులో కూచోలేరు!" దీనికెంత తలబిరుసు కొంపతీసి ఆ రిక్షారంగడికి కాని ఏ లాటరీ అయినా దొరకలేదుకదా! లేకపోతే ఎవడి పర్సు అయినా దొంగిలించలేదుకదా!" కందిరీగల్లా బుర్ర దొలిచేస్తున్నాయి ఆలోచనలు.

"ఏమోయ్ నువ్వు కూడా ఏదైనా ఉద్యోగం చెయ్యరాదూ?" చన్నీళ్లకి వేన్నీళ్ళులా తోడువుంటుంది!" అన్నాడు ప్రసాద్ ఎన్నో సార్లు.

కాని తనకు ఇష్టంలేదు. తను ఉద్యోగం మీద వీధిలోకి వెళ్తే బాబిగాడు పాడైపోతాడు. "ఉన్న ఒక్కగానొక్క బిడ్డ ఏమైనా అయితే?"

సన్నని నీటితెర మెరిసింది ఇందిర కన్నులలో

బాబిగాడు పుట్టినప్పుడు తనకి చాలా ఇబ్బంది కలిగింది. అందుచేత ఆపరేషన్ చేసి బిడ్డని బైటికి తీశారు. మరలా బిడ్డపుడితే తల్లి ప్రాణానికి నష్టం అన్నారు డాక్టర్లు. మరిబిడ్డలు కలగకుండా ఆపరేషన్ చెయ్యమన్నారు ప్రసాద్.

"అమ్మో!" బాబిగాడిని వదిలి ఒక్కక్షణం కూడా తాను ఉండగలదా?

పోనీ సితాలుకి మరికొంచెం జీతం హెచ్చువేసి బాబిగాణ్ని చూడమనరాదో య్!"

"చాల్లేండి సంబడం!" అంది నిరసనగా.

భర్త జీతం వెయ్యిరూపాయలు. అదే సరిపోవడంలేదు తమకి. ఇంటి అద్దె, పాలు, కూరలు, మందులు అన్నీ అందులోనే సరిపోవాలి. ఈ సమయంలో తను ఉద్యోగం చెయ్యటం ఎంతైనా అవసరం! కాని "సితాల్లాంటిదాన్ని నమ్మి బిడ్డని ఎలా అప్పగిస్తుంది?"

నాలుగు రోజుల తరువాత వచ్చింది సితాలు. దాని మొహం దీనంగావుంది. నేత్రాలు అశ్రువులను స్రవిస్తున్నాయి.

"ఏమే ఇన్నాళ్ళూ ఎక్కడ చచ్చావు? కర్కశంగా ప్రశ్నించింది ఇందిర.

"గుంటడికి ఒంట్లో సుకం నేదండమ్మగోరూ!" మూసిన కన్ను తెరవటంలేదండి!" అంది అదురుతున్న పెదవులతో.

"సినిమాలు షికార్లు చిత్తగించిన నాడు లేదా నీగుంటడికి ఒంట్లో రోగం? ఛో ఛో ఈ గుమ్మంలో అడుగుపెట్టకు!" అంది ఇందిర విసురుగా.

మౌనంగా గిన్నెలు తోమి కడగసాగింది. ఇందిర అలా సాధిస్తూనే వుంది.

పనిపూర్తి చేసుకుని స్తంభం చాటుగా నిలుచుంది సితాలు.

ఏమే ఎందుకు నిలుచున్నావు? వెధవ నటనలూ నువ్వూను! ఛో ఛో! అంది ఈలుతో బాబిగాడికి స్వెట్టర్ అల్లుతున్న ఇందిర. ఇప్పటినించి అల్లుతేనేగాని చలికాలం నాటికి తయారుకాదు.

"అమ్మగారూ!" నెమ్మదిగా పిలిచింది సితాలు.

"ఏం ఎందుకు?" అన్నట్టు చూసింది ఇందిర.

"గుంటడికి ఒంట్లో బాగానేదు! ఓ యాభై రూపాయలుంటే ఇప్పించండమ్మగారూ!" అంది నసుగుతూ.

"ఏమిటి యాభై రూపాయలు కావాలా?" "మరో నాలుగు సినిమాలు కెళ్ళు!" మరో పది పాలిష్టరు చీరలు కొనుక్కో!" అప్పుడు గుంటడి జబ్బు తగ్గుతుంది!" నా యాభైరూపాయలతో నీకేమిటి పని?" నువ్వు మహా రాణివి!" అంది ఇందిర వెటకారంగా.

"ఇవాళ అమ్మగారెందుకో కోపంగా వున్నారు!" అనుకుని వెనుతిరిగింది సితాలు.

నాలుగు రోజుల క్రితం జరిగిన సంఘటన దానికి గుర్తొచ్చింది.

సింగపూర్ నుంచి రిక్షారంగడి తమ్ముడొచ్చాడు. వాడు అక్కడ ఏదో మంచి ఉద్యోగమే చేస్తున్నాడు.

"ఒలి ఒదినమ్మ ఈ కోకని సెల్లెమ్మ నీకిమ్మన్నాది!" అంటూ ఓ మంచి నీలిరంగు పాలిష్టరు చీర ఇచ్చాడు "ఈయాల మనందరం సినిమాకి ఎళ్దాం!" అని హైక్లాసు టిక్కెట్టుకి తీసుకెళ్లిండు!" ఐసులు కొనిచ్చిండు!" పాలకోవా కొన్నాడు! రెండ్రోజులు సరదాగా గడిచిపోయాయి.

ఆడు సింగపూరెల్లిపోనాడు.

ఆడున్నాళ్ళూ తను పన్లోకెళ్ళలేదు. రంగడు తెచ్చిన మాంసాలు వేపుడు వంట పెట్టింది మరిదికి.

తరువాత ఉన్నట్టుండి మంకుగాడికి వాంతులు, విరోచనాలు పట్టుకున్నాయి. రంగడు ఊళ్ళోలేడు, చేతిలో డబ్బుల్లేవు. ధరమాసపత్రి మీద తనకి నమ్మకంలేదు.


"భగవంతుడా ఇప్పుడెట్టా?"

విలవిలలాడిపోయింది సితాలు.

ఎవర్నడిగినా డబ్బులు పుట్టలేదు. ఉస్సురని నిట్టూర్చి మంకుగాడు మంచం దగ్గర కూలబడింది సితాలు.

సితాలు వెళ్ళిపోయిన తరువాత ఆలోచించింది ఇందిర "ఏమి నాగరు ఈ విధంగా కట్టించారు! డబ్బులు కావాలి వచ్చినప్పుడు తన గుర్తుకొచ్చింది దానికి! మింగడానికి మెతుకులు లేకపోయినా సోకులకి లోటులేదు.

సితాల్ని చూస్తూ వుంటే తనలో కోపం ఉవ్వెత్తున లేస్తోంది. "నిజానికి తన దగ్గర



పెద్ద మనసు

డబ్బులేకకాదు!" దాని పొగరు అణచడానికే లేదంది 'నాలుగు రోజుల క్రితం అన్నయ్యవచ్చి చీరకొనుక్కొమని రెండు వందలు ఇచ్చాడు అది తన పెట్లో భద్రంగా వున్నాయి.' కాని తను ఇవ్వలేదు

"ఏం పని మనుషులు మాత్రం మనుషులుకారా?" భర్త వేసిన ప్రశ్న అంతరాంతరాలలో ఘోషపెట్టింది

సితాలు లాంటి వాళ్ళకి కొర్కెలన్నీ తీరుస్తూ కూచుంటే, తరువాత వాళ్ళు నెత్తికి ఎక్కుతారు! అందుచేత ఎక్కడుంచవలసిన వాళ్ళని అక్కడే వుంచాలి!" గర్వరేఖ తళుక్కున మెరిసింది ఇందిర ముఖంలో.

మళ్ళా సితాలు పనిలోకి రావటంలేదు "డబ్బులివ్వలేదన్న కోపం కాబోలు ఈవిడ అలకలు తీర్చడానికి ఎవరు సిద్ధంగా వున్నారు?" అనుకుంది స్వగతంగా

"ఏం ఇందిరా పని మనిషి రావటంలేదా?" అంటూ ప్రశ్నించింది రమణి.

"దాని కొడుక్కి రోగం ముంచుకొచ్చిందట' డబ్బుల కోసం వచ్చింది! మళ్ళా ఫికర్‌లేదు' అయినా చిన్నపిల్లవాడికి అడ్డమైన గడ్డి మేపితే రోగాలు రొచ్చులు రాకుండా వుంటాయా?"

'ఆ రిక్షా రంగడు లేడూ? నాలుగు డబ్బులు సంపాదించినట్లున్నాడు' ఇది కులుకుతోంది సినిమాలూ షికార్లూ అంటూ' పని మనిషికి వుండాల్సిన లక్షణాలు వున్నాయా రమణీ దానికి??" సితాలు మీదున్న కోపం అంతా వెళ్ళగక్కింది

విస్తుపోయింది రమణి

ఇదివరకు ఎన్నోసార్లు ఇందిర అనటం తను వింది 'నిజంగా సితాలు వుండటం వేతే నేను హాయిగా వున్నాను రమణీ!" అన్ని పనులూ చక్కగా చేసుకుపోతోంది!' దొంగబుద్ధి అన్నది మచ్చుకి కూడాలేదు!" నీతి నిజాయితీ గలది' అని కాని ఇలా ఎందుకు ఇపుడు ప్రవర్తిస్తున్నది.?'

ఇందిర బి.ఎ పాసైంది నిజానికి ఏ ఉద్యోగమైనా రాకమానదు ఆ మధ్య ఒక కాన్వెంటు వాళ్ళు నాలుగువందల రూపాయలు ఇస్తాం ఉద్యోగంలో చేరమన్నారు' ఆ ఉద్యోగం సంగతి రమణి చెప్పింది

'ఇందిరాచక్కగా ఉద్యోగంలో చేరరాదూ?" నాకు ఎలాగూ చదువురాదు!" ఎదుటి వాళ్ళని చూసైనా సరదా పడదామని!'

కాని తను అందుకు అంగీకరిచలేదు 'తను ఉద్యోగానికి వెళ్తే బాబిగాణ్ని ఎవరు చూస్తారు?"

"వచ్చిన ఉద్యోగాన్ని చేజేతులా వదులుకున్నావు' అసలు ఈ కాలంలో ఉద్యోగాలు దొరుకుతున్నాయా?' అంటూ కోపగించుకున్నాడు ప్రసాద్

రోజులు దొర్లుతున్నాయి సితాలు రాలేదు 'సితాలు పని మానేసిందా?" గతుక్కుమంది ఇందిర

సితాలు పని మానేస్తే తను ఇంటిపని అంతా చేసుకోగలదా?" పైగా 'అంత నమ్మకమైన పనిమనిషి. మళ్ళా దొరుకుతుందా?" ఆలోచనల మీద ఆలోచనలు సాగిపోతున్నాయి ఇందిరలో.

ఈ సారి అది వస్తే మెత్తపడకూడదు!" జీతం తగ్గిస్తానని బెదిరించాలి!" అది లేకపోతే తనకి జరగదనుకుంటుంది!" మరో వక్రభావం అంతలోనే చోటు చేసుకుంది ఆమెలో.

ఆ సాయంత్రం కనుచీకటి పడుతూ వుంటే వచ్చింది సితాలు

బాబిగాణ్ణి ఎత్తుకుని వీధిలో నిలబడిన ఇందిర గయ్యిమని లేచింది. 'ఏమే ఇన్నాళ్ళకి ఈ ఇల్లు కనిపించిందా?' ఇలా చేస్తే మేం ఇచ్చిన డబ్బులు నీకు అరుగుతున్నాయా?" అని.

సితాలు మౌనంగా నిలుచుంది. దాని ముఖంలో దైన్యం గూడుకట్టుకుని వుంది చూపులు శూన్యంలోకి గుచ్చుకు పోతున్నాయి పెదవులు పొడారి ఎండ బీటలు వారివున్నాయి. ఎన్నాళ్ళబట్టో తిండిలేని దానిలా నీరసించి వుంది

ఏమే ఇన్నాళ్ళూ ఏం రాచకార్యం వెలగబెడుతున్నావ్? అంది సితాల్ని నిరసనగా చూస్తూ.

బిడ్డపోనాడు అమ్మగోరూ!' చేతుల్లో ముఖం దాచుకుంది సితాలు.

మంకుగాడు పోయాడా?' నమ్మలేనట్లు ప్రశ్నించింది ఇందిర.

"అవునండమ్మగోరూ!" మా మావ ఊళ్ళోలేడు!" ఆడి సెల్లెలికి ఒంట్లో సుకం నేదంటె సూడ్డానికెళ్ళిండు!" 'ఇంతలో ఈడికి రోగం ముంచేసినాది. మా యీదిలో వున్న డాకిటేరు యాభై రూపాయలు ఇస్తేగాని సూది మందెయ్యనన్నాడు!' వోర్నడిగినా డబ్బుల్లేవన్నారు' గుంటడిని ఓ రోజుకల్లా తీసుకుని పోయినాడు' నానేటి సేతునండమ్మగోరూ!" వెక్కి వెక్కి ఏడిచింది సితాలు.

ఇందిర హృదయం ద్రవించింది."ఎంత పని జరిగింది? తను ఆ రోజు యాభై రూపాయలు ఇచ్చివుంటే? .. అంతలోనే సర్ది చెప్పుకుంది. తనేం ఆయుర్దాయానికి కర్తా? యాభై రపాయలు ఇస్తే మాత్రం వాడు బ్రతుకుతాడన్న గ్యారంటీ ఏమిటి?"

రోజులు దొర్లిపోతున్నాయి.

సితాలు పని చేసుకుపోతోంది. మునపట్లా సరదాగా గడపలేక పోతోంది. ప్రతీ క్షణం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

సితాలుకి కూడా మరి పిల్లలు కలగరు. "దానిది తనలాంటి కేసే!"

బాబిగాడి పనులు సితాలు చేయడం ఇందిరకి సుతారం ఇష్టంలేదు.

బిడ్డను పోగొట్టుకున్న తల్లి, తన బిడ్డని చూసి ఓర్వలేదు!" అందుచేత సాధ్యమైనంత వరకు బాబిగాణ్ణి దాని దగ్గరికి వెళ్ళకుండా కాపాడుతోంది

'ఒసే సితాలు వాడి పనులు నేను చూస్తాను! కాని నువ్వు మిగిలినపనులు చూసుకో!" అంటూ వాణ్ణి ఎత్తుకుని లోపలికి తీసుకుపోతుంది.

విచిత్రంగా చూస్తుంది సితాలు.

'ఏమే ఎక్కడ తగలడ్డావు? బాబిగాడికి స్నానం చెయించవా? అని కేకలేసె అమ్మగోరు ఎందుకిలా మారిపోయారు?'

అదే అంది రంగడితో. మావా బిడ్డ పోనాడు! పోని ఏ బిడ్డలనన్నా చూసి అణ్ణి మర్సిపోదామంటే, ఆ ఇందిరమ్మగారు తన బిడ్డ నసలు ముట్టుకోనివ్వడమే లేదు!" అంది వాడి వళ్ళో తల పెట్టుకు విలపిస్తూ.

"నెగే సితాలూ! బగమంతుడు మనకి అన్నాయం సేసెడే! అంటూ సితాల్ని ఓదార్చెడు రంగడు.

సితాలు నిర్లిప్తంగా పనులు చేసుకుపోతోంది. "జీవితం దానికి నేర్పిన పాఠం చాలా గొప్పది!"


బాబిగాణ్ణి చూస్తూవుంటే దాని తల్లి మనస్సు ఆ బాబుని ఓసారి ఎత్తుకోవాలని ఉవ్విళ్ళూరుతూ వుంటుంది కాని .. తను ఆ పని చెయ్యలేకపోతోంది.

అమ్మగారు తనని కాల్చేలా చూస్తుంది.

ఆ రోజు బాబు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. అమ్మగారు ఎక్కడా కనుపించలేదు.

సితాలు గిన్నె తోముతున్నదల్లా వచ్చి బాబుని తీసి ఎత్తుకుంది. పది నెలల బాబు ముద్దుగా బొద్దుగా వున్నాడు.

సితాలు పాలు చేపుకి వచ్చాయి. బిడ్డని పోగొట్టుకున్న తల్లి ... మనస్సు విల విలలాడింది.





కోటయ్య అనుభవం-
ప్రకటనే విందాం
కోటయ్యా సూరయ్యా ఇరుగు పొరుగు ఊళ్ళ రైతులు. ఎన్నాళ్లనుంచో మిత్రులు. ఒకసారి అనుకోకుండా కలిశారు...
అరె, కోటయ్యా నువ్వా!
ఏరోయ్ సూరి, ఎలాగున్నావ్!
బాగానే ఉన్నాలే. నీ ఎడ్ల గురించి రామన్న చెప్పాడు. చాలా బాధైందనుకో!
ఏంజేస్తాం... దేవుడలా పెట్టాడు.
కోటయ్య ఎడ్లు మేస్తుంటాయి... ఉన్నట్టుండి చెవులు దద్దరిల్లే శబ్దం... రాళ్లూ మట్టీ దొర్లివస్తాయి. గాభరా పడ్డ కోటయ్య ఎడ్లను కాపాడుకునే ప్రయత్నంలో...
భగవంతుడా.. నా ఎడ్లను కాపాడు తండ్రీ!
ఎంత ఘోరం! ఇపుడెట్టా గడుపుతున్నావ్ మరి?
అదృష్టం కొద్దీ న్యూ ఇండియా వాళ్లతో పశువుల భీమా చేయించుంచా. లేకుంటే మునిగిపోయుండేవాణ్ణి
... కిందటి సంతలో రెండు కొత్తెడ్లు కూడా కొన్నా!
అబ్బో! అంత డబ్బు కూడబెట్టావా!
డబ్బెక్కడ కూడబెట్టాను! పశువుల భీమా చేయించానని చెప్పాగా!
పశువుల భీమా, పశువుల భీమా అంటున్నావు. అదేమిటీ!
పశువుల భీమా అంటే... ప్రమాదంలోనో రోగంతోనో నీ పశువులు చచ్చిపోయాయంటే న్యూ ఇండియా వాళ్లు నీ నష్టానికి డబ్బు కట్టిస్తారు.
ఉట్టినే డబ్బిచ్చేస్తారా?
ఊహూం ఏడాదికింత అని మనం కాస్త డబ్బు కట్టాలి. మన పశువు 100 రూపాయల్లనుకో, మహా అంటే 4 రూపాయలు చాలు!
అలాగా! ఈ సంగతి నాకు తెలీదే!
ఇప్పుడు తెల్సింది కదా! నష్టాలు వచ్చినప్పుడు భీమాయే మనకు ఆధారం!
SAA/NIA/2802/TL

పాలతో పాటే తడిసిపోయింది

భగవంతుడా! సీతాలు కన్నుల నుండి నీళ్ళు జలజలరాలాయి బాబు ఏడుపు మానలేదు

వాణ్ని ఒళ్ళో వేసుకుంది హాయిగా పాలు తాగుతున్నాడు బాబిగాడు

ఇంతలో ఎక్కడ నుంచి వచ్చిందో ఇందిర సీతాలూ! అంటూ ఆడ పులిలా గర్జించింది

చటుక్కున బాబిగాడిని వదిలేసింది సీతాలు

ఓసి ముండనష్టపుదానా! వాణ్ని ఎవరు ముట్టుకోమన్నారు నిన్ను! బిడ్డను పోగొట్టుకున్న దానివి! నా బిడ్డను తాకితే నీ శని అంటుకుంటుంది! ఇటు పైన నా బిడ్డని ముట్టుకుంటే ఊరుకోనేది లేదు! తెలుసా? అంటూ బాబిగాడినిదాని దగ్గర నుంచి లాక్కుని లోపలికి పోయింది

సీతాలు మనస్సు చివుక్కుమంది

మరోసారి రంగడిని చుట్టుకుని బావురుమని ఏడ్చింది

ఎందుకే సీతాలూ! ఏ అనాధ బిడ్డనైనా తెచ్చుకొని పెంచుకుందాం! అంటూ ఓదార్చేవాడు

రోజులుదొర్లిపోతున్నాయి బాబిగాడిని సీతాలు దగ్గరగా వెళ్ళకుండా కాపాడుతోంది ఇందిర

ఇదిగో రమణా తన బిడ్డని పోగొట్టుకున్న సీతాలు నా బిడ్డని చూసి ఓర్వలేక పోతోంది! అందుకే దాని చాయలకు కూడా వెళ్ళనివ్వడం లేదు బాబిగాణ్ని! అంటోంది ఇందిర ఓ రోజు

ఈ మాటలన్నీ విన్నాడు ప్రసాద్ తరువాత భార్యతో అన్నాడు

చూడు ఇందిరా! సీతాలు బిడ్డని పోగొట్టుకున్న దుఃఖంతో కృంగి కృశించిపోతోంది! అసలే కుమిలి-పోతున్న ఆమెని ఇంకా నువ్వు బాధించడం అంత మంచిదికాదు! బాబిగాడి పన్లన్నీ సీతాన్నే చూడమను! ఈ విధంగానైనా ఆమె మనస్సుకి కాస్త ఊరట కల్గుతుంది సాటి ఆడదానిగా ఎదుటి వ్యక్తి పట్ల సానుభూతి చూపించడమే నీ కర్తవ్యం లేకపోతే నీ చదువుకు ఏ మాత్రం సార్థక్యం వుండదు! అని

ఈ మాటలన్నీ పెడ చెవినపెట్టింది ఇందిర

పెద్ద మనసు

బాబిగాడు బాగా అల్లరి నేర్చాడు వాడి చేష్టలన్నీ చూసి మురిసిపోతున్నారు ఇందిరా ప్రసాద్‌లు

దూరం నుంచే చూసి ఆనందభాష్పాలు రాలు-స్తోంది సీతాలు - తన మంకుగాడు బ్రతికుంటే ఇట్టాగే వుండేవాడు తనకి అదృష్టం న్లేదు!

ప్రసాద్ మద్రాసు వెళ్ళాడు ఆఫీసు పని మీద పది రోజుల వరకు తిరిగిరాడు ఇందిరకి ఏమీ తోచడం లేదు

పగలల్లా పుస్తకాలతో కాలక్షేపం బాబిగాడితో ఆడుకోవటం అప్పుడప్పుడు సినిమాలు చూడటం ఇలా సాగిపోతోంది దినచర్య

రమణి పుట్టింటికెళ్ళింది ఇప్పుడు మరి బోర్‌గా వుంది ఇదివరకటిలా సీతాలుతో లోకాభిరామా-యణం మాట్లాడాలనిపించలేదు దాన్ని చూస్తేనే అసహ్యంలాంటిది కలుగుతోంది

దాని పని అది చేసుకుపోతోంది సీతాలు ఉదాసీనంగా వుండిపోతోంది ఇందిర

ఆ రోజు రాత్రి ఉన్నట్టుండి బాబిగాడు విరుచుకుపడసాగాడు పాలు తాగడంలేదు వెర్రి చూపులు చూస్తున్నాడు

ఇందిర బెదిరిపోయింది బాబిగాడికి ఏమయ్యింది? భర్త కూడా దగ్గరలేడు భగవాన్! కన్నీరు తెరలు తెరలుగా వ్యాపించింది

ఇంటి వారబ్బాయితో ఆ వీధిలోనే వున్న డాక్టర్‌కి కబురు చేసింది డాక్టరు వచ్చి టెస్ట్ చేశారు

ఇరవై నాలుగు గంటలు దాటితే కాని ఏ సంగతి చెప్పలేనన్నాడు ఖరీదైన ఇంజక్షన్‌లుఇవ్వాలన్నాడు

సుమారు వెయ్యి రూపాయలు ఖర్చు అవుతుందన్నాడు

ఇందిర గుండె జారిపోయింది

తెల్లారేలోపు వెయ్యి రూపాయలు ఎక్కడనుంచి వస్తాయి ఈ సమయంలో రమణి కూడా లేదు! భర్త తన చేతి ఖర్చులకి ఇచ్చిన వంద రూపాయలు మాత్రం ఉన్నాయి అవి కూడా రాత్రి సమయంలో ఇంటికి వచ్చినందుకు డాక్టరు ఫీజు క్రింద సరిపోయాయి భగవాన్ ఇప్పుడెలా?

ఇప్పుడు ఒక ఇంజక్షన్ ఇస్తాను! తరువాత మళ్ళీ వస్తాను అవసరమైతే ఆసుపత్రిలో జాయిన్ చెయ్యాలి!" అంటూ డాక్టరు వెళ్ళిపోయాడు

బాబిగాడు మెలికలు తిరిగిపోతున్నాడు వాడి బాధ ఏమిటో తనకర్థంకాచ్చు

బాధాతప్త హృదయంతో వేగిపోయింది ఇందిర

ఇంటివారిని అడిగి చూసింది వెయ్యి రూపా యలు "కాలేజ్ ఫీజులు అవీ కట్టాం!" మా దగ్గర లేవన్నారు వాళ్ళు

హృదయం బరువెక్కింది ఇందిరకి

ఈ సమయంలో బాబిగాడు కాని ఏమైనా అయితే

తెల్లారగట్ట నాలుగు గంటలకి వచ్చింది సీతాలు

బాబుకేటయిందమ్మగోరూ?' ఆతృతగా అడిగింది ఇందిర దగ్గరగా వెళ్ళి

'ముదనష్టపుదానా నీ ఉసురే కొట్టింది నా బిడ్డకి ముందు బైటికి పో!' అంటూ గట్టిగా కసిరింది ఇందిర

నీలి తెరలు జారాయి సీతాలు ముఖంలో 'బాబు సుకంగుండాల!' వెయ్యి దేవుళ్ళకి మనస్సులోనే మొక్కింది

ఎన్ని తిట్టినా, అసహ్యించుకున్నా బాబు మంచం దగ్గరే నుంచుంది సీతాలు

ఇందిర కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది తరువాత ఇంటివారి ద్వారా అసలు సంగతి తెలుసుకుంది సీతాలు

వెంటనే తన గుడిసెకి పరుగెత్తింది


మావా! ఇందిరమ్మగోరి బిడ్డకి సుకంనేదు!" అంటూ రంగడి చెవిలో ఏదో చెప్పింది

వెంటనే రంగడు అంగీకరించాడు ఎంత వేగం పరుగెత్తిందో, అంత వేగంగానే తిరిగివచ్చింది

'అమ్మగోరండి పదండి! బాబుని ఆసుపత్రికి తీసుకుపోదాం!' అంది ఇందిరను సమీపిస్తూ

'ఇప్పుడు వెయ్యి రూపాయలెలా వస్తాయే? నా బాబు నాకు ఇక దక్కడు!' అంటూ చేతులలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్వసాగింది ఇందిర

సీతాలు గుండె కరిగిపోయింది అమ్మగోరూ ఇదిగోనండి డబ్బులు!" కొంగుని కట్టి తెచ్చిన డబ్బులు ఇందిర చేతిలో పెట్టింది





ఇ·వేమన·పద్యాలు



స్త్రీలును పురుషులు తమలో
నాలని మగడని నమ్మి యనుభవ వశులై
చాలగ భ్రమియింతురు
వీలుగ తమ పుట్టు చావు వెదుకరు వేమా

ఇందిర కళ్ళు వెలిగాయి. పది వందల రూపాయల నోట్లు అవి.

"ఇంత డబ్బు సితాలుకి ఎక్కడిది? కొంపదీసి ఏ దొంగతనమైనా చెయ్యలేదు కదా! ఈ డబ్బు ఎక్కడ నుంచి ఎత్తుకొచ్చావే జష్టా? మా ఇంటి చుట్టూ పోలీసులు చేరితే అడగక్కరలేదు భాగోతం?" అంది కోపం పడగవిప్పి బుస కొడుతుండగా.

"అమ్మగారూ నా నట్టాంటి దాన్ని కానండి! మా మావ సొంత రిక్షా కొనుక్కుందుకు బేంకి నుంచి అప్పు తెచ్చినాడండి!" అంది సితాలు.

ఇందిర అవాక్కైంది.

బాబిగాడిని తీసి ఎత్తుకుంది సితాలు. ఇందిర ఇప్పుడు దాన్ని వారించలేదు.

ఇద్దరూ ఆసుపత్రికి చేరుకున్నారు.

ఇంజక్షన్‌లు మందులు అన్నీ పడిన తరువాత బాబు మనుష్యులలో పడ్డాడు.

మర్నాటి సాయంత్రానికి బాబిగాడి జబ్బు తగ్గుముఖం పట్టింది.

హమ్మయ్య అనుకుంది ఇందిర.

సితాలు ముఖంలో కోటి దీపాలు వెలిగాయి. "బాబుకి ఇంకేం ఫరవాలేదు!" అనుకుంది.

నాలుగు రోజుల తరువాత కేంప్ నుంచి వచ్చాడు ప్రసాద్.

సంగతంతా వివరించింది ఇందిర భర్త ప్రసాద్‌కి.

"ఇందూ ఇప్పటికైనా గ్రహించావా సితాలు గొప్పదనాన్ని?"

"ఒకనాడు యాభై రూపాయలివ్వడానికి నిరాకరించావు దానికి. కాని ఇప్పుడు ఏం జరిగింది?" భర్త తనని సూటిగా ప్రశ్నిస్తూ వుంటే కుంచించుకు పోయింది ఇందిర.

"నిజమే!" తను ఒకనాడు సితాలు ఆపదలో ఆదుకోలేక పోయింది. కాని ఇప్పుడు సితాలు తన బిడ్డని బితికించింది.ఎవరిది పెద్ద మనసు?"

పశ్చాత్తాపంతో ఇందిర హృదయం దహించుకు పోసాగింది.

బాబిగాడు మళ్లా ఆడుకుంటున్నాడు.

ఆ రోజు ప్రసాద్‌ఇంట్లోనే వున్నాడు. ఒంట్లో నలతగా వుండి సెలవు పెట్టాడు.

బాబిగాడిని భర్తకి అప్పగించి ఎక్కడికో వెళ్ళింది ఇందిర.

"ఎక్కడికి వెళ్ళింది చెప్మా?" అనుకున్నాడు ప్రసాద్ ఏదో పుస్తకం తిరగేస్తూ.

ఇంతలో ఇందిర హడావుడిగా వచ్చింది. "ఏమండి ఓ గుడ్ న్యూస్!" అంది ఉత్సాహంగా.

ప్రశ్నార్థకంగా చూశాడు ప్రసాద్.

"నాకు కాన్వెంట్‌లో టీచర్ జాబ్ దొరికింది. ఈ మధ్యనే అప్లికేషన్ పెట్టాను. ప్రిన్సిపాల్ నన్ను రమ్మని కబురు చేసింది. రేపు జాయిన్ అవుతున్నాను!" అంది.

ఆనందంతో ప్రసాద్ కళ్ళు చెమర్చాయి. "నువ్వు ఉద్యోగానికి వెళ్తే బాబిగాణ్ని ఎవరు చూస్తారు?"

"సితాలు!"

"వాట్?"

"అవునండి సితాలుది దెబ్బతిన్న హృదయం. అందుచేత బాబిగాడిని కంటికి రెప్పలా చూస్తుంది! ఆ నమ్మకం నాకుందండి! నాదీ తల్లి మనసేనండీ!"

ఇందిర నేత్రాలు అశ్రువులను స్రవించాయి.

ఇంతలో సితాలు అటు వైపుగా వచ్చింది.

"సితాలూ ఇలారా!" పిలిచింది ఇందిర. సితాలు నెమ్మదిగా వచ్చి నిలుచుంది.

"సితాలు నాకు ఉద్యోగం వచ్చింది. బాబిగాడిని నువ్వే చూడాలి! ఈ నెలనించి నీకు మరో పాతిక రూపాయలు జీతం పెంచుతున్నాను!" అంది ఇందిర.

"అమ్మగోరూ!" ఆశ్చర్యపూరిత మనస్కురాలై అలా చూస్తూ వుండిపోయింది సితాలు.

"అవును సితాలూ నీది చాలా పెద్ద మనసు! ఒకనాడు నీ బిడ్డకి జబ్బు చేస్తే ఆదుకోలేక పోయాను. కాని ఈనాడు నా బిడ్డని నువ్వు బ్రతికించావు! ఔన్నత్యం నీది సితాలూ! నీది!"

"ఇదిగో బాబిగాడు! వీడిలోనే నీ బిడ్డని చూసుకో!" అంటూ బాబిగాడిని సితాలుకి అందించింది యిందిర.

"అమ్మగోరిది దొడ్డ మనసు!" అనుకుంది సితాలు బాబిగాడిని ఎత్తుకుంటూ.


దాని కన్నుల నుండి వెచ్చని నీటి బిందువులు జారి బాబిగాడి ఒంటిని తడిపాయి. □

బ్రోకరు తీర్పు!

మార్తాండం అనే వూరులో వున్న ఒకే ఒక పోలీసుస్టేషనుకు నెలకు కనీసం ఒక్క కేసయినా నమోదు అవదుట. దానికి కారణం ఆ వూరు జనులు చాలా అహింసా స్వభావు లవడం కాదట. దాసు అనే అతను అక్కడ రోజూ దర్బారు తీరుస్తాడట. పోట్లాటలు, కొట్లాటలు, దొంగతనాలు, లంజతనాలు అన్నీ అతని ముందు హాజరు పరచాలట. అతని తీర్పే తీర్పట. అతను విధించిన అపరాధం కట్టి తీరాలట. ఆ వసూళ్ళు అనక పోలీసు స్టేషనులో మనిషి కింతగా వాటాలు వేసుకుంటారట- కష్టపడిన దాసుకు కొంచెం ఎక్కువట- ఆ పోలీస్టేషను బ్రోకరుగా దాసు ధర్మరాజులా వెలిగి పోతున్నాట్ట- కాదు మరి!

చీరకట్టు పడుతుల పమిట సర్దుడ్లు!

హిందూదేశపు ఆడవారు- చీర కట్టుకునే ఆడవారు రోజులో ఎక్కువగా చేసే పని పమిట సర్దుకోడమేనని, ఈ పని బజారులో తిరిగేటపుడు, ఆఫీసులలో పని చేసే టపుడూ మరింత ఉధృతంగా చేస్తారని వో మేధావి చెప్తూ మామూలు సమయాల్లో గంటకు కనీసం ఆరుసార్లు సర్దుకుంటే బజారులు వెళ్ళినపుడూ ఆఫీసులలో వున్నపుడూ గంటకు 15 నుంచి 25 సార్లవరకూ సర్దుకోడం జరుగుతుందని ఆయ నన్నారట. తమ కేసి వో మగవాడు చూస్తున్నాడని అనిపించినపుడల్లా చీర కట్టుకున్న ఆడవారు తమ స్తనముల మీది పమిటను వోసారి



సరిచేసుకుంటారని, యిది కేవలం మానశికంగా "ఆ వూహ" వలననే అనీ ఆయన తన సర్వేలో పేర్కొన్నారట- గంటకు 15 సార్లు సరాసరి చేస్తే- నిద్ర గంటలు తీసేస్తే రోజుకు 16 గంటలలో నూ.... లెక్కవెయ్!

పసిపిల్లల చేత రహస్య రవాణా!

జపానులో మత్తు పదార్థాల రహస్య రవాణా అన్యం పుణ్యం ఎరుగని చిన్న పిల్లల చేతా, స్కూలు పిల్లల చేతా చేయిస్తున్నారట. పోలీసులకు అనుమానాలు రాకుండా మత్తు పదార్థాల ప్యాకట్లులు కుర్రాళ్ళ కిచ్చి అసలైన చోటుకు బట్వాడా చేయించు తున్నారట నల్ల బజారు చక్రవర్తులు. ఈ బట్వాడాలలో చక్రవర్తులతో చేయి కలిపే ప్రభుత్వ అధికారులూ వున్నారట. కొంత మంది అధికారుల ఈ రకం నేరాలు బుజువై వుద్యోగాలు కూడా పోగొట్టుకున్నారట- వ్వాట్ ఇఫ్! ఐతేనేం!

రైలు పట్టాలపై శవం!

మేల్‌మరువత్తూరుకు చెందిన బంగారు అనే అతని భార్య లక్ష్మి ఆ వూరు నుంచి 3 మైళ్ళ దూరంలో వున్న వో గ్రామంలోని ప్రభుత్వ స్కూల్లో టీచరుట. ఆ వూరుకు బస్సూ వగైరా సౌకర్యాలు లేకపోవడం వల్ల బంగారు ఆలోచించి మణి అనే వో 20 ఏళ్ళ కుర్రాడికి వో సైకిలు కొనిచ్చి, అతను తన భార్యను రోజూ స్కూలుకు తీసుకు వెళ్ళడం, యింటికి తీసుకు రావడం కోసం అతనికి నెల జీతమూ యిచ్చి నియమించాడట. కొన్నాళ్ళకు వూరంతా లక్ష్మిమణుల ప్రేమాయణం.... సైకిలు షికారులు అని చెవులు కొరుక్కున్నారట. ఇంకొన్నాళ్ళు పోయేసరికి ఆ మణి రైలు పట్టాల మీద శవమై పడున్నాడట. అతని తల క్రింది పొదలలో దొరికిందట. ఇది ఆత్మహత్యగా పోలీసులు నమోదు చేసి, కేసు మూసేశారట - వార్నీ!

వ్యాపారంలో నష్టం- భర్త మరణం!

రాయల్ చెరువు అనే వూరుకు చెందిన దండపాణి అనే 35 ఏళ్ళ అతను, అతని భార్య 29 ఏళ్ళ వసంతా మద్రాసు కెళ్ళి వో హోటల్లో ఆత్మహత్య చేసుకోడానికి బ్రాందిలో నిద్రమాత్రలు వేసుకుని త్రాగారట. ఫలితంగా దండపాణి మాత్రం చనిపోయాడట. చేసిన ప్రతి వ్యాపారంలో నూ నష్టం ఏర్పడ్డం వల్ల ఆత్మహత్యకు పూనుకున్నట్టు అతను వుత్తరం రాసి పెట్టాడట.

ఏకాక్షర నగరాలు!

జపానులోని ఓ నగరానికి "ఓ" అని పేరట. స్వీడనులో "ఏ" అనే పేర వో నగరం వున్నదట. ఫ్రాన్సులో "వై" అనే పేరున వో పట్టణం వుందట. ఒక్కొక్క అక్షరంతో వో నగరం పేరు వుండడం అతిశయం..... రెండక్షరాల పేర్లు మన రాష్ట్రంలో బోల్డున్నాయి కద వో చదువరి!

చర్మ వ్యాధులకు వేపాకు రసం!

చర్మం మీద మచ్చలు, చర్మ వ్యాధులూ వున్నవారు వేపాకురసాన్ని కొంచెం తేనెలో కలిపి రోజూ పొద్దున్నే సేవిస్తే సమస్తమైన చర్మ వ్యాధులూ మటుమాయ మవుతాయట. నియమం తప్పక ముప్ఫయి రోజులు ప్రొద్దుటే యీ రసం త్రాగాలట. తేనె అధికంగా అందులో కలుపు కోరాదట.

విదేశీ యువతుల వెర్రిపోకడలు!


స్త్రీలు చనుమొనలకు రాగి రింగులు వంటివి చెవులు కుట్టించుకున్నట్టు కుట్టించుకోడం విదేశాలలో ఫ్యాషనై పోయిందట. కాలేజి వయస్సు ఆడపిల్లలు వెర్రెత్తి పోతున్నారట కుట్టించుకోడానికి.


జర్మనీ ప్రజల మూఢనమ్మకం!

16వ శతాబ్దంలో జర్మనీలో వో మూఢ నమ్మకం వుండేదట. గాలివానా వువ్వెత్తున వస్తే ఆ గాలితో దయ్యాలూ, భూతాలూ యిళ్ళలోకి ప్రవేశిస్తాయని వారు నమ్మేవారట. అందుకోసం ఆడామగా (పెద్దవారు) అటువంటి సమయాలలో బట్టలు విప్పుకుని తమ పిరుదులు కిటికిలోంచి గానీ, ద్వారం



లోంచిగానీ బయటకు గాలికి పెట్టుకు నిలబడ వారట. అలా చేస్తే పిరుదులు చూసి ఏ పిశాచి లోపలకు రాదని వారికి నమ్మకమట- గాలీ వాన రాత్రి వో ట్రిప్పు వేస్తే- హవ్ వుయ్ విష్- - నాలు గొంద లేళ్ళ క్రితం? ఫ్!


Sarathi
ప్రజలలో మీకు "సింపతీ" కలగాలని మీకు "ఎయిడ్స్" వుందని మేమే ప్రచారం చేసేశాం సార్!!
PA
ప్రతిపక్ష నాయకుడు
ఎగుమతులు తక్కువ... దిగుమతులు.. ఎక్కువ అంటున్నారుగా.. మీరు!! అందుకని.. ఎయిడ్స్‌ని కూడ దిగుమతి చేసుకుంటున్నాం
సురేషంటే పడి ఛస్తే అమ్మాయిలందరికీ వాడికి ఎయిడ్స్ ఉందని టాంటాం చేశా.. ఇప్పుడు చూడు వాడెలా కుమిలి కుమిలి..
ఎయిడ్స్ వస్తుందేమోనని చెప్పి ఇంజెక్షన్ ఇచ్చినప్పుడల్లా "సిరెంజ్" మార్చమంటే ఎట్లాగండి?!
ఆరోగ్యశాఖ అధికారి
HELTH OFFI
ప్రతి సినిమాలో హీరోకి కాన్సర్ వచ్చి చచ్చే కాలం ఎప్పుడో పోయింది... కదా!! ఇప్పుడు ఎయిడ్స్ వచ్చి ఛస్తా అన్నమాట..!!
సినీనిర్మాత
సారథి..
అన్ని పరీక్షలు జరిపి నాకు ఎయిడ్స్ లేదని చెప్తేగాని నన్ను ప్రేమించవా...?! ఛ.. నువ్వేంత అందగత్తెవా.. ఏంటి?!
Sarathi



సీరియల్

జీవితం చేజారిందా?

కాకాని కమల

(గత సంచిక తరువాయి)

కాని ఆ రెండు రోజులు సీత మాత్రం చాకిరితో నడుం ఎత్తలేకపోయింది.

కాఫీలు, టిఫిన్లు, భోజనాలు ... వీటిల్తోటే కాలమంతా గడిచిపోయింది.

ఆ రెండు రోజులు 'నాని' సంగతి చూసుకుందుకు కూడా కుదరలేదు.

రోజంతా సుబ్బులే వాడి ఆలనా పాలనా చూసింది.

ఆ మర్నాడు వాళ్లంతా తిరుగు ప్రయాణం అయ్యారు.

ప్రభాకర్ అత్తకి, మామకి, మరదలికి ఘనంగా బట్టలు పెట్టి సత్కరించాడు.

రత్నమణి పిల్లలిద్దర్ని తనతో పంపమని అడిగింది.

కాని ప్రభాకర్ ఒప్పుకోలేదు.

"ఎందుకూ నేను తీసుకొని వస్తాగా?" అని వాళ్లకి సర్ది చెప్పాడు.

వెళ్లే ముందు కనీసం మర్యాద కోసం అయినా సీతని పెళ్లికి రమ్మని చెప్పలేదు వాళ్లు.

"వెళ్లొస్తాం" అని కూడా చెప్పలేదు.

"వాళ్లు రమ్మన్నంత మాత్రాన నేను వెడతానా? ఎంత డబ్బు వుంటే మాత్రం? కనీసం మాట మర్యాదకేం?" అనుకుంది కాస్త బాధగా.

"నాని"ని ఒళ్లో పెట్టుకుని ఆవిడ ... రత్నమణి చచ్చిపోయిన తన కూతుర్ని తల్చుకొని వూరికే అదే పనిగా ఏడుస్తుంటే సీతకి ఎంతో అశుభం అనిపించింది.

మనసంతా కలత బారినట్లు అయ్యింది. వాళ్ల కారు కదిలాక తేలిగ్గా వూపిరి తీసుకుంది. వాళ్లతో పాటు ప్రభాకర్ పిల్లలు కూడా వెనకాలే కారులో వెళ్లారు.

వాళ్లంతా వెళ్లాక జోరున పెద్ద వాన కురిసి వెలిసినట్లు అనిపించింది.

గబగబా పెరట్లోకి పరిగెత్తి సుబ్బులు చేతుల్లోంచి కొడుకుని ఎత్తుకొని హృదయానికి హత్తుకుంది.

ఇంత వుప్పు - మిరపకాయలు తీసి నిప్పుల్లో పోసింది.

[illegible] వీడ్ని చూసి ఏడవటమే" అనుకుంటూ ప్రేమగా కొడుకుని పొత్తిళ్లల్లోకి తీసుకొంది.

* * * * * * *

రాత్రి ...

సమయం పదకొండు గంటలు కావస్తూంది. నిండు పౌర్ణమి కావటంతో నింగిలో చందమామ పదహారు కళలతో వెలిగి పోతున్నాడు. రాసులు పోసినట్లు చుక్కలు తళ తళలాడుతున్నాయ్.

వెన్నెల పిండి ఆరబోసినట్లుంది. కిటికీలోంచి కనిపించే ఆ వెన్నెల్ని, నింగిలో చుక్కలతో సరాగమాడుతున్న చంద్రుడ్ని చూస్తూ తన గదిలో విశాలమైన బెడ్ మీద ఒంటరిగా పడుకున్నాడు ప్రభాకర్.

కిటికీలోంచి జారిన వెన్నెల గదిలో సగం మేర పరచుకుంది.

గది చుట్టు అల్లుకున్న నైట్‌క్వీన్ పరిమళం మత్తుగా గాలిలో కలిసి అలలు అలలుగా తేలి వస్తూంది.

అర్ధరాత్రి కావస్తున్న ప్రభాకర్‌కి నిద్రపట్టటం లేదు.

ఒంటరితనం అతడ్ని వెక్కిరిస్తూంది.

ప్రక్క గదిలోంచి "నాని" ఏడుపు సన్నగా వినిపిస్తూంది. లేతగొంతుతో "కేరు ... కేరు ..." మని ఏడుస్తున్నాడు.

"జో ... జో ... హాయి...! చో ... చో ..." అంటూ సీత వాడ్ని సముదాయిస్తూంది.

ఈ మధ్య రోజూ 'నాని' కాస్సేపు అలాగే సతాయిస్తున్నాడు.

సీత ఎంతో సేపు సముదాయిస్తేగాని పడుకోడు.

మంజు హరి కూడా సీత గదిలో నే ఆదమరిచి నిద్రపోతున్నారు.

ప్రభాకర్ బ్రతిమాలినా వాళ్ళు సీతని, తమ్ముడ్ని వదిలి రారు. ఒక వేళ వచ్చినా అర్ధరాత్రి లేచి రాగం మొదలుపెడతారు.

ఎటొచ్చీ ఒంటరిగా మిగిలిపోయింది ప్రభాకర్.

ఈ మధ్య అతనికి రాత్రిళ్లు సరిగా నిద్ర పట్టటంలేదు.

మున్న మామగారు, అత్తగారు, మరదలు వచ్చివెళ్లినప్పట్నించి అతనికి మరి మరీ సంధ్య జ్ఞాపకం వస్తుంది.

ఎడారిలో నడిచి నడిచి అలిసిపోయిన పాంథుడిలా అతడి మనసు భార్యా వియోగంలో వేగిపోతూంది.

సంధ్యతో గడిచిన ప్రతి క్షణం ఇంకా అతడి కళ్ల ముందు సజీవంగా నిలిచే వుంది.

"ఆమె లేదు" అనుకోవటానికి ఇంకా అతని మనసుకి అపశకునంగానే తోస్తూంది.

విశాలంగా మెత్తగా వున్న ఆ బెడ్ మీద చెయ్యి చాచి నిద్రలో సహితం ఆమె

జరిగిన కథ - 19: భార్య గర్భవతి అని తెలుసుకున్న ప్రభాకర్ ఫేమిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నాడు. సీత పురిటికి పుట్టింటి కెళ్లకుండా తల్లినే తమ దగ్గరకి వెంటనే బయలుదేరి రమ్మని ఉత్తరం రాసింది. సీతకి పండులాంటి కొడుకు పుట్టాడు. వాడ్ని సీత 'నాని' పిలుచుకోసాగింది. పచ్చగా, బొద్దుగా ఉండే నానంటే ప్రభాకర్‌కి అప్పుడప్పుడూ అనురాగంతో హృదయం పులకరించేది. సీతంటే కూడా అతనికి అనురాగమే కానీ అదంత అతని మనసుకే పరిమితం. తమ కుమారుని పెళ్లికి పిలవడానికి ప్రభాకర్ మొదటి భార్య తల్లి, తండ్రి తమ రెండవ కూతురితో కూడా ప్రభాకర్ ఇంటికి వస్తారు.

కోసం వెతుకుతాడు. కాని ఏముందని? శూన్యం ..

"గత కాలమే మేలు వచ్చు కాలము కంటెన్ అని చెప్పిన కవి ఎవరో గాని ఎంత అనుభవంతో చెప్పాడు?

"గతం నాస్తి:" అంటారు ...

కాని అది ఎలా సాధ్యం?

"మంచి" అయినా 'చెడు" అయినా మనిషికి "అనుభవాన్ని' సంపాదించి పెట్టేది గతమే కదా?

అటువంటి విలువైన గతం ... లేదనుకోవటం ... నో ... ఇంపాజిబుల్ 'పాస్ట్ ఈజ్ పాస్ట్. బట్ .. పాస్ట్ ఈజ్ మోస్ట్!" అనుకున్నాడు

సంధ్య లేదు నిజమే. కాని తను ఆమెని మరిచి పోగలడా? ఆమె జ్ఞాపకాలని ఆ స్మృతి పరిమళాలని మనసు నుంచి తుడిచిపెట్టెయ్యగలడా?

మొన్నటి దాకా సంధ్య నిండు నెల్ల బరువుతో ఇంట్లో తిరుగుతుంటె తనకి ప్రతి క్షణం సంధ్య జ్ఞాపకం వచ్చేది.

ఇప్పుడు "నాని" రోజూ ప్రక్క గదిలోంచి ఏడవటం . సీత సముదాయించటం చూస్తుంటే హరిబాబు పసితనం కళ్ల ముందు మెదులుతున్నది

హరిబాబు అంతే! నెల్ల పిల్లవాడుగా వున్నప్పుడు రాత్రుళ్ళు వూరికే పోరు పెట్టి ఏడిచేవాడు. తను నిద్రపోయేవాడు కాదు. సంధ్యని, తనని నిద్ర పోనిచ్చేవాడు కాదు

సంధ్య వాడ్ని సముదాయించలేక సతమతమయ్యేది

అక్కడికి ఆయమ్మని పెట్టారు. అయినా లాభం లేకపొయ్యేది.

ఇప్పుడు సీత కూడా సరిగ్గా సంధ్య స్థానంలో నే వుంది.

కాని ఏమి సంబంధం లేనట్లు తను ఇక్కడ ఒంటరిగా. .

ఎంత చిత్రం?

ఆ రోజుల్లో తను ఎలా వుండేవాడు? ప్రపంచాన్ని జయించినట్లు ...

అటువంటి తను ఎప్పుడైనా అనుకున్నాడా? తన జీవితం ఇలా భగ్నం అవుతుందని?

సంధ్య లేని జీవితాన్ని కనీసం పిడ కలగానైనా వూహించలేదే?

ఆ రోజుల్లో . . బీడు భూమి కూడా నందనవనంలాగే కనిపించేది.

కాని ఇప్పుడు?

పూల తోటకి వెళ్ళినా శ్మశాన వైరాగ్యమే చుట్టుముడుతూంది



జీవితం చేజారిందా

మనసులో ఆనందం లేనప్పుడు ఏదైనా అంతేనేమో!

జ్వర పీడితుడికి పాయసం రుచించదు.

ప్రభాకర్ చిన్నగా నిట్టూర్చాడు.

నిండు చంద్రబింబంలోకి చూస్తుంటే చిరునవ్వు చిలికిస్తూ రసాధిదేవతలా తనని చేరే సంధ్య రూపమే జ్ఞాపకం వస్తూంది. తెల్లటి సిల్క్ మేక్సీలో ... జడలోంచి జాజిపూల మాల భుజాల మీదుగా జారుతుంటే .. అత్తరు ... పరిమళాలు అందుకుని ... తనని ఆలవోకగా చుట్టుకుని ఒడిలో చేరే అమ్మాయి ... తియ్యని అనుభూతుల్ని చవి చూపే ... ప్రేయసి ...

అవును ...

ఆ రోజు ...

ఏం జరిగింది?

లేచినప్పట్నుంచి హడావుడే!

కారణం సంధ్య - ప్రభాకర్‌ల మ్యారేజ్ డే. ఫ్రెండ్స్ దగ్గర్నుంచి, తల్లితండ్రుల దగ్గర్నుంచి శుభాకాంక్షలు అందాయి.

ఆ రోజు ఉదయం సంధ్య తలంటుకొని ప్రభాకర్ ప్రెజెంట్ చేసిన జపాన్ జార్జెట్ చీర కట్టుకుంది. ముత్యాల సెట్ అలంకరించుకుంది.

తలంటి పోసిన జుత్తుని బ్రష్‌తో చిక్కులు తీస్తూ పేపరు చూస్తున్న ప్రభాకర్ వెనుకగా వచ్చి రెండు చేతుల్తో అతన్ని చుట్టి అతని చెక్కిళ్ళపై మృదువుగా వ్రేలితో రాస్తూ చెప్పింది ...

"ఏయ్ ప్రభూ! ఈ రోజు నీకో మంచి సర్‌ప్రైజ్ చేస్తాను. ఎందుకో చెప్పుకో?"

హాయిగా నవ్వాడు ప్రభాకర్

"ఎందుకేమిటి? మన మ్యారేజ్ డే కదా? అందుకు."

"ఊహుఁ ... కాదు ఇంకొక ప్రత్యేకత కూడా వుంది."

"నిజమా?"

"ఊఁ ...!"

"ఏవిటబ్బా?"

"ప్లీజ్. గెస్.."

ఆమె నడుం చుట్టు చేతులు వేసి దగ్గరగా తీసుకున్నాడు. రెండు నిమిషాలసేపు రెప్ప వెయ్యకుండా ఆమె కళ్లల్లోకి చూసి తల అడ్డంగా తిప్పాడు.

"తెలియదు. చెప్పవా?"

"గ్రహించలేదా?"

"ప్చ్ ..."

"మొద్దబ్బాయ్ ..."

"..!?"

"అయితే నన్ను రోజూ సరిగా చూడటంలేదా? మనసెక్కడో పెట్టుకొని పరాగ్గాచిరాగ్గాచూస్తున్నావా?"

"అదేం మాట? అసలు నేను చూసేదే నిన్ను కదా?" ఖంగారుపడ్డాడు.

"అయితే నాలో ఏం మార్పు కనపడటంలేదా?"

"!?" అయోమయంగా చూశాడు ఆమె ముఖంలోకి.

భర్త అమాయకత్వానికి నవ్వు వచ్చింది సంధ్యకి.

వెక్కిరించినట్టు అంది.

"మీ కంటే సుబ్బులు నయం"

"వాట్ షేమ్?"

"కాదూ మరి? మన సుబ్బులు అంటూంది కదా .. నేను ఈ మధ్య బాగా తెల్లబడ్డానుట. కొద్దిగా ఒళ్ళు చేశానుట! నా బుగ్గలు ఆపిల్ పళ్లలా, నా కళ్ళు కాంతి పుంజాల్లా మెరిసి పోతున్నాయిట! ఈ సంతోష సందర్భంలో దానికి కానుకగా ... జూనియర్ ప్రభాకర్ అయితే కొత్త చీర ... జూనియర్ సంధ్య అయితే ... పా ..."

"హుర్రే ..."

ప్రభాకర్ సుడి గాలిలా చుట్టేశాడు.

జైల్లో పడినట్టు ఐదు నిముషాలపాటు వూపిరి అందక కొట్టుకొంది సంధ్య.

"..."

శక్తినంత కూడదీసుకొని అతి కష్టంతో భర్త చేతుల్నుంచి విడివడి దూరంగా జరిగింది.

"ఏయ్ ఏమిటి?మోటు సరసం?"

"..."

"ఇలా పిచ్చిగా ప్రవర్తిస్తే నేను ఇప్పుడే వూపిరి ఆడక ఛస్తాను."

"నీతో పాటు నేను కూడా" వాక్యం పూర్తి చేశాడు.

సంధ్య చప్పున వారిస్తున్నట్టు అంది.

"ఊఁ ... శుభమా అని పెళ్లి రోజు ఇలాగేనా మాట్లాడుకొనేది?"

చప్పున ఆమె రెండు చేతులుపట్టుకొని చెక్కిళ్లని అన్నుకుంటూ అన్నాడు.

"సంధ్యా! అసలు నీదే తప్పు. నాకెంతో ఇష్టం అయిన తియ్యటి వార్తని ఇంత ఆలస్యంగానా చెప్పటం?"

"ఈ రోజు ప్రత్యేకంగా చెప్పాలనుకొన్నాను. చెప్పాను."

ఆనందంగా అన్నాడు.

"సంధ్యా! నాకు పాప అయినా బాబు అయినా ఒకటే. సుబ్బులకి ఈ రోజే కొత్త చీర ప్రెజెంట్ చేద్దాం."

"కాని పాప వుంది. కనక ఈసారి బాబే కావాలి నాకు" అంది సంధ్య.

ఆ రోజు సాయంత్రం కాస్సేపు షికారు చేసి అట్నుంచి అటే రెస్టారెంట్‌కి వెళ్లారు.

భోజనంతో పాటు ప్రభాకర్ "డ్రింక్" కూడా తెప్పించుకొన్నాడు.

సంధ్య కోపంగా చూసింది.

"ఏయ్? అదేం పని ..."

కొంటిగా నవ్వాడు ప్రభాకర్.

"ఈ రోజు పండగ కదా? సెలబ్రేట్ చేసుకోవాలి. జస్ట్ ... టు ... పెగ్స్ ..."

"ఆఁ ఇప్పుడలాగే వుంటుంది. మీ కంపెనీ పార్టీల్లో పట్టించేది చాలదూ? ఈ అలవాటు ఇలాగే ఎక్కువైతే భార్ మొత్తం గుత్తకి తీసుకొంటావ్ ..."

నవ్వాడు ప్రభాకర్.

"నో ... నో ... అలా ఎన్నటికి జరగదు. నా సంధ్య పెదవుల్లోని మధువే చాలు నాకు ..."

"ఆపు కవిత్వం ... అంతా కల్లబొల్లి కవిత్వం."

"కాదు. నిజం. బేరర్ని పిలిచి డ్రింక్ వద్దని చెప్పనా? ఈ రోజు నీ మనస్సు కొంచెం కూడా కష్టపడకూడదు."

శివోక్తం

(ప్రఖ్యాత కన్నడ కవి సర్వజ్ఞ వచనాలు ఆధారంగా)


హీన కోపమ్ము యతులకు నెందుకుండు?
మేలు తలపులు దుర్మతి కేల యుండు?
ఇతరులను గోరు మతి సాధ్వి కేల యుండు?
నుతుల నిందల తలపేల యతుల కుండు?

సత్యవంతులు లోకాన చచ్చిరనకు.
కన్న బిడ్డల దల్లులు కాచు కరణి
వారి చరితలు సూక్తులు వ్యాప్తి జెంది
ఆర్తి సంతప్త మానవోద్ధరణ జేయు.

పాడు వాసనల్ గోరెడు పంది యెటుల
చందనాగరు మృగనాభి సౌరభముల
నెరుగు? గురివింద గింజ తానేమి ఎరుగు?
మంచి నెరుగదు పరుల నిందించు టిరుగు.

—కనమలూరు వెంకట శివయ్య

కాలక్షేపం



ధర్మపథం

కాలక్షేపమంటే హరికథా కాలక్షేపం, పురాణ కాలక్షేపం వంటిది కాదు. ఉత్తమాలయిన వాటిని గురించి మనం చర్చించవలసిన పనిలేదు. పనిపాటలు లేనివారు కాలం గడపడాన్ని గురించే తెలుసుకోవాలి. బుద్ధిమంతులు కావ్యాలాప శాస్త్ర చర్చలతో కాలం గడుపుతారనీ, మూర్ఖులు జూదం మొదలైన వ్యసనాలతోనూ, కలహాలతోనూ కాలం గడుపుతారనీ ఎన్నడో చెప్పిన సూక్తి ఒకటి ఉన్నది. అయినా - బుద్ధిమంతులు కూడా సాహచర్యం వల్లగాని, ఇతర కారణాల వల్లగాని ఎన్నో వికృత చేష్టలకు లొంగిపోవడం ఉన్నది. పనీ, పాటూ లేని శ్రీమంతులకూ, భూస్వాములకూ కాలం గడవడమెలాగ? ముప్పూటలా కడుపు నిండా తిని కాలక్షేపం కోసం ఏ వినోదానికయినా సిద్ధపడతారు. ఇతరులెవ్వరినయినా ఆటపట్టిస్తూ చూచి, ఆనందిస్తారు. ఆక్షేపిస్తూ ఉంటే తాముా వారితోపాటు అందులో వంతు తీసుకుంటారు. ముఖ్యంగా అనాథులూ, బుద్ధిహీనులూ, బలహీనులూ ఈ అపహాస్యాలకు గురి అవుతూ ఉంటారు. వారి బాధ ఇతరులకు ఆనందదాయకంగా ఉంటుంది. కొందరికి చీట్లాట కాలక్షేపంగా ఉంటుంది. కాని, కొన్ని సమయాల్లో అది కలహాలకు దోహదమవుతుంది. కాలక్షేపానికి సినిమాలు ఎడతెగకుండా చూడడం కొందరికి పరిపాటి. సినీమాల్లో మంచిని బోధించేవి చాలా తక్కువ. అవి చెడుగును బోధిస్తాయని అనలేము కాని, అలాటి సంఘటనలను ప్రదర్శిస్తాయి. మంచి అలవడ్డం కష్టం. చెడుగు మాత్రం సులభంగా అలవడుతుంది.

సత్కాలక్షేపానికి అనేక మార్గాలున్నవి. రాత్రివేళ అయితే హరికథా కాలక్షేపాలు, పురాణ శ్రవణం, ఉపన్యాసాలు బాగా ఉపయోగపడతాయి. పగటిపూట అయితే ఏ గ్రంథాలయానికో వెళ్లితే, ప్రశాంత వాతావరణంలో నచ్చిన గ్రంథాలను చదువుకోవచ్చును. దానికి అవకాశం లేకపోతే, ఇంట్లోనే కూర్చుని పుస్తకాలు చదువుకోవచ్చు. గ్రంథ పఠనంపయి మనస్సు ఉంటే అనవసర ప్రసంగాలకు అవకాశం ఉండదు. ఇలా జరిపితే, తాము ఇతరులకు మార్గం చూపినవారు కూడా కావచ్చును.

ఎంతటి వాడికయినా, ఏదో ఒక చికాకు ఉండవచ్చు. అట్టి స్థితిలో మంచి పుస్తకం చదవడం దానికి మేలైన ఔషధంగా పనిచేస్తుంది.

- బులుసు వేంకట రమణయ్య

జీవితం చేజారింది

సంధ్య సన్నగా నవ్వింది.

అతని కంఠంలోని సిన్సియారిటీకి మెత్తగా కరుగుతున్నట్లు అంది ...

"జస్ట్ ఫర్‌ఫన్ ... తమాషాకి అన్నా! తీసుకోండి. మీ ఎంజాయ్‌మెంటు నేనెందుకు కాదనాలి?"

ప్రభాకర్ వదనం వికశించింది.

సంధ్య చిరాగ్గాఅంది-

"అయినా ఏమిటో ... మీ మగవాళ్ళు అదంటే అంత పడిపోతారేమిటి? ఏముందందులో?"

'టేస్ట్ చేసి చూడు. తెలుస్తుంది."

"అక్కర్లేదు. అలాటిది తెలియకపోతే వచ్చిన నష్టం ఏమీలేదు."

"ఊఁ ...?"

"ఊఁ ...!"

ఇద్దరి నవ్వులూ శృతి కలిశాయి. జోక్స్‌తో నవ్వులతో డిన్నర్ ముగించుకొని రాత్రి పదిగంటల ప్రాంతంలో ఇంటికి వచ్చారు.

పూలమాలతో పడకగది ప్రత్యేకంగా అలంకరించాడు ప్రభాకర్.

కిటికీ అద్దాలు దించి కిటికీ పరదాలు పక్కకి జరిపాడు.

సంధ్య వచ్చాక వెన్నెల గదిలో పరుచుకొనేలా బెడ్ రూమ్‌ని రీ - మోడలింగ్ చేయించాడు.

కిటికీ వెంబడి నైట్ క్వీన్ నాటించి సన్నటి ఇనుప వైర్ అల్లించి జాజి తీగెలు గోడల నిండా ఎక్కించాడు.

కిటికీతెరిస్తే చాలు సగం మేర వెన్నెల గదంతా పరచుకొంటుంది.

ప్రొద్దుగుంకేసరికి అరవిరిసిన పూల పరిమళం మత్తుగా గాలితెరలతో కల్సి గదంతా వ్యాపిస్తుంది.

తెల్లటి నైటీ వేసుకుని వచ్చింది సంధ్య. బాడీ స్ప్రే సుగంధాలు విరజిమ్ముతూ దివి నుంచి భువికి వచ్చిన దేవకన్యలా అతని ఒడిలో వాలింది!

ఎంత అందమైన రోజులు అవ్వి?

హృదయంలో చెరగని స్మృతులు ..

ఎప్పుడు తల్చుకుంటే అప్పుడు నిత్య నూతనంగా అతడ్ని అలరిస్తాయి.

మంచంలో ఒంటరిగా పడుకొని అలా చందమామలోకి చూస్తుంటే గత కాలపు అనుభూతులతో ప్రభాకర్ పులకాంకితుడు అవుతున్నాడు.

కళ్ల ముందు సంధ్య అందమైన రూపమే కదులుతూంది.

ఇంకా ఆమె లేతగులాబీ పెదవులు అతడి చెక్కిలిపై సున్నితంగా తాకుతున్నట్లే ... తియ్యని మమత ...

ఆమె మృదుమైన పట్టుకుచ్చులాంటి శరీరం తన కౌగిలిలో నలుగుతున్నట్లే అనుభూతి!

కాని చివరికి తనకేం మిగిలింది? ...

-"మింట నెచటనో మెరయు చుక్కల
కంట చూచితి కాంక్షలూరగ
కాంక్షలూరిన కొలది చుక్కలె
కాంచి బ్రతుకే గడిపితిన్" -

భగవంతుని లీల ఎంత విచిత్రం?

జరిగేది అనుకోకపోవటం, అనుకున్నది జరగకపోవటమేనా జీవితం అంటే?

విషాదకరమైన ఆ తియ్యని గత కాలపు స్మృతుల మధ్యే నిద్రాదేవి ఎప్పుడో చల్లగ అల్లనల్లన అతడ్ని మగతగ ఒడిలోకి తీసుకుంది.

(ఇంకా ఉంది)

సెక్స్ ఎడ్యుకేషన్ అవసరమా? – చర్చ

తప్పనిసరి




నేడు కుటుంబాలలో సభ్యుల సంఖ్య అధికమై ఇంటిలో సరియైన సౌకర్యములు లేక ఉన్న కొద్ది పాటి గదులలోనే అందరూ సర్దుకోవాల్సి వస్తున్నది. వీరిలో వయసులో వున్నవారు వుంటారు. వారికి పెద్ద వారు ఏమి చేస్తున్నారో చూడాలనే క్యూరియాసిటి ఎక్కువగా వుంటుంది. చాటుగా చూడటం వలన మానసికమైన సంఘర్షణకు తట్టుకొనలేక అడ్డ దారులలో తమ కోర్కెలు తీర్చుకొంటారు. ఫలితం ఏ సుఖవ్యాధులో రావటం. డాక్టరుకి చూపించుకోలేక, ఇతరులకు చెప్పలేక మానసికంగా కృంగిపోతారు. వాళ్ళు అలా కావటానికి కారణం సెక్సులో సరియైన పరిజ్ఞానం లేకనే. ఈ వ్యాధుల వలన వ్యాపించిన క్రిములు పుట్టబోయే బిడ్డల మీద కూడా తమ ప్రభావం చూపుతాయి. సెక్సు అన్నది పవిత్రమయినా, దాని గురించి తెలుసుకున్నందు వలన కోల్పోయేదేమి వుండదు. ప్రతి ఒక్కరూ దానివలన సంభవించే విషపరిణామాల నుండి తప్పించుకుంటారు. ప్రతి వ్యక్తిలోనూ "విల్ పవర్" ఉండాలే గాని సెక్సు ఎడ్యుకేషన్ వల్ల చెడు జరుగుతుందనుకోవటం చాలా పొరపాటు. నేటి కాల పరిస్థితులను బట్టి తప్పనిసరిగా వుండితీరాలి.

–శ్రీమతి కె. ఎస్. కృష్ణ, బాపట్ల

* * *

తప్పుదారి పట్టవచ్చు




మానవ జీవితావసరాలలో సెక్స్ ఒక వరం కావచ్చు -కాని నాగార్జున యూనివర్సిటీ వారి అభిప్రాయాలను బట్టి సెక్స్ ఎడ్యుకేషన్ ప్రవేశ పెడితే నేటి యువతరం ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుంది ఎలాంటి ఒడిదుడుకులకు లోనవుతుంది, అన్నదానిని గురించి ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉంది. లేత యవ్వన దశలో కాలేజిలో అడుగుపెట్టే స్త్రీ, పురుషులకు సెక్స్‌కై ప్రత్యేకించి క్లాసులు తీసుకుంటే విచ్చు. విచ్చని మనస్సుతో, ఊహ తెలియని వయస్సులో ఇంకా తప్పు దారి పట్టవచ్చు. సమాజం ఇంకా అంధకారానికి లోనయ్యే అవకాశాలు ఎక్కువ.

సెక్స్ అనేది స్త్రీ, పురుషుల మనస్తత్వాలను బట్టి, పరస్పర అవగాహనతో ఒకరి నొకరు అర్థం చేసుకొనే ప్రకృతి సిద్ధమైన చర్య తప్ప -దానికై సెక్స్ ఎడ్యుకేషన్ ప్రవేశ పెడితే మానవాళికే కీడు జరగవచ్చు. కనుక సెక్స్‌కై ప్రత్యేకించి క్లాసులు తీసుకొని బోధించడం అనవసరం. ఆడ పిల్లల తల్లితండ్రులు తమ పిల్లలకు చదువు చెప్పించడానికి కూడ జంకుతారు. కనుక సెక్స్ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టడం అనవసరం?

–యస్. యమ్. ఖిజర్, చందోలు

* * *

జీవితం యాంత్రిక మవుతుంది



సెక్స్ గురించి ప్రత్యేకంగా నేర్చుకోవలసినది ఏమి లేదు. ఇప్పటి పాఠాలలో వున్న అంత సంయోగము ఫలదీకరణం వంటి అంశములు చాలు. సెక్స్ అనేది ప్రతి మనిషికి తన జీవితంలో మధుర అనుభూతిగా మిగుల్చుకోవలసినది గాని ప్రత్యేకంగా ఎడ్యుకేషన్ అంటూ నేర్చుకోవలసినది కాదు. ఈ రోజు మన దేశంనందు కుటుంబ వ్యవస్థ నిలబడుటకు కారణం సెక్స్ గురించి గుప్తంగా వుంచటమే. ఎడ్యుకేషన్ ప్రత్యేకంగా పెట్టిన నాడు 20 సంవత్సరములకు రావలసిన కోరిక పాశ్చాత్య దేశాలలో వలె 10 సంవత్సరాలకు వచ్చి కుటుంబ వ్యవస్థ చెడి జీవితం యాంత్రికమగును. మనిషి తృప్తి లేనివాడు. సెక్సు గురించి బాగా తెల్సిననాడు అది మామూలు అయిపోయి క్రొత్త పద్ధతులకై అన్వేషిస్తాడు. ఆ క్రొత్త పద్ధతుల అన్వేషణ ఈనాటి "ఎయిడ్స్."

కనుక ఇప్పటి ఈ సమాజంలో సెక్స్ ఎడ్యుకేషన్ శుద్ధ అనవసరమని నా అభిప్రాయం.

–పి. శ్రీనివాసరెడ్డి (మెడికో)
పేరాజుపేట, కాకినాడ

* * *

నష్టమే ఎక్కువ




సెక్స్ లేనిది ప్రపంచమే లేదు. సెక్స్‌నే పాఠంగా బోధిస్తే లాభంకన్న నష్టమే ఎక్కువవనిపిస్తుంది. సెక్స్ ఒకరు బోధిస్తే వచ్చేది కాదు. వయసుతో పాటు సెక్స్ వస్తుంది. సెక్స్‌నే విపులంగా చెబితే ఆడపిల్లల పరిస్థితి ఏంకాను. వారు బయటకు రావడానికి కూడ భయపడతారు. సెక్స్ అనేది స్త్రీ, పురుషుల మధ్య పవిత్రమైన కార్యం. కాని దాన్ని ఈ రోజుల్లో అనేక పేర్లతో బాహ్యంగా ప్రచారం చేస్తున్నారు. సెక్స్ అంటే అసహ్యం కలిగేలా చేస్తున్నారు. సెక్స్ నాలుగు గోడల మధ్య ఉంటేనే మంచిదని నా అభిప్రాయం. సెక్స్ ఎడ్యుకేషన్ గనక ప్రారంభిస్తే స్త్రీలు చదవడం తగ్గిస్తారు. ఎందుకంటే మనది సంప్రదాయాలను పాటించే దేశం కనుక. తల్లిదండ్రులు ఆడపిల్లలను కట్టుదిట్టంగా పెంచుతారు కాబట్టి అందుకు అంగీకరించరు. నేడు స్త్రీ గడపదాటి మళ్ళీ ఇంటికి చేరుకోవడం ఓ గగనంగా ఉంది. అలాంటిది సెక్స్ ఎడ్యుకేషన్ ప్రారంభిస్తే స్త్రీల పరిస్థితి అధ్వాన్నంగా తయారవుతుంది.

–డి. నర్సింగరావు, పటానుచెరువు, మెదక్

* * *

పతనానికి నాంది



మన భారతీయ సంస్కృతి, సంప్రదాయం ప్రకారం సెక్స్ అంటే "పవిత్ర మైనదని" అది నాలుగు గోడల మధ్య జరిగే రహస్య సంగమం అని ప్రతి భారతీయ పౌరునికి పౌరురాలికి తెలుసు. అలాంటి పవిత్ర మైన అంశాన్ని బజారులో పెట్టి జన్మంటే అర్థం లేనిదిగా తయారు చేయటం భావ్యం కాదు. ఈ అంశం గురించి అంత ఇంటరెస్ట్ తీసుకొని "భావి పౌరులు"గా తీర్చి దిద్దాల్సిన అవసరమూ లేదు. ఇప్పటికే సినిమాల ప్రభావం వల్ల కానీయండి. సెక్స్ పరిజ్ఞానం వల్ల కానియండి ఆడపిల్ల నిజంగా, భయం లేకుండా, తల ఎత్తుకొని తిరగటానికి ధైర్యంలేక, ఏ రోజు పేపరు చూసినా వాటి నిండా ఇక్కడ అవివాహిత మానభంగం, అక్కడ వివాహిత సామూహిక మానభంగం, ఇలా ఉంది ఈనాటి పరిస్థితి. ఇక వీటికి తోడు సెక్స్ ఎడ్యుకేషన్ కూడా జోడిస్తే ప్రభుత్వం కష్టపడి నిర్వహించే ఫామిలీ ప్లానింగ్ ఫలితం శూన్యం. విజ్ఞానం ఎప్పుడూ జ్ఞానాన్ని పెంచి "ఈ నాటి బాలలే రేపటి పౌరులు"గా తీర్చి దిద్దాలిగాని, ఒక్కొక్క బాలుడ్ని ఒక్కొక్క కీచకుడిగా తయారు చేయవద్దని, పతనానికి నాంది పలుక వద్దని నా విన్నపం.

–ఎం. శశిదేవి, తరిగొప్పుల □

ది ఫ్రెండ్ ఇన్ నీడ్...

పాండ్రంకి సుబ్రమణి

"అమ్మా! అమ్మా!"

వేణు పిలుస్తూ, నలుదిక్కులా తల్లిని వెతుకుతూ వంటగది వేపు దూసుకు వచ్చాడు. అక్కడ అన్నయ్యకు అడ్డు తగిలి, నవ్వుతూ అడిగింది విశాలి.

"ఏం కావాలి? నన్నడగరా అన్నయ్యా! మొన్న కొన్న కొత్త పేనా పారేసుకున్నావా?"

"కాదు."

"బనియను కనిపించడం లేదా?"

"ఉష్! పనికిరాని పెద్దరికం చూపించకు." అని చెల్లిని గసురుకొని తల్లి కోసం మరో మారు కేక పెట్టాడు వేణు.

"అబ్బ! వస్తున్నారా నాయనా! ఏమిటి? చిల్లర డబ్బులు కావాలా?"

"అది కాదమ్మా! గజపతి వస్తున్నాడమ్మా! రేపు మధ్యాహ్నం బండికి వస్తున్నానని కార్డు పంపాడు."

"గజపతి గారా! వారెవరు? నీకున్న వంద మిత్రులలో అతనొకడు. కచ్చితంగా కలెక్టరుగారు మాత్రం కాదు. దీని కెందుకురా అన్నయ్యా ఇలా గాబరా పడతావు?" అన్నయ్యను రెచ్చగొట్టడానికి మళ్ళీ అడ్డు వచ్చి నిలిచింది విశాలి. ఈ సారి వేణు కోపం ఆపుకోలేక నాలిక గట్టిగా కరచుకొని చెల్లి వేపు చూశాడు.

"నిన్ను నోర్మూసుకోమన్నానా?" అని తల్లి వేపు తిరిగి.

"అమ్మా! వాడికి యేదైనా స్పెషల్ చేసి పెట్టమ్మా! నువ్వు చేసే చేగోడీ లంటే గజపతికి పంచప్రాణాలమ్మా!" అంటూ తల్లిని సమీపించాడు. అంతవరకూ నిశ్శబ్దంగా వింటూ నిల్చున్న ముత్యాలమ్మ సన్నటి నిట్టూర్పు విడిచింది. వేణు ఫ్రెండ్సు అడపాదడపా ఇంటికి రావడం రివాజే! స్నేహితులంటే కొడుక్కి పంచప్రాణాలని ఆమెకు తెలుసు. ఇంటికి వచ్చే పాత స్కూలుమేట్సుకి, నేటి కాలేజ్ మేట్సుకీ ఏదో ఒకటి చేసి పెడుతూనే ఉంటుంది. కొడుక్కి ఇంట్లోని ఆర్థిక పరిస్థితిని అంచనా వేయగల పరిపక్వత లేదని ఆమెకు తెలుసు. అది కొడుకు తెలుసుకొని చేసేదేమీ లేదని కూడా ఆమెకు తెలుసు. మొదటి నుండి ఆటుపోటులకు సులభంగా కదలని మనోదార్ఢ్యం ఆమె అలవర్చుకుంది. కాని, ఇప్పుడు గజపతి రాక గురించి విన్న వెంటనే ముత్యాలమ్మకు కంపరం వంటిదేదో కలిగింది. అలాగని గజపతి అంటే, అయిష్టమని కాదు. ఎటొచ్చీ, కొద్ది మందిలో సాధారణంగా, కనిపించే ఓ దురలవాటు అతడిలో ఉంది. మితిమీరిన 'చొరవ కనబరుస్తాడు. కొడుకు వెల్లడించిన కోరిక మేర, చేగోడీలు చేసేంత వరకూ ఆగే వ్యక్తి కాదు గజపతి. చేగోడీలు మాత్రం తీసుకొని వెళ్ళే వ్యక్తి కూడా కాదు. ఇంటి గుమ్మం తొక్కీ తొక్కకుండానే అతడు ఆకలంటూ అవురావురని వంట గదిలోకి వచ్చేస్తాడు. కళ్ళకు కనిపించిన దానిని అందిపుచ్చుకొని కబుర్లు చెప్తూ స్వాహా చేస్తాడు. వేణు అతని ప్రక్కనే నిల్చుని అందని దాన్ని అందుకొని మిత్రుడికి సప్లయ్ చేస్తుంటాడు. అతడు భోజనాలు ముగించి ఇంటికి బయలుదేరేప్పటికి డబ్బాలోని లడ్డూలు సగం ఖాళీ అయిపోతాయి. కారప్పూసల టిన్ను బిక్కముఖం వేస్తుంది. వెళ్తూ, వెళ్తూ "అబ్బ! లడ్డూలు బ్రహ్మాండంగా చేశారండీ! మరి కొంచెం పెద్దవిగా ఉంటే బాగున్ను." అని ఒకకాంప్లిమెంటు పారేస్తూ, దానికో రెక్టిఫికేషన్ జోడిస్తూ నిష్క్రమిస్తాడు.

"గజపతి నామధేయుడు, భోజన ప్రియుడు." అని నవ్వును ఆపుకుంటూ తల్లి చెవిన కసుక్కుమంటుంది విశాలి. గజపతి ఎటువంటి వాడో, ఎలా వ్యవహరిస్తాడో తెలిసినా అతణ్ని దూరంగా నెట్టేటంతటి కాఠిన్యత ముత్యాలమ్మకు లేదు. తినుబండారాలను బీరువాలో ఉంచి తాళం పెట్టడమో, మరక్కడైనా దాచి ఉంచడమో ఆమెకు అలవాటు లేదు. ఆ మాటకు వస్తే గజపతి అలా అవురావురంటూ ఆరగించడం కూడా ఆమెకు ఆక్షేపణీయం కాదు. ఎటొచ్చీ అతడు కనబర్చే చొరవను ఆమె సహించలేక పోతూంది. ముఖ్యంగా కొడుకు పైన అతడు కనబర్చే అధికారం ఆమెకు సుతారమూ నచ్చడం లేదు. కొడుకు అతడికి దగ్గిరుండి అడుగులకు మడుగులొత్తడం అంతకంటే నచ్చడం లేదు

అన్నమాట ప్రకారం గజపతి బండి దిగి ఇల్లు చేరాడు. మిత్రుడు అందిచ్చిన మంచినీళ్ళ గ్లాసు అందుకొని, పేము కుర్చిలో జేరబడి, "నాదొక చిన్న రిక్వెస్టురా వేణూ!" అని నీళ్ళు తాగడం ముగించి, ఖాళీ గ్లాసుని వేణు చేతిలో ఉంచాడు.

"చెప్పురా గజపతీ!"

"మీ అమ్మగారి చేసిన వెజిటబుల్ పులావ్ తినాలని ఉంది. ఓ గంట ఆలస్యమైనా ఫర్వాలేదు. తినే వెళ్తాను." పక్క గదిలో నిల్చుని మిత్రుల సంభాషణ వింటూన్న విశాలి మొదటి సారిగా ఉలిక్కిపడింది. గజపతి గొంతున ధ్వనించిన పట్టుదల ఆమెను కించిత్ భయపడేట్టు కూడా చేసింది.

"వన్ మినిట్. అమ్మకు చెప్పి వస్తాను." అని అమ్మను వెతుక్కుంటూ వెళ్ళాడు వేణు. అప్పుడు విశాలి చటుక్కున అన్నయ్యకు అడ్డువచ్చి నిల్చుని అడిగింది. "ఎప్పుడైనా వెజిటబుల్ పులావ్ చూసి ఉన్నావా?"

"చూసినట్లే జ్ఞాపకం."

"తిని కూడా ఉంటావులే! దాని ప్రిపరేషన్‌కి ఎన్ని సామాన్లు కావాలో, ఎటువంటి బియ్యం కావాలో, ఎంతటి నూనె ఖర్చవుతుందో తెలుసా?"

"అదంతా అమ్మ చూసుకుంటుందిలే, నువ్వు అడ్డులే!"

"సరే, మంచిది. నాదొక చిన్న ప్రశ్న. బదులిస్తావురా?"

"తరవాత."

"కాదు. ఇప్పుడే బదులు కావాలి."

"అడుగు."

"నువ్వు కూడా గజపతి గారింటికి వెళ్ళే ఉంటావు. ఇలా పెద్ద పెద్ద లడ్డూలు, వెజిటబుల్ పులావ్‌లు కావాలని అడిగావా?"

"నేను అడక్కపోయినా అన్నీ తినమని వాళ్ళు అడుగుతారు. ఇంకా యేమైనా చేసి పెట్టాలా అని అడుగుతారు."

నువ్వేమంటావు?"

"అవేవీ వద్దు. ఉన్నది పెట్టమని అడుగుతాను."

"దీనినే సభ్యత అంటారు. గొంతెమ్మ కోర్కెలు ప్రకటిస్తూ మిత్రుల గడపలు తొక్కడం సంస్కారం అనిపించుకోదు."

"ముందు నువ్వు నోర్మూసుకుంటావా లేదా? గజపతి నా ఫ్రెండు. నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. మిత్రుడికి అడిగి తీసుకునే అధికారం ఉంది. మిత్రుల మధ్య సభ్యతా సంస్కారాలకు తావు లేదు. హెన్స్, మూవ్ అవే!"

అంతలో ముత్యాలమ్మ అన్నా చెల్లెళ్ళ మధ్యకు వచ్చి నిల్చుంది.

"ఎందుకే ఈ పోట్లాట? ఆ అబ్బాయి కోసం కాకపోయినా మీ అన్నయ్య కోసమైనా మనం కొన్ని చేసే తీరాలి. నీ కంటే పెద్దవాళ్లతో అలా తగవు పెట్టుకోవడం రేపు అత్తవారింటికి వెళ్ళే అమ్మాయికి ఉండాల్సిన లక్షణం కాదు." అని కూతురిని మెత్తగా మందలించి, కొడుకు వేపు తిరిగి, "వేణూ! నువ్వెళ్ళు. నీ మిత్రుడికి పులావ్ దొరుకుతుందని చెప్పు."

వేణు చెల్లి వేపు వెక్కిరింపుగా ముక్కు ఎగరేసి సన్నగా విజిల్ వేస్తూ కదిలాడు.

గజపతి తన కిష్టమైన పులావ్‌ని భుజించి, డబ్బాలలో ఉంచిన తినుబండారాలను ఎన్నిసార్లు తీస్తే అన్నిసార్లు స్వాహా చేసి గృహాభిముఖుడయ్యాడు.

ఆ రోజు సాయంత్రం తన గదిలోకి కాఫీ గ్లాసుతో వచ్చిన తల్లిని చూసి, వ్రాస్తున్న పేపర్లను ప్రక్కన పెట్టి, "అమ్మా!" అని పిలిచాడు.

"ఊఁ!" కాఫీ కప్పును బల్ల పైనుంచుతూ అంది ముత్యాలమ్మ.

"ఉదయం ఫీజు కోసం నువ్విచ్చిన యాభై రూపాయల్ని గజపతికి ఇచ్చేసేనమ్మా!"

ఆమె ఆశ్చర్యంగా కళ్ళను పెద్దవి చేసుకొని చూసింది.

"అవునమ్మా! అర్జంటు పనుందని అడిగి తీసుకు వెళ్ళాడు. సాధారణంగా గజపతి డబ్బులు అడగడమ్మా!" ఆమె యేమీ అనలేదు.కొడుకుని తేరిపార చూసి నిట్టూర్చింది. నిన్ననే ఎదురింటి యశోదమ్మ గారిని అడిగి తీసుకుంది ఆ యాభై రూపాయల్ని. అవిణ్ణి మరోసారి ఎలా అడగడం?

"మూడు రోజుల్లో ఫీజు కట్టకపోతే, ఫైను వేస్తారమ్మా!" ఆమె మౌనంగా తలూపి తిరిగింది.

"అమ్మా!" గది గుమ్మం వద్ద నిల్చుని పిల్చింది విశాలి. ఆమె ప్రశ్నార్థకంగా కూతురిని చూసింది.

"ఇదిగో!" డబ్భై రూపాయలు. నేను సేవ్ చేసుకొన్న నాణేలు!"

ఆమె గుండె ఆర్ద్రతతో నిండింది.

"చూశావురా వేణూ! తోబుట్టువు ప్రేమంటే ఇదే! నీతో ఎంత కయ్యం పెట్టుకున్నా, అన్నయ్య కష్టం చూసి ఎలా తల్లడిల్లిపోయిందో చూశావా?"

"మహ గొప్పేలే!" అన్నట్టు తల్లి చాటున ముఖం పెట్టి, రెండు అరచేతుల్ని చెవుల వద్ద ఉంచుకొని, కుందేటి చెవుల్లా ఆడించాడు.

* * * *

రోజులు విచ్చుకున్న పూరేకుల్లా కాంతిరేఖల్ని నింపుకొని, ఆ తరవాత వాడి నేల రాలిపోతున్నాయి. నిన్నటి కమ్మటి వసంతాలను గాని, చేదును నింపుకొన్న తీవ్రమైన క్షణాలను గాని లక్ష్యపెట్టకుండా కాలం పృథ్వి పొరపై ఇనుప పాదాలను మోపుతూ వెళ్ళిపోతూంది.

వేణు ఓ సెంట్రల్ గవర్నమెంటు ఆఫీసులో క్లర్కుగా చేరాడు. గజపతి ఓపెన్ కంపెటిషన్ పరీక్షలు వ్రాసి ట్రైనింగు తీసుకొని, ప్రక్క ఊళ్ళో గజటెడ్ ఆఫీసరు హోదాలో ఉద్యోగం స్వీకరించాడు.

గజటెడ్ ఆఫీసరు అయిన తరవాత కూడా, తనను మరచి పోకుండా సరాసరి ఇంటికి ఏతెంచడం అతడికి గర్వకారణంగా ఉంది.

"నేను షర్టు గుడ్డ తీసుకుంటాను. యాభై రూపాయల్ని నీ వద్దే అట్టే పెట్టు. మరొక రోజు ఈ యాభైకి మరో యాభై జోడించి తీసుకుంటాలే!"

"గుడ్! అలా గుండాలి ఫ్రండంటే! నీ పెళ్ళికి నువ్వు చెప్పింది మరచి పోకుండా చేస్తాలే!"

"నేను ఫ్రండునని మనసులో ఉంచుకుంటే, అదే చాలురా!"


"నోర్ముయ్! నీవు సంబరపడి పోవడం ఎవడిక్కావాలి? నీవు ఫ్రండుగా దొరకడం నా పూర్వజన్మ సుకృతంరా! అది సరేగాని , అదోలా ఉన్నావేం? గెడ్డం గీసుకోవడం మరిచావా? లేక స్టైయిల్‌గా తయారవాలని....."

"ఏమీ లేదు. సోమరితనం."

"కొయ్యకు, ఏమీ లేదంటే ఏదో ఉందన్న మాట. గీర్వాణం చూపించకుండా చెప్పు రా!"

"మా చెల్లి పెళ్ళి ఆగిపోయిందిరా!" వేణు గొంతు గాద్గితమైంది. గజపతి ఆశ్చర్యంగా చూశాడు.

"పెళ్ళి చూపులు, సర్వమూ అయిన తరవాతనా!" వేణు తలూపాడు.



వినడం, వ్రాసుకోవడం తప్ప ఇద్దరూ మళ్ళీ కలుసుకోలేకపోయారు.

ఒక రోజు గజపతి అకస్మాత్తుగా ఊడిపడ్డాడు. మిత్రుణ్ణి చూసి కన్నీరు కార్చినంత పని చేశాడు వేణు.

"ఇదిగో షర్టు గుడ్డ. రిఫ్రెషర్ ట్రైనింగుకి వెళ్ళినప్పుడు బొంబే నుండి తెచ్చాను. ఇవిగో నీ యాభై రూపాయలు." అని రెండూ ఒకేసారి అందిస్తూ, వేణు ముందున్న దినపత్రికను లాగి క్రింద పడేసి, ఎదురుగా స్టూలు పైన కూర్చున్నాడు గజపతి. వేణు దేనినీ అందుకోలేదు. మిత్రుణ్ణి తేరిపార చూశాడు. ఇప్పుడు ముఖం పెద్దదయి, నుదురు కాస్తంత వెడల్పు అయినట్టుంది. గోల్డు ఫ్రేము కళ్ళద్దాలు వేసుకున్నాడు. పదవి, హోదా కలసి వస్తే, గాంభీర్యత దానికదే పుట్టుకొస్తుందేమో! బొజ్జ కాస్తంత పెద్దదయింది. గజపతి

"బేడ్! వెరి బాడ్! కొన్ని పరిస్థితులు అలాగే ఎదురవుతాయి. ఆఖరు క్షణాన కట్నం వద్ద తగాదా వచ్చిందన్నమాట!"

"లేదు. ఊళ్ళోని మిద్దెళ్ళు అమ్మేసి పెళ్ళి కొడుకు అడిగినవన్నిట్నీ సమకూర్చాలనే తీర్మానించాం. కారణం ఆర్థిక పరమైనది కాదు – విధి విలాసం."

"అంటే?"

"టేబుల్ పైన స్టూలు నుంచి విశాలి సీలింగు ఫ్యాను తుడుస్తూ క్రింద పడింది. కాలు విరిగింది మూడు నెలల్లో బాగయి పోతుందని మా తరుపు పెద్దలు నచ్చజెప్పడానికి ఎంతో ప్రయత్నించారు.

'కుంటుతూ నడవడం తప్పదు కదా!' అని తిరస్కరించారు." ఈ మాటలంటున్నప్పుడు వేణు కళ్ళలో నీరు ఉబుకింది.

"ఛ, యేడ్వటం యేమిట్రా?"

"నా కోసం కాదురా! అమ్మ మంచాన పడింది. నాన్న రోజు రోజుకీ క్రుంగిపోతూ ఉద్యోగానికి వెళ్తున్నారు."

గజపతి ఊరకుండిపోయాడు. అలా చాలా సేపు కూర్చున్న తరవాత, గజపతి మౌనంగా వేణు, పెరటి వేపు నడిచి, ముఖం కడుక్కొని, చన్నీటిని మెడ పైన చల్లుకొని హాలులోకి వచ్చాడు.

"కాఫీ స్ట్రాంగ్‌గా కావాలా? ఈ మధ్యే కాఫీ చేయడం అమ్మ నేర్పింది. విశాలి అత్తవారింటికి వెళ్ళిపోతుం దని."

"ఆగు, ముందు మీ అమ్మగారిని చూడాలి." అని వేణు అందిచ్చిన టవలుతో తుడుచుకొని కదిలాడు.

"నమస్కారం. బాగున్నారా?"

ముత్యాలమ్మ తన చత్వారపు కళ్ళను మెల్లగా విప్పి చూసింది.

"నువ్వా నాయనా! చూస్తున్నావుగా ఎలా ఉన్నానో!" ఆమె మునుపులాగే నవ్వడానికి ప్రయత్నించింది. కాని ఆమె కళ్ళలో నవ్వు తొణికిస లాడేందుకు బదులు కన్నీరు మెరిసింది. గజపతి మౌనంగా మంచం ఓరన కూర్చున్నాడు.

"మిమ్మల్ని ఒకటి అడుగుతాను. అది అడగబోయే ముందు రెండు మాటలు చెప్పాలి. వాస్తవానికి మేం ఆస్తిపరులమే! మా నాన్న చిన్నప్పుడే పోవడాన, నేను చిన్నవాణ్ణి కావడాన మా మామయ్య మా ఆస్తితో ఫుట్‌బాల్ ఆడుతున్నారు. ఆ ఆటలోని తుది గెలుపుని కోర్టు చూసుకుంటుంది లెండి. అందువల్ల మేం ఇన్నాళ్ళూ అన్ని పాట్లు పడవలసి వచ్చింది. ఇకపోతే నా గురించి ఒక మాట. నేను స్కూలు రోజుల్లో గాని, కాలేజీ రోజుల్లో గాని అమ్మాయిల్ని ప్రేమించడం ఎరగను. అంతేకాదు, ఈ క్షణం వరకూ ప్రేమించి ఎరగను. అసలు నిజం మీ ముందుంచే తీరాలి. ఏ అమ్మాయీ ఇంతవరకూ నన్ను ప్రేమించ డానికి ముందుకు రాలేదు. ఎటూ ఛాన్సు లేదు గనుక, పెళ్ళి చేసుకొని నా భార్యను మాత్రమే మనసారా ప్రేమించాలని తీర్మానించాను. ఇప్పుడు అసలు విషయానికి వస్తున్నాను. విశాలిని నాకిచ్చి పెళ్ళి చేస్తారా?"

దీ ఫ్రెండ్ ఇన్ నీడ్....

ముత్యాలమ్మ బదులివ్వకుండా కనురెప్పల్ని ఆడించింది.

"నాయనా! నువ్వు ఆఫీసరువయావని వేణు చెప్పాడు. మేం అంతగా....."

"నన్ను తతిమ్మా వాళ్ళ లిస్టులోకి ఎక్కించేయ కండి. అంతా మీ ఇష్టం. విశాలి మీ కూతురే కావచ్చు. కాని నా దృష్టిలో ముందుగా కనిపించేది నా ఫ్రెండు చెల్లెలు. ఆమెను కంట నీరు పెట్టనివ్వకుండా చూసే బాధ్యత నాది. కొన్నాళ్ళకు విశాలి కాలు పూర్తిగా బాగయి పోతుంది. అలా కాక పోతే, విశాలి రేపు కొంచెం కుంటుతూ నడవవచ్చు. కాస్తంత కుంటుతూ నడవడంలో వయ్యారం ఉంటుందంటారు కథలు వ్రాసే వాళ్ళు. ఓ. కే. మా అమ్మను ఒప్పించే బాధ్యత నాది."

ముత్యాలమ్మ కన్నీరు విడుస్తూ, గజపతిని దగ్గరకు రమ్మని సైగజేసి, అతడి ముఖాన్ని రెండు చేతులతో నూ నిమిరింది.


** *** **


మూడు గంటల ప్రాంతాన గజపతి వెళ్ళి పోయాడు.

గజపతిని బండెక్కించి, ఇల్లు చేరుకున్న వేణుకి సర్వమూ రంగుల కలగా మెరిసే మేఘపు కొసలా కనిపించింది. మేరు పర్వతం అంతటి సమస్య మంచులా కరగడం అంటే ఇదేనేమో! ఇక రేపట్నుంచి నాన్న ఉద్యోగానికి వెళ్ళేప్పుడు వంగి నడుస్తూ వెళ్ళనవసరం లేదు.

గజపతి వచ్చి, సంభాషణ జరిపి వెళ్ళిన దగ్గర్నుంచి విశాలి కనిపించడం లేదు. అంటే, అంతావిని, నమ్మాలో నమ్మకూడదో తెలియక, గది తలుపులు బిడాయించుకు కూర్చుంది.

ఎనలేని హుషారు ముంచుకు రావడం వల్ల, వేణు పడక పైన వాలి, కాసేపు కళ్ళుమూసుకొని, జరిగినదంతా నెమరు వేసుకొని, అది కల కచ్చితంగా కాదని నిర్ధారించుకొని, లేచి షేవింగ్ చేసుకొని, ఇల్లు





షర్టు తెల్ల ప్యాంటూ వేసుకొని, మృదువైన సాయంత్రం లోకి నడకసాగించాడు. రోడ్డు చివరన అందరినీ అడ్డగిస్తూ చిల్లరడబ్బుల్ని అడుగుతూన్న కుంటివాణ్ని చూసి, అతడికే మొదటి సారిగా చిరాకనిపించలేదు. కుంటివాడి వద్దకు వెళ్ళి అతడి డబ్బాలో ఓ అర్ధ రూపాయి బిళ్ళ వేసి, తిరిగేటప్పటికి ప్రక్కనే కారు వచ్చి ఆగడం చూసి, అప్రయత్నంగా రెండడుగులు వెనక్కి వేసి చూశాడు.

"వేణూ! ఇది మీ వీధేనా?" కారులో పల్నించి అడిగేసి వ్యక్తిని వంగి చూశాను. ఆశ్చర్యమే తానై చూశాడు వేణు. ఆయన చీఫ్ అకౌంట్సు ఆఫీసరు!

మీరా సార్!"

"అవునోయ్! నువ్వేదో పనుండి వెళ్తున్నట్టున్నావు".

"నో సార్! మీరు చెప్పండి సార్!"

"మరేం లేదు. ఒకరిని వెతుక్కుంటూ వచ్చాను. ఇల్లు దొరకడం లేదు. వీధిమాత్రం ఇదే!'

"ముందు మా యింటికి రండిసార్! అక్కణ్నించి వాకబు చేద్దాం".

"అలాగే! ముందు కారెక్కు."

వేణు డోరు తెరిచి వెనుక సీట్లో కూర్చున్నాడు.

కారులోంచి దిగగానే వేణు ఇంట్లోపలకు పరుగెత్తాడు "విశాలీ! విశాలీ!" గట్టిగా పిలిచాడు అన్నయ్య అరుపు విని పెరటి నుండి విశాలి వచ్చింది.

"మా చీఫ్ అకౌంటు ఆఫీసరుగారు వచ్చారు మా హెడ్డాఫ్ ది ఆఫీసు ఆయనే! కాఫీ చేసిపెట్టు. త్వరగా!" అని పురమాయించి, గుమ్మం వద్ద నిల్చున్న చీఫ్‌ని సాదరంగా లోపలకు ఆహ్వానించి వాలు కూర్చి వేసాడు వేణు.

కారుడ్రైవరు కారులో నే ఉండిపోయాడు.

ఎప్పుడూ సఫారి సూటులో కనిపించే ఛీఫ్ ఆ రోజు పంచె కట్టుకున్నాడు. భుజాన ఉత్తరియము వేలాడుతూంది. ముఖాన పడుతున్న చెమట చుక్కల్ని ఆయన ఆ ఉత్తరియంతో తుడుచుకుంటున్నారు. ఆయన ముఖమెందుకో కలవలపడుతున్నట్టుంది. అప్పుడప్పుడు ఆయన చేంబర్‌లోకి వెళ్ళేటప్పుడు చేస్తున్నట్లే, వేణు కూర్చోకుండా ఆయన కెదురుగా కొంచెం దూరాన నిల్చున్నాడు.

"చూడు వేణూ! ఈ ఇంటి నెంబరు గల ఇల్లెక్కడుందో చూసి చెప్పగలవా?" ఆయన జేబులో నుంచి ఓ చీటి తీసి అందిచ్చారు. వేణు దానిని అందుకొని తేరిపార చూసి, ఓసారి నుదురు నొక్కుకొని, కాఫీ కప్పుతో ప్రవేశించిన విశాలిని చూసి దగ్గరకు పిలిచాడు. ఆమె మెల్లగా కాఫీ కప్పుని ఆయన చేతికందిచ్చి, దెబ్బతిన్న కాలుని నేలపైన బలంగా మోపకుండా చూసుకుంటూ, నిదానంగా నడచి వచ్చి అన్నయ్య ముందు నిల్చుంది.

"నాకు నడవటం కష్టంగా ఉందని తెలుసుకదా, కాఫీ కప్పు నువ్వే తీసుకువచ్చి ఇవ్వచ్చు కదరా అన్నయ్యా!" ఆమె మెల్లగా అంది. అతను నొచ్చుకున్నట్టు ముఖం పెట్టి, "ప్చ్" అని చెల్లి చేతికి ఆ చీటిని అందిచ్చి, "ఈ ఇంటి నెంబరు ఆయనకు కావాలట." అని మెల్లగా అన్నాడు. ఆమె చీటిని చూసి, కోపంగా అన్నయ్య ముక్కును ఓసారి గట్టిగా లాగి, "నీకుమతిపోతుందిరా అన్నయ్యా! ఆఫీసరుగారిని చూసి, తప్పు చేసినట్టు అలా కంగారుపడతావేం? ఈ ఇంటి నెంబరు మనదే!" అని లోపలకు వెళ్ళిపోయింది.

"అవును సుమా!" అనుకొని, "సార్!" అని గట్టిగా పిలిచాడు.

చీఫ్ తలెత్తి చూచారు.

"ఈ ఇంటి నెంబరుగల ఇల్లు మాదే సార్!"

"అలాగా!' ఆయన కళ్ళను పెద్దవి చేసుకొని చూశారు. "ఎవరు కావాలి సార్?"

"గజపతి అనే అబ్బాయి .."

"నా ఫ్రెండ్ సార్!"

"అలాగా! ఈవేళ సాయంత్రం మూడు గంటల ప్రాంతాన మా ఇంటికి వస్తాడని అతని తల్లి మాకు ఉత్తరం వ్రాసారు. ఇంతవరకూ రాలేదు. గజపతి మీ ఇంటికి రాలేదా?"

"వచ్చాడు సార్! మూడు గంటలకు వెళ్ళిపోయాడు. నేనే బండెక్కించి వచ్చాను"

"ఎక్కడికి?"

"వాడి ఊరుకి.

"ఊరికా!" ఆయన హతాశుడై లేచి నిల్చున్నారు. వేణుకి యేమి తోచక బిత్తర చూపులు చూస్తున్నాడు.

"నాకంతా అగమ్యగోచరంగా ఉంది. మొదట మీ ఇంట్లో దిగి, ఫ్రెండ్‌తో బాటు మా అమ్మాయిని చూసేందుకు వస్తాడని అతని తల్లి వ్రాసారు. ఇప్పుడిల్లంతా బంధుమిత్రులతో నిండి ఉంది. వాళ్ళకేం చెప్పాలి? ముఖ్యంగా మాయందున్న పొరపాటు యేమిటో బోధపడటంలేదు. మోటార్ సైకిల్‌తో బాటు, ఒక చిన్న బంగళా కూడా కట్టిస్తానని వ్రాశాను. నగదూ, బంగారమూ కలసి, మొత్తం లక్ష రూపాయలకు తక్కువకాకుండా చూస్తానని కూడా మాటిచ్చాను. మరెందుకిలా జరిగిందో అర్థం కావటంలేదు ఊరికి రావడమే మా అమ్మాయిని చూడడం కోసం. మరి మా అమ్మాయిని చూడకుండానే ఎందుకు వెళ్ళిపోయాడో!" ఆయన భారంగా అడుగులేస్తూ కారు వేపు నడిచాడు.

గజపతి తన చీఫ్ అకౌంట్సు ఆఫీసరుగారి అమ్మాయిని చూడటానికి ఈ ఊరొచ్చాడన్న మాట! వేణు ఆశ్చర్యం నుండి తేరుకొనేందుకు కొన్ని నిమిషాలు పట్టింది.

వేణు గదిలోకి ప్రవేశించేటప్పటికి విశాల గోడకు జేరబడి వెక్కి వెక్కి ఏడుస్తూ కనిపించింది. ముత్యాలమ్మ నీరసంగా చూస్తూ, కూతురి తలను నిమురుతూ కారణం అడుగుతూంది.


"ఎందుకేడుస్తున్నావ్? ఇప్పుడేమయిందని?" చెల్లి భుజం కుదుపుతూ అడిగాడు వేణు. ఆమె బదులివ్వలేదు. అలా యేడుస్తూనే నిల్చుంది.

"నేను కారణం చెప్పనా?"

విశాలి చటుక్కున యేడుపు ఆపి, అన్నయ్య వేపు చూసింది.

"గజపతికి నిక్ నేమ్సు పెట్టి, ఎగతాళిగా కామెంట్సు పాస్ చేసే రోజులు జ్ఞప్తికి వస్తున్నాయి కదూ!'

ఆమె ఈసారి అన్నయ్య గుండెలో తలదాచుకుంది. □



కె. ఎస్. ఆర్ – అనంతపురం

నైట్ బ్లైండ్‌నెస్ అంటే ఏమిటి? రోగం ఉన్నట్టుగా ఎలా గుర్తించటం? దీనికి చికిత్స ఏమిటి? మందులకి తగ్గుతుందా?

నైట్ బ్లైండ్‌నెస్ అంటే వెలుతురు సరిగా లేని సందర్భాలలో కళ్ళు సరిగా కనబడక పోవటమే! – బాగా వెలుతురు ఉన్న ప్రదేశాన్నుంచి, తక్కువగా ఉన్న ప్రాంతానికో, అసలు వెలుతురు లేని ప్రాంతానికో వెంటనే వెళ్ళినప్పుడు అందరికీ చూపు ఆనటానికి కొంత కాలం పడుతుంది. రోగం ఉన్న వారిలో ఈ పరిమితి చాలా ఎక్కువ.

విటమిన్ 'ఎ' లోపం వల్ల, పుట్టుకలో ఏర్పడే రెటినైటిస్ పిగ్‌మెంటోసా అనే రోగం వల్ల రేచీకటి వస్తుంది.

నేత్ర వైద్యులు రెండో రోగం ఉన్నదీ లేనిదీ తీర్మానిస్తారు. విటమిన్ 'ఎ' ని ఎక్కువ మోతాదులో వైద్య పర్యవేక్షణలో వాడటం వల్ల మొదటి కారణం వల్ల వచ్చే లక్షణం పూర్తిగా నయమవుతుంది.

టి. బి. పి – విశాఖపట్నం

మనకి చాలా ఇష్టం అయినవి తినేటప్పుడు ఎందుకు నోరు ఊరుతుంది?

మనకి ఇష్టమయిన వాటిని తలచుకున్నా కూడా నోరు ఊరుతుంది. నరాల ప్రేరేపణ వల్ల పెరోటిడ్ లాలాగ్రంధి నుంచి లాలాజలం ఎక్కువ ఉత్పత్తి అయి నోటిలోకి విసర్జింపబడటమే దీనికి కారణం.


పావ్‌లోవ్ అనే రష్యా శాస్త్రజ్ఞుడు (ఫిజియాలజిస్టు) దీని విషయమై ఎన్నో పరిశీలనలను కుక్కలకి వాడి చేయడం జరిగింది. ఒక నిర్ణీత సమయంలో గంట కొట్టి కుక్కకి అన్నం పెడుతూ వచ్చేవాడు. గంట వినబడగానే కుక్కలో లాలాజల విసర్జన అధికం అవుతూ వచ్చేది. అదే సమయంలో కడుపులోని గ్యాస్ట్రిక్ జ్యూస్ కూడా అధికంగా ఉత్పత్తి అవుతుంది. మానవులలో కూడా పైవి వర్తిస్తాయి. □

హైదరాబాద్ నోట్‌బుక్

హరేకృష్ణ రథయాత్ర:-

రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మన విందతే- రథారూఢుడైన కేశవుణ్ని దర్శిస్తే పునర్జన్మ ఉండదు- అని పురాణోక్తి. ఈ ఘోర సంసార జంబాలంలో చిక్కుకున్న జీవుల సముద్ధరణ కోసం ఏటా రథోత్సవాలు ఏర్పాటు చేశారు. అలాటి వాటిలో జగన్నాథ రథోత్సవం ముఖ్యమైంది. దానిని పురస్కరించుకొని చైతన్య మహా ప్రభు సంప్రదాయాన్ని అనుసరించిన అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం వారు ప్రపంచ మంతటా రథోత్సవం జరుపుతారు. ఆ పద్ధతిలో జులై 9, 10, 11 తేదీలలో హైదరాబాద్‌లోని ఇస్కాన్‌శాఖ రథయాత్రోత్సవం వైభవోపేతంగా జరిపింది. ఈ రథయాత్ర నాంపల్లిస్టేషన్ రోడ్డులోని హరేకృష్ణ మందిరం నుంచి 9వ తేది మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమై నాంపల్లి, బషీర్‌బాగ్, లోయర్ టాంక్‌బండ్, రాష్ట్రపతిరోడ్ గుండా సాయంకాలానికి సికిందరాబాద్‌లో సంగీత్ టాకీస్ ఎదుట వున్న హరేకృష్ణ మందిరం చేరింది. దాదాపు వంద మంది భక్తులు, వేలాది అభిమానులు ఈ రథయాత్రలో పాల్గొన్నారు దినికి శ్రీల భక్తి స్వరూప దామోదరస్వామి శ్రీపాద్, శ్రీల లోకనాథస్వామి నాయకత్వం వహించారు. శ్రీ మహామన్‌దాస్ అధికారి, శ్రీ అనందమయదాస్ బ్రహ్మచారి, శ్రీ కృష్ణచంద్ర బ్రహ్మచారి (శ్రీ చివుకుల రామకృష్ణ) మున్నగు భక్తులు హరేకృష్ణ సంకీర్తన చేస్తూ నృత్యం చేస్తూ అనుసరించారు. సికిందరాబాద్ మందిరంలో రాత్రి 9-00 వరకు ప్రవచనాలు, సంకీర్తనలు, భజనలు, నృత్యాలు, నాటకాలు మున్నగునవి జరిగాయి. మహామహోపాధ్యాయ డాక్టర్ బి. ఆర్. శాస్త్రి భక్తిని గురించి ప్రసంగిస్తూ, మానవ ప్రేమ భగవత్ప్రేమగా మారితే భక్తి అవుతుందని, మోక్షప్రాప్తికి భక్తి ఒక దశ అని అన్నారు. ముఖ్య అతిథి శ్రీమతి కుముద్ బేన్‌జోషి ప్రసంగిస్తూ, భక్తి సులభ సాధ్యం కాదని, భక్తి యోగం అన్ని యోగాల కన్నా గొప్పదని అన్నారు. కృష్ణ చైతన్య సంఘం చేస్తున్న కృషిని ప్రశంసించారు. సికిందరాబాద్ ఇస్కాన్ వైదిక్ పబ్లిక్ స్కూలు కృషిని ప్రశంసించారు. శరణాగతి అత్యుత్తమ మోక్షప్రాప్తి మార్గమని, శరణాగతి సంకీర్తన ద్వారానే సాధ్యమని, కలియుగంలో సంకీర్తన తప్ప మరొక మార్గం లేదని పురాణాలు ఘోషిస్తున్నాయని, తాను రోజూ భగవద్గీత పారాయణం చేస్తున్నానని గవర్నర్ అన్నారు. శ్రీల భక్తి స్వరూప్ దామోదరస్వామి శ్రీపాద్ ప్రసంగిస్తూ, శ్రీ కృష్ణ చైతన్య విధానం శాస్త్రీయ మైందని, నైతిక మూల్యాలను సముద్ధరించి, ఈ వైదిక్ పబ్లిక్ స్కూలు ద్వారా బాల బాలికలను భావి ప్రపంచ పౌరులుగా తీర్చి దిద్దడం ఇస్కాన్ లక్ష్యమని అన్నారు. వైదిక్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు చైతన్య లీల నాటకం, కృష్ణలీల నృత్యం ప్రదర్శించారు. నాట్యాచార్యులు శ్రీ రామమూర్తి బృందం 'వారు భరత నాట్యం, కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. త్రిదండిస్వామి భక్తి వైభవ మధుసూదన్ మహారాజ్ రథయాత్ర ప్రాముఖ్యం గురించి ప్రసంగించారు. జులై 10వ తేది ఉదయం శ్రీల భక్తి స్వరూప దామోదరస్వామి శ్రీపాద్ దీక్షాహోమం జరిగిన పిదప పది మందికి హరినామ దీక్ష ఇచ్చారు. దీక్ష స్వీకరించిన వారిలో శ్రీమతి లక్ష్మీదేవి (ఎమ్మిగనూరు), శ్రీ గోవిందమూర్తి దాస్ (ఎస్. ఆర్. ఆర్. అండ్ సి. వి. ఆర్. కాలేజీలో కెమిస్ట్రీ ఉపన్యాసకులు- విజయవాడ) మున్నగు వారున్నారు. దీక్షా స్వీకార సమయంలో శ్రీల శ్రీపాద్ ప్రసంగిస్తూ మానవ జీవితం సఫలం కావడానికి ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని ద్వారా దీక్ష పొందాలని నుడివారు. శ్రీల లోకనాథస్వామి ప్రసంగిస్తూ భగవద్గీతలోని మాటలన్నీ యథార్థ మవుతున్నాయని, భక్తి యోగం వల్ల, శరణాగతి వల్ల అన్ని సమస్యలు తీరుతాయని అన్నారు. పిదప రథయాత్ర వీడియో చూపారు. 11వ తేది సాయంకాలం ఉస్మానియా విశ్వవిద్యాలయం హాస్టలులో "సైన్స్ అండ్ రిలిజియన్" అనే విషయమై గోష్ఠి జరిగింది. శ్రీల శ్రీపాద్ గోష్ఠి ప్రారంభించారు. పిదప హరేకృష్ణ ప్రపంచం సినిమా చూపబడింది.

అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం జూలై 9న నిర్వహించిన రథయాత్రలోని రథం.



12వ తేదిన మల్కాజ్‌గిరి వివేకానంద యూత్ క్లబ్‌లో శ్రీల శ్రీపాద్ మతం- విజ్ఞాన శాస్త్రం మున్నగు విషయాలను గురించి ప్రసంగించారు. మూడు రోజుల ఉత్సవంలోని విందులు, ప్రసాద వినియోగం, బీదలకు అన్నదానం జరిగాయి.

ఇద్దరు ప్రముఖులకు సన్మానం:-

శ్రీ సి. ఎస్. ఆర్. కళామందిరం, విజ్ఞానదీపిక జులై 12వ తేది సాయంకాలం త్యాగరాయ గానసభలో ఇద్దరు ప్రముఖులను సన్మానించి, కళారాధన పట్ల తమ భక్తి శ్రద్ధలు ప్రదర్శించాయి. వీరిలో ఒక ప్రముఖ రంగస్థల నటులు శ్రీ కందుకూరి చిరంజీవిరావు. ఈయన ధర్మరాజు, కృష్ణ పాత్రలలో 40 సంవత్సరాలు ప్రసిద్ధులు. అద్దంకి శ్రీ రామమూర్తి బాణిలోను, సి. ఎస్. ఆర్. ఆంజనేయులను అనుసరించారు. రెండవ వారు ప్రముఖ పత్రికా రచయిత శ్రీ పి. ఎస్. ఆర్. ఆంజనేయశాస్త్రి. ఈయన జన్మభూమి, జాగృతి, గోలకొండ, ఆంధ్రజనత, నవ్యాంధ్ర, సినీ హెరాల్డ్ పత్రికలలో పని చేశారు. పెక్కు కథలు రచించారు. పెక్కు కవి సమ్మేళనాలలో పాల్గొన్నారు. ఆకాశవాణిలో ప్రత్యేక బాణిలో వార్తా ప్రసారం చేయడంలో పేరు పొందారు. గండిపద్మ జీవితం కథా సంపుటి విశిష్ట మైంది. సన్మాన సభకు శ్రీ మ్యాటూరి వెంకట సుబ్బారావు అధ్యక్షత వహించారు. శ్రీ సుబ్బారావు, విజ్ఞాన దీపిక అధ్యక్షులు శ్రీ కె. వి. నరసింహారావు, కే.వి. భూపాలరావు సన్మాన్యుల ప్రతిభా విశేషాలు వివరించారు. పిదప సన్మానం జరిగింది. శ్రీ చిరంజీవి రావుకు సమర్పించిన సన్మాన పత్రం పద్యాలలో వుండడం విశేషం. దానిని డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ మనోహరంగా చదివారు. అంధనటులు శ్రీ ఎన్. సి. వి. సుబ్బారావు శ్రీ చిరంజీవిరావును సన్మానించారు. శ్రీ ఆంజనేయ శాస్త్రికి సమర్పించిన సన్మాన పత్రం శ్రీ కె. వి. నరసింహారావు చదివారు. ఈ సందర్భంలో శ్రీ చిరంజీవిరావును నాట్యకళా ప్రపూర్ణ బిరుదంతో సత్కరించారు. శ్రీ చిరంజీవి రావుకు ఇదివరకు నాట్య ప్రవీణ బిరుదం వుంది. శ్రీ చిరంజీవిరావు కృతజ్ఞత తెలుపుతూ, తనను ప్రోత్సహించిన శ్రీ బందా కనక లింగేశ్వరరావును, శ్రీ సి. ఎస్. ఆర్. ఆంజనేయులును గౌరవంతో స్మరించారు. శ్రీ ఆంజనేయ శాస్త్రి కృతజ్ఞత తెలుపుతూ, "నేను గడ్డిపరక వంటి వాడిని. నాకు అర్థ బలం లేదు. అధికార బలం లేదు. రాజకీయ బలం అంతకన్నా లేదు. భర్తృహరి సుభాషితం, భగవద్గీతా వచనం, భారత సూక్తి- మూడింటిని అనుసరించి జీవితం సాగిస్తున్నాను. భర్తృహరి సుభాషితమేమిటంటే, గర్వపడకుండా గడ్డి పరకలాగ వినయంగా వుండడం, కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన అనేది గీతా వచనం. ఒరులేయవి యొనరించిన నరవర అనేది భారత సూక్తి, నా వృత్తి ధర్మం ఈ మూడు సూత్రాలపై నిర్వహించాను; నిర్వహిస్తున్నాను" అన్నారు. శ్రీ దిట్టకవి వేంకటేశ్వరరావు

అన్నిటిలో అనుపమ ప్రతిభ

1986 మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షలలో గుంటూరు, పట్టాభిపురం హైస్కూలుకు చెందిన కుమారి ములకలూరి అనుపమ రాష్ట్రం మొత్తం మీద బాలికలలో మొదటి ర్యాంకు సంపాదించింది. కుమారి అనుపమ తల్లిదండ్రులు శ్రీమతి కనకదుర్గ, శ్రీ సాంబశివరావులు ఇద్దరూ టీచర్లు కావడం వల్ల కుమారి అనుపమ చిన్నప్పటి నుంచి విద్యపై మక్కువ చూపడం వల్ల సాధ్యమయింది అని చెప్పవచ్చు.

అనుపమకు కూచిపూడి, జానపద నాట్యం, నాటకాలలో మంచి ప్రవేశం ఉన్నది. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాలలో 50కి పైగా నాట్య నాటక ప్రదర్శనలిచ్చింది. త్వరలో ఈమె భూటాన్ ప్రభుత్వం ఆహ్వానంపై నృత్యనాటికలు ప్రదర్శించటానికి వెళ్తున్నది.



ఇవే కాకుండా వక్తృత్వము, వ్యాస రచన మొదలగు పోటీలలో 60 సర్టిఫికెట్లు దాకా అందుకున్నది. కుమారి అనుపమ శ్రీ మహంకాళి సూర్యనారాయణ శర్మ వద్ద నాట్యాన్ని ఎంతో దీక్షతో అభ్యసించింది. 1982లో తంతి తపాల వారు దేశ వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో కన్సొలేషన్ బహుమతిని, 1983లో యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన 3వ అఖిల భారత వ్యాసరచన పోటీ లో మొదటి స్థానం కైవసం చేసుకుంది. టి. టి. డి. వారు పెట్టిన పురాణ ప్రబోధ పరీక్షలో రాష్ట్రంలో ప్రథమురాలిగా వచ్చింది. రేడియో, దూరదర్శన్ కార్యక్రమాలలో కూడా పాల్గొన్నది. హిందీ ప్రచార సభవారు నిర్వహించు హిందీ ప్రవేశిక పరీక్షలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురా లయినది. ఎన్నో విజయాలు సాధించిన కుమారి అనుపమ భవిష్యత్తులో ఇంకా గొప్ప విజయాలు సాధిస్తుందనటంలో అతిశయోక్తి ఎంత మాత్రం లేదు.

— ఓరుగంటి వెంకటేశ్వర్లు

హైదరాబాద్ నోట్‌బుక్

ధన్యవాదాలతో సన్మాన సభ సమాప్తమైన పిదప శ్రీ అయ్యదేవర పురుషోత్తమరావు శ్రీ కృష్ణుడుగా, శ్రీ వెముూరి సీతారామశాస్త్రి దుర్యోధనుడుగా శ్రీ కృష్ణరాయబార నాటకం ప్రేక్షకరంజకంగా ప్రదర్శితమైంది.

తెలుగు గోష్ఠి అభ్యర్థన:—

తెలుగు గోష్ఠి, జూలై 13వ తేదీన తెలుగు భాషా సమితి ఆవరణలో జరిపిన సమావేశంలో ప్రాకృతానికి తెలుగుకు గల సంబంధాలను చర్చించింది. ప్రాకృతాలను గురించి తెలుగు వారికి తెలియడానికి కొన్ని గ్రంథాలు రచించాలని సూచిస్తూ, ప్రస్తుతం ప్రాకృత భాషల స్థూల స్వరూపం తెలియడానికి— ఆరు దశాబ్దాల క్రితం శ్రీ మేడేపల్లి వెంకటరమణాచార్యులు రచించిన ప్రాకృత భాషోత్పత్తి అనే గ్రంథాన్ని తెలుగు విశ్వ విద్యాలయం వారు ముద్రించాలని కోరుతూ తీర్మానించారు. తెలుగు భాషా సమితి తెలుగు విశ్వ విద్యాలయంలో లీనమవు తున్నది గనుక తెలుగు గోష్ఠి సమావేశాలు ఈ ఆవరణలో జరుపుకొనడానికి అనుమతి ఇవ్వాలని తెలుగు విశ్వ విద్యాలయాన్ని అభ్యర్థిస్తూ తీర్మానించారు. ఈ సమావేశంలో శ్రీయుతులు చిమకుర్తి శేషగిరిరావు, పాతూరి శ్రీరామమూర్తి, రాంభట్ల కృష్ణమూర్తి, యార్లగడ్డ ఆంజనేయులు, గుమ్మా శంకరరావు, బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు, జి. కృష్ణ, డాక్టర్ టి.వి.జి. శాస్త్రి, డాక్టర్ ఎన్. శివరామమూర్తి, డాక్టర్ పుచ్చా వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, డాక్టర్ చింతా వేంకటేశ్వర్లు, డాక్టర్ రాజారాం, డాక్టర్ ముదిగొండ వీరభద్ర శాస్త్రి, శ్రీ అయ్యదేవర పురుషోత్తమ రావు పాల్గొన్నారు.


ఉపశ్రుతి:—

మిత్రుడు కరణం సుబ్బారావు ఏదో పంచాయతీ జరుపుతున్నాడు. ఎదిరి పార్టీ వ్యక్తి ఒకరు వచ్చి అతన్ని తిట్టి పోశాడు. ఏమిటి మిత్రమా? అంతగా తిడుతూ వుంటే. ఉలకవూ పలకవే?— అనడిగాను. కరణానికి తిట్టుదోషం లేదు, చాకలికి ముట్టుదోషం లేదు— అన్నాడు మిత్రుడు తాపీగా.

— తిరుమల రామచంద్ర

అభిమాన తారలపై అభిప్రాయం

ఒక కొత్త నటుడు తన మొట్టమొదటి చిత్రంలోనే హీరోగా నటించి ప్రేక్షకుల, పత్రికల ప్రశంసలు పొందట మనేది గొప్ప విషయం. ఆ గొప్పను తన సొంతం చేసుకొన్న నా అభిమాన నటుడు అక్కినేని నాగార్జున, "విక్రమ్" చిత్రంలోని టైటిల్ పాత్రలో నవరసాలు మేళవించి నటించారు. నటనలో






ఫైట్స్‌లో, రొమాన్స్‌లో, డాన్స్‌లో తనదైన ప్రత్యేక బాణీలో నటించి అఖిలాంధ్ర ప్రేక్షకుల నీరాజనాలు అందుకుంటున్న నాగార్జున, అనుకరణకు దూరంగా ఉండటం అభినందించ దగ్గ ఆరోగ్యకరమైన లక్షణం. నాగార్జున గారు డైలాగ్ డెలివరీలో ఇంకాస్త శ్రద్ధ తీసుకుంటే బాగా రాణిస్తారు.

—విప్పర్ల శ్రీనివాసరావు, గుంటూరు

★ ★ ★

ఆకాశంలో నక్షత్రాలు ఎన్నిఉన్నను, చంద్రుని దరిలో ఉండేవి కొన్ని మాత్రమే. అలాగే నేటి తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఎంతమంది నటులున్నను, నా అభిమాన నటుడు డేరింగ్, డాషింగ్, డైనమిక్ అండ్ స్నేక్ డాన్సర్ హీరో చిరంజీవి.

"ఇది పెళ్ళంటారా"? చిత్రంలో ఆదర్శ భావాలుగల వ్యక్తిగా జీవించి, మగమహారాజులా వెలుగొందుతూ, దుర్మార్గులను, హంతకులను "జ్వాల"లా తుదముట్టించిన "యమకింకరుడై"న దేవాంతకుడు చిరంజీవి. ఖైదీ చిత్రం ద్వారా "స్నేక్ డాన్సర్"గా అఖిలాంధ్ర ప్రేక్షకుల అభినందనల





కిరీకిరీటాలందుకొన్న చిరంజీవి నా హృదయంలో ఖైదీ అయినాడు. ఎంత క్లిష్టతరమైన పెద్ద పెద్ద డైలాగ్స్‌ను కూడ ముద్దొచ్చే పెదవులతో అవలీలగా చెప్పగల ధీరుడు, మగధీరుడు. వివిధ కథలలో విభిన్న పాత్రలను ధరిస్తూ, నటనా శిఖరాలని అధిరోహించిన "విజేత" చిరంజీవి.

శ్రేయోభిలాషిగా నిర్మాణాత్మకమైన సలహా ఏమిటంటే ఎక్కువగా క్రైమ్ చిత్రాలలో నటించవద్దని, నేటి యువతరానికి, ఒక మార్గదర్శకుడిగా, ఆదర్శమూర్తిగా, వారి సమస్యలకు పరిష్కారాన్ని చూపే పాత్రలలో నటించమని కోరుతున్నాను.

చివరిగా నాదొక చిన్న కోరిక. చిరంజీవి ముగ్ధమనోహరముగా ఉండి, అమాయకంగా ఉండి ఏమి తెలియని అందే చదువు, సంస్కారము లేని మొద్దు అవతారంలో ఉండే పాత్రలో నటించి, హీరోయిన్ చేత చదువు సంస్కారముతో తీర్చి దిద్దబడి, ఆమెచే ప్రేమించి పెళ్ళి చేసుకొనే పాత్రలో నటిస్తే చూడాలని ఆశగా ఉంది.

—పి. సువర్ణ, రామక్రిష్ణపురము, హైదరాబాద్

★ ★ ★

నా అభిమాన నటి "సూపర్‌స్టార్ విజయశాంతి" 'ముక్కు పుడక' చిత్రంలో త్యాగశీలిగా ఆమె నటన నన్ను తన అభిమానిగా చేసింది. నేను ఆ చిత్రం చూచిన రోజే నా మిత్రుడితో "ఈమె భవిష్యత్తులో మంచి చిత్రాలలో నటించి ఉత్తమ నటి ఔతుంది" అని చెప్పాను. అద్భుత నటనా కౌశలంతో క్లిష్టపాత్రలను కూడా సమర్థవంతంగా పోషించి






అనతి కాలంలో చిత్ర పరిశ్రమలోనూ, అఖిలాంధ్ర ప్రేక్షక హృదయాలలోనూ శాశ్వత స్థానాన్ని సంపాదించి నటనలో ఎవరెస్టు శిఖరాన్ని చేరుకొన్న విజయ శాంతి నా అభిమాన తార కావడం నా అదృష్టం. విజయశాంతికి డబ్బింగ్ చెప్పడం తెలియనందుకు నేను చాలా విచారిస్తున్నాను.

సావిత్రి, వాణిశ్రీ, జయసుధల వారసురాలై పండిత పామరులను ఆకర్షించే అందం, ఆకర్షణ, నటనా చాతుర్యం గల "సిల్వర్ స్క్రీన్ బ్యూటీ కుమారి విజయశాంతి "స్వీయ కంఠంతో మృదు మధురంగా తన పాత్రలకి తానే డబ్బింగ్ చెప్పడం నేర్చుకుని నావంటి అభిమానులను సంతృప్తి పరచాలన్నదే నా

అభిలాష. ఇన్స్‌పెక్టర్ పాత్రలో, ఝాన్సీలక్ష్మి, రాణిరుద్రమ్మ, సతిసావిత్రి, ద్రౌపది, సీత వంటి చారిత్రక, పౌరాణిక పాత్రలలో నటించవలెనన్నదే నా అభిమాన తార విజయశాంతికి ఓ అభిమానిగా నా మనవి.

—కె. గోపి, ఐరాల క్రాస్ రోడ్, చిత్తూరు

స్నిగ్ధ సౌందర్యాల సౌదామినిలా, రమణీయ రసవాహినిలా ప్రేక్షక హృదయాలపై ముగ్ధ మనోహర రూపలావణ్యాన్ని, అపురూప అభినయప్రావీణ్యాన్ని ముద్రించే మధుర దరహాస "సుహాసిని"కి నేను అభిమానిని. నటనలో నవశిఖరాల నధిరోహిస్తూ "సింధుభైరవి" ద్వారా జాతీయ అవార్డును పొందిన






శుభతరుణాన అభినందిస్తున్నాను. అలంకరణలో కూడ అతి ఏమి లేకుండా కేవలం నటనా వైదుష్యం తోనే ప్రేక్షకుల హృదయ సింహాసనాల్ని అధిరోహించింది. తెలుగు చిత్రాల ద్వారా జాతీయ అవార్డు పొందాలని ఆకాంక్షిస్తున్నాను. మంచి చిత్రాలలో నటిస్తూ సినీ నందన వనంలో నందివర్ధనంలా దినదిన ప్రవర్ధమానం కావాలని, తన పాత్రకి ప్రాధాన్యత కల చిత్రాలలో నటించాలని కోరుతున్నాను.

—జి. శ్యామ్‌సుందర్ పాల్, ఓల్డ్ టౌన్, అనంతపురం

★ ★ ★

నా అభిమాన నటుడు నటశేఖర కృష్ణగారు గాంభీర్యమైన నటన ప్రదర్శించడంలో అతని కతడే సాటి. దీనికి ఉదాహరణగా అగ్ని పర్వతంలో 'జమదగ్ని'గా ఆయన చేసిన నటన చెప్పుకోవచ్చు. చిత్రసీమలో రికార్డ్సు సృష్టించడంలో కృష్ణగారే నెంబర్ ఒన్. నేను ఆయన చిత్రాలలో కృష్ణగారిని ఒక విప్లవకారునిగ, కార్మిక నాయకునిగ, ప్రజల ప్రతినిధిగా చూడాలనుకొంటాను. కృష్ణగారికి





అటువంటి పాత్రలు చాలా చక్కగా సరిపోతాయి. కొన్ని ట్రాజెడీ సీన్సులో మాత్రం నటనలో జీవించాలి. ఆయన వ్యక్తిగతంగా కూడ ఎన్నోసార్లు బాధితులను, పీడితులను, అన్నార్తులను ఆదుకొని మహామనిషి అనిపించుకొన్నారు. ముందు ముందు ఇంకా ఎన్నో రికార్డ్సు సృష్టించాలని, విజయాలను చవి చూడాలని కోరుతున్నాను.

పి. గంగాధరనాయుడు, పామిడి □

సూపర్ హీరోయిన్ విజయశాంతి సమాధానాలు



యం. రత్నకుమార్, గూడూరు

స్త్రీలందరూ దుర్మార్గుల మీద ప్రతిఘటించితే ఈ దేశం ఎప్పుడో బాగుపడేది? ఏమంటారు?

సమయం ... సందర్భాల్ని బట్టి ప్రతిఘటిస్తేనే బాగుంటుంది. దుర్మార్గుడు కూడా మనిషే! అతనికీ మంచి – చెడు అనే విషయాలు తెలుసు అని నా అభిప్రాయం.

కె. వనజాక్షి, మంచికలపూడి

వరకట్నంపైమీ అభిప్రాయం?

సదభిప్రాయం మాత్రం లేదు.

పి. జ్యోతిసాలమన్, ఫర్టిలైజర్‌సిటీ

మనిషి (ని) వెంటాడే వివిధ మతాలు ఏ నాటికి అతని జీవితంలో విజయాన్ని, శాంతిని అనుగ్రహించగలవో చెప్పగలరా విజయశాంతి గారూ...?

ఏ మతానికి భయపడక తనదైన అభిప్రాయాన్ని హృదయంలో గట్టిగా వుంచుకున్న నాడు మనిషి ఆడైనా మగైనా తాననుకున్న విజయాన్ని సాధించినట్లే!

వై. రాంజీ, మైలవరం; డి. సూర్య నారాయణరావు, ఖమ్మం

మీ దృష్టిలో మీ అభిమానులు ఎలా వుండాలి?

నా అభిమానులు దురభిమానులుగా మారకుండా నలుగురికి చేతనయినంత సహకారాన్ని అందిస్తూ వుండాలని, వారి జీవితాలు చక్కగా సాగాలని అభిప్రాయ పడ్తాను.. కోరుకుంటాను.

యన్. లక్ష్మీనారాయణరావ్, తాళ్ళపూడి

శోభన్‌బాబు, చిరంజీవి గార్లపైమీ అభిప్రాయం?

సదభిప్రాయమే!

రాగతి వెంకట్రావ్, విశాఖపట్నం

సినీ జీవితమే నిజజీవితంగా భావిస్తున్న అభిమానులకు మీరిచ్చే సలహా ఏమిటి?

"దూరపు కొండలు నునుపు" అన్న సామెతను జ్ఞాపకం చేసుకోమని అంటాను.

ఉత్తమ ప్రశ్న

యస్. కె. లాల్‌మహ్మద్, సత్తుపల్లి

"నేటి భారతం, దేశంలో దొంగలు పడ్డారు, వందేమాతరం, ప్రతిఘటన" వంటి ఉత్తమ చిత్రాల్లోనే మీరు నటించాలని మీ అభిమానిగా నా కోరిక.

మీ అభిమానానికి కృతజ్ఞురాల్ని. సినిమా నటిగా అన్నిరకాల పాత్రలకు న్యాయం చేకూర్చా లన్నదే నా అభిమతం.

మోహన్, తుంబకుప్పం

ప్రేమించి పెళ్ళి చేసుకోవడం గొప్పా? పెళ్ళి చేసుకుని ప్రేమించడం గొప్పా? ఇందులో ఏది గొప్పదంటారు?

పెళ్ళికి ముందు అభిమానాన్ని పెంచుకొని పెళ్ళి చేసుకున్నాక ప్రేమించుకుంటే బాగుంటుందేమో! ప్రేమ ... పెళ్ళి విషయాల్లో గొప్పదనాన్ని దరి చేరనీయరాదు.

టి. శ్రీనివాసరావు, కైకలూరు

ఈనాడు స్త్రీకి న్యాయం జరగాలంటే సాటిస్త్రీగా మీరిచ్చే సమాధానమేమిటి?

నేడు సమాజంలో స్త్రీకి మగాడితో బాటు సమాన హక్కులు లభించాయి. సాటి స్త్రీకి అన్యాయం జరిగిందని తెలిస్తే ఏ స్త్రీ కూడా చేతులు ముడుచుకుని కూర్చోరాదు.

విజయసారధి, నల్గొండ

సమాజాన్ని సంస్కరించి సన్మార్గంలో నడిపించడంలో సినిమా నటీనటులు గొప్ప పాత్రను నిర్వహించగల సమర్థులు వారు కిరీటాలు లేని శాసనకర్తలు అని నేనంటాను... నా అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా?

కొంత వరకూ....

కె. రమేష్, బాగల్‌కోట్

మీరు ఓ సినిమాలో నటించే ముందు సినిమా కథకు ప్రాధాన్యమిస్తారా? లేక మీ పాత్రకే ప్రాముఖ్యత నిస్తారా?

ఒకోసారి సందర్భాన్ని బట్టి, కొన్నిసార్లు ఆయా సంస్థల్ని బట్టి కథ గురించి చర్చాన్వేషణ జరుగుతుంది.

యస్. వాణిశ్రీ, తెనాలి

ఈ నాటి సినిమాలను కుటుంబ సమేతంగా చూడలేక పోతున్నాము. ఎందుకనంటారు?

మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా సినిమా నిర్మాణం జరుగుతుంది. పాత చిత్రాలు చూడ్డానికి అలవాటు పడ్డ మీరు కొత్త చిత్రాల్ని చూడటానికి ఇంకా అలవాటు పడినట్లు లేరు. ఇక మీదటైనా అలవాటు చేసుకోండి. □

కూపన్

ఆంధ్రసచిత్ర వారపత్రిక
విజయశాంతి సమాధానాలు

ప్రశ్న : ____________________

____

పంపిన వారి పేరు : ____________________

పూర్తి చిరునామా : ____________________

Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3, Editor: S. Radhakrishna; Phones.- Business: 61247, 61248, Editorial: 75667



"చైతన్యం"లో సాగరిక



పవిత్ర, "కారుదిద్దిన కాపురం"లో

కృష్ణంరాజు ద్విపాత్రాభినయంతో "శ్రీరామ చంద్రుడు"

రామ లక్ష్మణులవంటి అన్న దమ్ముల పాత్రలను కృష్ణంరాజు పోషిస్తున్నారు అన్న జడ్జి సరసన సుజాత, తమ్ముడు వ్యవసాయదారుని సరసన విజయశాంతి నాయికలు అక్టోబరులో షూటింగ్ పూర్తయిపోతుంది అన్నారు ప్రముఖ హాస్య నటుడు, నిర్మాత కె జె సారది ఈయన డాక్టర్ ఎం ప్రభాకరరెడ్డి కథ, సమర్పణలో నిర్మించే లక్ష్మి కిరణ్ ప్రొడక్షన్స్ వారి పై చిత్రంలో సత్యనారాయణ ప్రభాకరరెడ్డి, కోట శ్రీనివాసరావు, సారథి, ఎస్ వరలక్ష్మి రమాప్రభ జయమాలిని వగైరా నట వర్గం మద్దిపట్ల సూరి, కొండముది శ్రీరామచంద్రమూర్తి మాటలు రాశారు గోపి గీతాలకు సత్యం స్వరకర్త సత్తిబాబు ఛాయ, బి ఎస్ కృష్ణ శిల్పం, కె ఎ మార్తాండ్ కూర్పు పుల్లారావు అప్పారావు సంయుక్త దర్శకత్వం శ్రీనివాస్ ప్రొడక్షన్‌తో బి బాస్కరరావు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు

"కారు దిద్దిన కాపురం"లో ఆగని రథం

తెలుగు దేశంలో 55 ఏళ్లకే ఉద్యోగ విరమణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది ఆ ఆదేశం ప్రకారం రాఘవరావు ఉద్యోగం మధ్యలో ఊడిపోయింది కోర్టు వారి పుణ్యమా అని మళ్లీ 58

సినిమా విశేషాలు

-జి.వి.జి.

ఏళ్లవరకూ ఉద్యోగం కొనసాగవచ్చని మరో ఆదేశం వచ్చింది ఆ కారణంగా, అకారణంగా పదవి విరమణ చేసిన రాఘవరావును వచ్చి ఉద్యోగంలో చేరమనీ, మరో మూడేళ్లు ఆ పదవిలో కొనసాగమనీ ప్రభుత్వం ఆహ్వానించింది బాధ్యతలు స్వీకరించడానికి బయలుదేరిన రాఘవరావుకు దిష్టి తగుల్తుందనే భయంతో భార్య ఇందుమతి గుమ్మడికాయతో దిష్టితీసేసి దాన్ని నడిరోడ్డు మీద పగలగొట్టి వచ్చింది ఇంతకీ రాఘవరావు మాజీ రిటైర్డ్ ఇంజనీరు ముగ్గురు ఆడపిల్లల తండ్రి

రిక్షాలో ఆపీసుకు వెళ్లబోతున్న రాఘవరావుతో ఇటువంటి అప్రాచ్యపు పనులు చేయబట్టే ఉన్న ఉద్యోగం ఊడింది రిక్షాలో ఎడమకాలు పెడతారేం? కుడికాలు పెట్టండి. అంది ఇందుమతి

అదా అయామ్ సారీ! అంటూ కుడికాలు పెట్టాడు రాఘవరావు

ఆగండి నే వెళ్లి ఎదురొస్తా, అంది ఇందుమతి

ఇంతలో వెనకనుంచి ఎవరో తుమ్మారు భార్యాభర్త లొకరి ముఖాలొకరు చూసుకున్నారు రిక్షావాడు అయోమయంగా నిలబడ్డాడు

వెనక తుమ్ము ముందుకు మంచిదే పోనీ రిక్షా అన్నాడు రాఘవరావు

వెనక టైర్లో గాలిపోయిందన్నట్టు ముఖం పెట్టాడు రిక్షావాడు

గాలిపోయినా, టైరు బరస్టయినా సరే – ఈ రథం ఆగడానికి వీల్లేదు పోనియ్! దర్జాగా అన్నాడు రాఘవరావు

ప్రభుత్వం వారు గాలి తీసేసిన గత వైభవాన్ని నెమరేసుకుంటూ కొత్త ఊపిరి పీల్చుకుంటున్న ఈ రాఘవరావు వెంట ప్రేక్షకులను నడిపించే హాస్యవల్లరి ఉషాకిరణ్ మూవీస్ 'కారు దిద్దిన కాపురం' డి వి నరసరాజు కథ, స్క్రీన్‌ప్లే మాటలు, దర్శకత్వంలో రామోజీరావు నిర్మించిన ఈ చిత్రంలో పవిత్ర, రాజేంద్ర ప్రసాద్, నూతన్‌ప్రసాద్, రమాప్రభ, వేలు, శ్రీ లక్ష్మి నాగేష్, కమలాకర్, మమత శ్రీశైలజ సంగీత వై విజయ, మాడా, కల్పనారాయ్, డిస్కో శాంతి, విద్యాసాగర్ నటించారు వేటూరి గీతాలు, సత్యం సంగీతం, నవకాంత్ ఛాయ, బాస్కరరాజు శిల్పం, గౌతంరాజు కూర్పు, శివసుబ్రహ్మణ్యం నృత్యాలతో అట్లూరి రామారావు నిర్మాణ సారధి మయూరి ద్వారా ఆగస్టు విడుదల

నిర్మాత మిద్దె రామారావు



వినయ్ ఆర్ట్ పిక్చర్స్ తొలి చిత్రానికి నిర్మాణ సారథ్యం వహిస్తున్నారు.

నేడు చిత్ర నిర్మాణ వ్యయం మితిమీరడానికి ఎన్నో కారణాలున్నాయి. స్లాబ్ సిస్టం, కొనుగోలుదారులు, ఒక కారణం. ఇందువల్లే ఆర్టిస్టులు రెమ్యూనరేషన్లు పెంచడం కూడా. అన్నిటికన్నా మించిన మరొక కారణమేమిటంటే - ఎంతో మంది కొత్త నిర్మాతలు పరిశ్రమలోకి ప్రవేశిస్తున్నారు. సినిమారంగం పట్ల మోజుకొద్దీ, తేలికగా-త్వరితంగా డబ్బు సంపాదించవచ్చనే ఆశతోనో, మరి దేని వల్లనో వస్తున్నారు. చిత్రనిర్మాతకు ఆర్థిక స్థోమతే కాక, విషయ పరిజ్ఞానం, అన్ని శాఖలతో పరిచయం, ఉత్తమాభిరుచితో పాటు వ్యాపార దక్షత కూడా ఉండాలి. అది లేనందువల్లే కొందరు కొత్త నిర్మాతలు మొదటి చిత్రాన్ని విడుదల చేసిన తర్వాత రెండో చిత్రాన్ని ప్రారంభించలేక పోతున్నారు. వీళ్ళు నష్టపడే విషయం అటుంచితే, చిత్ర నిర్మాణ వ్యయం అనవసరంగా పెరిగిపోవడానికి దోహదం చేస్తున్నారు. ఐతే, ఎప్పటికప్పుడు కొత్త నిర్మాతలు వస్తుండడం వల్ల చిత్ర పరిశ్రమ మాత్రం పచ్చగా కళ కళలాడుతున్నట్లుగా కనిపిస్తూ, మరికొందరు కొత్త వారిని ఆకర్షిస్తోంది." అన్నారు మిద్దె రామారావు.

చిత్ర నిర్మాణంలో ప్రాజ్ఞత గలిగి, వ్యాపార దక్షత తెలిసిన అనుభవజ్ఞులే చిత్ర నిర్మాతగా చిరకాలం రాణించగలరని నిరూపించిన నిర్మాతలలో ఈయనొకరు.

"ఎప్పుడూ ఏదో కొత్తదనం, మార్పు కోసం ప్రయత్నించడమే నా లక్ష్యం. కథల్లోనూ, కథనంలోనూ, పాత్రల్లోనూ వైవిధ్యం ఉండాలని నా తపన. అలాంటి వినూత్నమైన ఇతివృత్తాన్ని సమకూర్చుకోగలిగితే, సగం విజయం లభించినట్లేనని నా విశ్వాసం. అందుకే ఏమాత్రం తీరుబడి వున్నా పుస్తకాలు తెగ చదువుతాను. అదొక్కటే నా వ్యసనం. కథాబలం లేకపోవడం వల్లే చాలా చిత్రాలు నేడు పరాజయం పొందుతున్నాయన్న విషయం అందరూ ఎరిగినదే. అయితే ఆర్టిస్టుల కాల్షీట్లు దొరికాయని ఏదో ఒక కథ తీసుకొని, హడావిడిగా సినిమా తీసేసి, దేశం మీదికి పంపించేస్తున్నారు కొందరు. నిర్మాతలుగా ఉన్నాం గనుక తప్పనిసరిగా ఏదో ఒక చిత్రం తీసి విడుదల చేయాలంటేఎలా? డబ్బు పెట్టి టిక్కెట్టు కొనే ప్రేక్షకులకు నచ్చొద్దూ? ఇటీవల విడుదలైన కొన్ని బిగ్ బడ్జెట్ చిత్రాల గతి ఏమైందో అందరికీ తెలుసు. చిత్రాన్ని ఎంత బాగా తీశారన్నదేగాని,ఎంత కాస్ట్లీగా తీశారన్నది కాదు సగటు ప్రేక్షకుడికి కావలసింది. రిచ్‌నెస్ ఒక్కటే బాక్సాఫీస్ హిట్ అవడానికి దోహదకారి కాదు అని ఋజువైంది. అన్నారు మిద్దె రామారావు.

ఈయన రాజమండ్రి దగ్గర గోకవరంలో 1955లో జన్మించారు. బి. ఎ. చదువుతూ మానేసి, వాళ్ళ ఊళ్ళో 'కుసుమా టూరింగ్ టాకీస్'ను పదేళ్ళపాటు నడిపారు. అందుకే ప్రేక్షకుల నాడి ఈయనకు బాగా తెలుసు. 1975లో "పండంటి సంసారం" చిత్రాన్ని తూర్పు గోదావరి జిల్లాకు కొన్నారు. బావమరిది అంగర సత్యంతో కలిసి, "కొండవీటి పిరుడు, కక్ష-శిక్ష, ప్రచండ వీరులు" చిత్రాలను తెలుగులోకి డబ్ చేశారు.

"పదహారేళ్ళ వయసు" స్ట్రెయిట్ చిత్రాన్ని తీశాక స్వయంగా నిర్మించిన తొలి చిత్రం "నిండు నూరేళ్ళు". ఇంతవరకు ఈయన తయారు చేసిన 11 చిత్రాలలో 90 శాతం విజయవంతమైనవే.

ఇప్పుడు సుమన్ హీరోగా శరత్ దర్శకత్వంలో శ్రీ రాజలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ "చాదస్తం మొగుడు" చిత్రాన్ని నిర్మిస్తూ, కృష్ణ-శ్రీదేవి జంటతో కె. బాపయ్య దర్శకత్వంలో టి. శ్రీనివాసరెడ్డి నిర్మించే వినయ్ ఆర్ట్ పిక్చర్స్ తొలి చిత్రానికి నిర్మాణ సారథ్యం వహిస్తున్నారు.

ఎక్కువమంది దర్శకులను, సాంకేతిక నిపుణులను చిత్ర పరిశ్రమకు పరిచయం చేసిన ఘనత ఈయనకు దక్కుతుంది.

కథారచయితలుగా భీశెట్టిని "పండంటి జీవితం, ప్రేమమూర్తులు" ద్వారా, వసుంధరను "రామ రాజ్యంలో భీమరాజు" ద్వారా, గిరిజశ్రీ భగవాన్‌ను, "గూండా" ద్వారా, ఛాయాగ్రాహకుడు సుధాకరరెడ్డిని "నిప్పులాంటి మనిషి" ద్వారా, డైరెక్టర్ ఎస్. బి. చక్రవర్తిని "సంపూర్ణప్రేమాయణం" ద్వారా పరిచయం చేశారు. శరత్‌ను తాజా చిత్రం "చాదస్తం మొగుడు" ద్వారా పరిచయం చేస్తున్నారు.

"ఇంకా ఎవరెవర్ని పరిచయం చేయ బోతున్నారు?" అడిగాను.

"మరో ఇద్దరు కొత్త డైరెక్టర్లను" అన్నారాయన.


"వాళ్ళ పేర్లు తెలుసుకోవచ్చా?"

"ఒకరు - రచయిత సత్యానంద్."

"మరొకరు?"

"నేనే!" అంటూ నవ్వేశారు.

-(జి. వి. జి)



"పసుపుతాడు"లో రాధ, నూతన్‌ప్రసాద్



"చల్లని రామయ్య- చక్కని సీతమ్మ"లో మురళీమోహన్, వీరభద్రరావు

నెఫ్జా సంగీత నృత్యోత్సవాలు :—

నెల్లూరు ఫిలిం జర్నలిస్టు ఆధ్వర్యములో జూలై 12, 13 తేదీలలో అఖిల భారత స్థాయిలో నృత్యంలోనూ, సంగీతంలోను పోటీలు నిర్వహించ-బడ్డాయి. 12 వ తేది ప్రారంభోత్సవ సభకు శ్రీ కె. వి. సుబ్బారెడ్డి యం. యల్. ఏ. అధ్యక్షత వహించగా శ్రీ జె. వి. రెడ్డి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. సినీనటి కుమారి వెన్నెల నటరాజ పూజ చేసారు. దేశం నలుమూలల నుండి సుమారు 500 మంది కళాకారులు ఈ ఉత్సవాలలో పాల్గొన్నారు. నృత్యదర్శకులు శ్రీ దనూష్‌ని నెఫ్జా తరుపున శ్రీ జె. వి. రెడ్డి సన్మానించారు. 13 వ తేదీ బహుమతి ప్రదానోత్సవ సభకు ఎక్సయిజ్ అసిస్టెంటు కమీషనర్ శ్రీ రాజగోపాల్ నాయుడు అధ్యక్షత వహించగా అడిషనల్ యస్. ఏ. శ్రీ కాశీనాథ్ ము...



"పదహారేళ్ళ అమ్మాయి"లో ఒక దృశ్యం



అసాధ్యుడవయ్యా డైరెక్టరూ! మనం డబ్బుకోసం సిన్మాతీస్తే, గొప్ప సెక్స్ ఎడ్యుకేషన్ ఫిలింగా అవార్డు కూడా వచ్చేసింది కదయ్యా!

అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ సంగీత దర్శకులు శ్రీ జె. వి. రాఘవులుని నెఫ్జా సంగీత సామ్రాట్ బిరుదుతో గౌరవించింది. పోటీలలో విజేతలకు సినీనటి కుమారి సాగరిక బహుమతులను పంచి పెట్టారు. నెఫ్జా సుందరరామిరెడ్డి వందన సమర్పణతో కార్యక్రమాలు ముగిసాయి.

విజేతలు

కూచిపూడి సినియర్సు : మొదటి బహుమతి : ఆశాలత – ఆదోని. రెండవ బహుమతి యం. వి. మురళి, ఆదోని.

జూనియర్సు :– మొదటి బహుమతి :– అన్‌జని క్రిష్ణ, నెల్లూరు. రెండవ బహుమతి : కె. నాగమోహిని, ఒంగోలు. మూడవ బహుమతి – మల్లిక, ప్రొద్దుటూరు.

భరత నాట్యం – సినియర్సు : మొదటి బహుమతి – వి. త్రిష్న, విజయవాడ. రెండవ బహుమతి – పావన కుమారి, తిరుపతి. మూడవ బహుమతి – ఆశాలత, ఆదోని. జూనియర్సు : మొదటి బహుమతి – కె. నాగమోహిని, ఒంగోలు. రెండవ బహుమతి – మల్లిక, ప్రొద్దుటూరు. మూడవ బహుమతి – అనుపమ, ఒంగోలు.

ఓరియంటల్ డ్యాన్సులు : మొదటి బహుమతి – అశోక్ అండ్ అనుపమ, ఒంగోలు. రెండవ బహుమతి – నిత్యానందం, నెల్లూరు. మూడవ బహుమతి – ఎ. కళ్యాణకుమార్, చీరాల. జూనియర్సు : మొదటి బహుమతి – సుకన్య, నెల్లూరు. రెండవ బహుమతి – భవానీ, చీరాల. మూడవ బహుమతి– పెంచల లక్ష్మి, నెల్లూరు.

తెలుగు సినిమా పాటలు : స్త్రీలు – మొదటి బహుమతి – చిత్రభాను, భీమవరం; రెండవ బహుమతి – జయంతి, నెల్లూరు. మూడవ బహుమతి నందిత, అనంతపూర్. పురుషులు : మొదటి బహుమతి – ధైర్యప్రసాద్, కడప. రెండవ బహుమతి – విమల్ బాబు, ఏలూరు. మూడవ బహుమతి – అన్‌జన్‌కుమార్, హనుమాన్ జంక్షన్.

లలిత సంగీతం : స్త్రీలు : డి. శారద లక్ష్మి, ప్రొద్దుటూరు – మొదటి బహుమతి. రెండవ బహుమతి – అరుణ, చీరాల. మూడవ బహుమతి – జి. పద్మ, అనకాపల్లి. పురుషులు : మొదటి బహుమతి – బ్రహ్మయ్య, విజయవాడ, రెండవ బహుమతి – మల్లిఖార్జునరావు, ధవళేశ్వరం. మూడవ బహుమతి – పట్టాభిరామశర్మ, కొవ్వూరు.


హిందీ పాటలు : మొదటి బహుమతి : కె. రాజయ్య, కొత్తగూడెం. రెండవ బహుమతి : యం. మురళికృష్ణ, అనంతపురం. మూడవ బహుమతి : శోభారాణి, భీమవరం. ☐

నెఫ్జా సంగీత నృత్యోత్సవాలలో ఉత్తమ గాయనిగా ఎన్నికైన సినీనటి సాగరిక నుండి షీల్డు అందుకుంటున్న కుమారి శారదాలక్ష్మి, ఉత్తమ నర్తకిగా ఎన్నికైన ఆశాలత బహుమతి నందుకుంటున్న దృశ్యం. నెఫ్జా సుందర రామిరెడ్డిని కూడా చిత్రంలో చూడవచ్చు





DESIGNED BY P A RANGA



గ్లూకోన్-డి సూపర్‌హీరో.
ఉక్కపోస్తూ అలుపు
పుట్టించే రోజున కూడా
ఉరకలు వేసే శక్తి.
Glaxo
Glucon-D®
Glucose-D
GL
High-grade, finely powdered glucose enriched with vitamin D and calcium phosphates.
200 GRAMS NET
GLAXO LABORATORIES (INDIA) LTD.
Dr. Annie Besant Road,
Bombay 400 025, India.
® Trade Mark
Maximum Price Rs.
Local Taxes Extra
LOT
MONTH
అసలైన, కొత్త, రంగురంగుల ప్యాక్ కోసం చూడండి.
అలుపు తెచ్చే వేసవి రోజున మీ అబ్బాయికి కావలసింది గ్లూకోన్–డి: గ్లూకోజు, విటమిన్ డి, కాల్షియం ఫాస్ఫేట్సు గల తక్షణ శక్తినిచ్చే పానీయం.
గ్లూకోన్–డిని పళ్లరసం, పాలు, టీ, కాఫీ, లేదా నీళ్లలో కలిపారంటే కుటుంబం మొత్తానికి ఒక ఉల్లాస పానీయంగా తయారై పోతుంది.
100, 200, 500 గ్రాముల ప్యాకులలో లభిస్తుంది.
గ్లాక్సో వారి గ్లూకోన్–డి.
గ్లూకోన్-డి ⓣ
సూపర్‌హీరో అమితంగా ఇష్టపడే శక్తినిచ్చే పానీయం.
GLL-2389


ఉషా కిరణ్ మూవీస్
కారుదిద్దిన కాపురం
KDK 1986